
సోమవారం 2-1-2023


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 282

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



హరియాణా మంత్రి రాజీనామా

లైంగిక వేధింపుల ఆరోపణలతో రాజీనామా చేసిన మంత్రి సందీప్‌సింగ్ - 6లో



ఉన్నట్టుండి ఉద్యోగం పోతే?

ముందుగానే సన్నద్ధమై ఉండాలి.. జాబ్ లాస్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు.. - 13లో



దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం

డిసెంబర్‌లో అత్యధికంగా 8.3 శాతానికి నిరుద్యోగం రేటు ఎగబాకింది. గత 16 నెలల్లో అదే అత్యధికం.


- వివరాలు 6లో▶



హైకోర్టు జడ్జిల్లో వారు 15 శాతమే

హైకోర్టుల్లో నియమితులైన న్యాయమూర్తుల్లో వెనుకబడిన తరగతుల వారు 15% మందే ఉన్నారని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ తెలిపింది.

- వివరాలు 6లో▶



హెల్త్ సైన్సెస్ ఫీజు రూ.15వేలు!

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కొత్తగా ప్రవేశపెట్టబోయే బీఎస్సీ హెల్త్ సైన్సెస్ కోర్సు ఫీజును రూ.15 వేలుగా ప్రతిపాదించినట్లు తెలిసింది.

- వివరాలు 14లో▶



క్షిపణి ప్రయోగంతో స్వాగతం

ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగంతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

- వివరాలు 6లో▶

కాటేసిన 'కానుక'

చంద్రబాబు ప్రచార యావకు మరో ముగ్గురు బలి



వాహనం నుంచి చంద్రన్న కానుక కిట్లను విసిరేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చంద్రన్న కానుకల కోసం ఐదున్నర గంటల పాటు మహిళల పడిగాపులు

- గుంటూరులో మధ్యాహ్నం 1 గంటకే వేదిక వద్దకు తరలింపు
- 30 కౌంటర్లంటూ 12తో సరి.. లారీల నుంచే పంపిణీ
- చివరకు డివిజన్లలో ఇస్తామంటూ చేతులెత్తేసిన నిర్వాహకులు
- తొక్కిసలాటలో ముగ్గురు మహిళల మృతి
- చీరలు కొన్నది పది వేల మందికే.. టోకెన్లు 30 వేల మందికి
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు.. గాయపడ్డ వారికి రూ. 50 వేలు చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, గుంటూరు: పత్రికల్లో ఫొటోలు, టీవీల్లో వీడియోలు, డ్రోన్ కెమెరా షాట్లు లక్ష్యంగా టీడీపీ ఆదివారం గుంటూరులో నిర్వహించిన చంద్రన్న కానుకల పంపిణీ ముగ్గురు పేద మహిళల ప్రాణాలను బలి తీసుకుంది. అధికారంలో ఉండగా 2015లో గోదావరి పుష్కరాల సమయంలో 29 మందిని బలిగొన్న చంద్రబాబు ప్రచారార్భాటం గతవారం కందుకూరు ఇరుకు సందుల్లో నిర్వహించిన కార్యక్రమం 8 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ దారుణాన్ని మరచిపోకముందే నూతన సంవత్సరం తొలిరోజే మరో విషాదం చోటు చేసుకుంది. ఈసారి ముగ్గురు పేద మహిళలు బాబు వికృత రాజకీయ క్రీడకు బలయ్యారు. మరో 17 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. తన రాజకీయ ప్రచార పదఘట్టనల కింద సామాన్యులు

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

వంద శాతం క్లీన్‌సిటీగా హైదరాబాద్



వంద శాతం మురుగునీటిని శుద్ధి చేస్తున్న నగరంగా కొద్ది నెలల్లోనే హైదరాబాద్ దేశంలోనే తొలి స్థానంలో నిలవనుందని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో రూ. 263 కోట్లతో నిర్మించిన కొత్తగూడ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్, అండర్‌పాస్‌ను ఆయన ప్రారంభించారు.

- వివరాలు 2లో▶

ఒక్క ఓటు తగ్గినా గుడ్‌బై



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 50 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు.

- వివరాలు 3లో▶

త్వరలో బండి సంజయ్ మరో విడత పాదయాత్ర?



'ప్రజాసంగ్రామయాత్ర' మరో విడత చేపట్టాలనే ఒత్తిడి బీజేపీ నాయకత్వంపై పెరుగుతోంది. ఈ క్రమంలో బండి సంజయ్ ఈ నెల 18 లేదా 20 నుంచి పాదయాత్రను మళ్లీ మొదలుపెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 3లో▶

'టెన్త్'కు కఠిన పరీక్ష!

చాయిస్ తగ్గింది.. ప్రశ్నల స్థాయి మించింది..

మోడల్ పేపర్‌ను బట్టి చూస్తే సిలబస్ క్లిష్టతరం

- విరామం లేకుండా వరుసగా పరీక్షలు పెట్టడం అశాస్త్రీయం.. ఇలాగైతే విద్యార్థులకు కష్టమేనంటున్న ఉపాధ్యాయులు
- ఉత్తీర్ణత శాతం తగ్గిపోతుందని ఆందోళన
- తక్షణమే మార్పులు చేయాలని డిమాండ్
- పరీక్ష విధానంపై ఆలోచనలో ఎస్సెస్సీ బోర్డు



ప్రశ్నపత్రంలో చాయిస్ పెంచాలి



ప్రశ్నపత్రంలో జవాబుల చాయిస్ పెంచాలి. అన్ని విభాగాల్లో కనీసం 30 శాతమైనా ఇవ్వాలి. విరామం లేకుండా పరీక్షల నిర్వహణ అశాస్త్రీయం. తక్షణమే పరీక్షల తీరుపై అధికారులు సమీక్షించాలి.

- రాజా భానుచంద్రప్రకాశ్, ప్రభుత్వ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు

'పరీక్షల'పై ప్రశ్నలు, ఆందోళనలివీ..

→ టెన్త్ పరీక్షల్లో గతంలో ఇచ్చినట్టుగా ఈసారి రెండు, మూడు మార్కుల సూక్ష్మ ప్రశ్నలకు చాయిస్ ఇవ్వలేదు. ఆరు చొప్పున ప్రశ్నలిచ్చి అన్నీ రాయాలన్నారు. ఏ ఒక్క ప్రశ్న తెలియకపోయినా విద్యార్థి ఆ మేర మార్కులు కోల్పోయినట్టే. అన్ని చాప్టర్లపై పట్టులేనప్పుడు దీనితో చాలా నష్టం.

→ వ్యాసరూప ప్రశ్నల తీరును కఠినం చేశారు. సెక్షన్ మాదిరి కాకుండా, గ్రూపు మాదిరి చాయిస్ ఇవ్వడం విద్యార్థులకు ఇబ్బందేనని నిపుణులు చెప్తున్నారు. సెక్షన్ మాదిరిగా అంటే మొత్తం 12 ప్రశ్నలు ఇచ్చి అందులోంచి ఆరింటికి సమాధానాలు రాయాలి. దీనిలో విద్యార్థులకు చాయిస్ ఎక్కువగా ఉండి, ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉంటుంది. కానీ ఈసారి ఒక్కో గ్రూప్‌లో రెండు ప్రశ్నల చొప్పున ఆరు గ్రూపులుగా ప్రశ్నలు ఇచ్చారు. ప్రతి గ్రూప్‌లోని రెండు ప్రశ్నల్లో ఒకదానికి సమాధానం రాయాలి. ఆ రెండింటికి సమాధానం తెలియకపోతే.. ఆ మేర మార్కులు కోల్పోయినట్టే. మిగతా గ్రూపుల్లోని అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగినా ప్రయోజనం ఉండదు.

→ పరీక్ష సమయం మొత్తం 3 గంటలు.. ఇందులో ఆరు వ్యాసరూప ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికే రెండు గంటల సమయం పడుతుందని నిపుణులు అంటున్నారు. ముందే మిగతా ప్రశ్నలకు జవాబులు రాస్తే.. వ్యాసరూప ప్రశ్నలకు సమయం సరిపోదని అంటున్నారు. అందువల్ల వ్యాసరూప ప్రశ్నలను నాలుగుకు తగ్గించాలని సూచిస్తున్నారు.

→ సైన్స్ సబ్జెక్టులో ఫిజిక్స్/కెమిస్ట్రీ ఒకటి.. బయాలజీ మరొకటిగా పేపర్లు ఉంటాయి. రెండింటి ప్రిపరేషన్ వేర్వేరుగా ఉంటుంది. వీటన్నింటినీ ఒకేరోజు, ఒకే సమయంలో పెట్టడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

2లో

ఖమ్మం పాలిటిక్స్‌లో కలకలం

నూతన సంవత్సరం సందర్భంగా ముగ్గురు నేతల బల ప్రదర్శన

వచ్చే ఎన్నికల్లో తన టీమంతా పోటీకి సిద్ధమని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటన	తనను దెబ్బతీసేందుకు పార్టీలో ప్రయత్నాలంటూ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపణలు	ఇదే బాటలో తన అనుచరులతో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆత్మీయ సమ్మేళనం



నాలుగున్నరేళ్లలో ఏం జరిగింది? ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనేది అందరికీ తెలుసు. ఈరోజు బీఆర్‌ఎస్‌లో ఉన్నాం. కానీ పార్టీలో దక్కిన గౌరవం ఏమిటి? భవిష్యత్‌లో జరగబోతున్నది ఏమిటి ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు నా టీం సిద్ధంగా ఉంది..

- మాజీ ఎంపీ పొంగులేటి



గతంలో నన్ను దెబ్బకొట్టేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ప్రచారాలు చేశారు. మళ్లీ ఇప్పుడు అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. డబ్బుతోనే అన్నీ సాధ్యం కావు. క్యారెక్టర్, గుణం అవసరం. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు కొన్ని విలువలు అవసరం..

- మంత్రి పువ్వాడ అజయ్



నా రాజకీయ ప్రస్థానంలో ముగ్గురు సీఎంల వద్ద మంత్రిగా పనిచేశాను. ఉమ్మడి జిల్లాకు నేనేం చేశానో, పాలేరు నియోజకవర్గానికి ఏం చేశానో అందరికీ తెలుసు.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నేను పాలేరు నుంచే పోటీ చేస్తా. నా వెంట నిలిచే వారికి అండగా ఉంటా..

- మాజీ మంత్రి తుమ్మల

..ఒకరు మాజీ ఎంపీ, మరొకరు మంత్రి, ఇంకొకరు మాజీ మంత్రి.. ముగ్గురూ ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ నేతలే.. జిల్లాలో అనుచరులు, అభిమానగణం ఉన్నవారే.. పార్టీలో, ప్రభుత్వంలో తమకు దక్కుతున్న ప్రాధాన్యంపై అసంతృప్తితో ఉన్నవారు ఇద్దరు, ఆ అసంతృప్తిని దీటుగా ఎదుర్కొని నిలబడాలన్న ఆలోచనతో ఉన్నవారు మరొకరు.. మొత్తానికి ఆధిపత్యం కోసమో, రాజకీయ భవిష్యత్తు కోసమో మిగతా 3వ పేజీలో ▶

మియాపూర్ టు సంగారెడ్డి... ట్రాఫిక్ రద్దీకి చెక్

ఆరు వరుసలుగా రోడ్డు.. రూ.1,400 కోట్లతో విస్తరణ



మియాపూర్–సంగారెడ్డి మార్గంలో నిత్యం నరకాన్ని తలపిస్తున్న ట్రాఫిక్ రద్దీకి తెరపడనుంది. ఈ మార్గంలో ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రోడ్డును ఆరు వరుసలుగా 60 మీటర్లకు విస్తరించనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి డీపీఆర్ సిద్ధమైంది. 31 కి.మీ. నిడివి ఉన్న ఈ రోడ్డు విస్తరణకు రూ.1,400 కోట్ల వ్యయం కానుంది. ఇందులో రోడ్డునిర్మాణ పనులకు రూ.వేయి కోట్లు, భూసేకరణ పరిహారానికి రూ.400 కోట్లు ఖర్చు కానుంది. ఈ రోడ్డులో వాహనాలకు క్రాసింగ్ రోడ్లతో ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్లను నిర్మిస్తారు. ఇందులో బీహెచ్‌ఈఎల్ వద్ద పెద్ద ఫ్లైఓవర్ రానుంది. ఏప్రిల్ నాటికి టెండర్లు పూర్తి చేసి జూలై నాటికి రోడ్డు పనులు ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు. పనులు ప్రారంభమైన రెండేళ్లలో పూర్తి చేయాలన్నది లక్ష్యం. - 14లో



స్కూటీని ఢీకొట్టి, 4 కి.మీ. ఈడ్చుకెళ్లి

కొత్త సంవత్సరం వేళ ఢిల్లీలో మనసుని కలిచివేసే ఘటన.. తప్ప తాగిన కొందరు ఇష్టారాజ్యంగా కారు నడుపుతూ స్కూటీని ఢీకొట్టారు. స్కూటీపై వెళుతున్న 20 ఏళ్ల యువతి కారు కింద పడిపోతే, కనీసం ఏం జరిగిందో కూడా చూడలేదు. ఆమెను ఏకంగా 4 కి.మీ. ఈడ్చుకెళ్లారు. తీవ్రమైన గాయాలతో ఆ యువతి మధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది.

- వివరాలు 6లో▶



మద్యం మత్తు.. మితిమీరిన వేగం..

ఇద్దరు యువకులు కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొని.. మద్యం మత్తులో కారులో ఇంటికి బయల్దేరారు. బంజారాహిల్స్‌లో అతి వేగంతో వీరి వాహనం అదుపు తప్పి పాదచారులపైకి దూసుకెళ్లింది. డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పాదచారులు చనిపోయారు.

- వివరాలు 5లో▶

'పోలీస్' తుది పరీక్షల షెడ్యూల్ ఖరారు

ఏప్రిల్ 8, 9 తేదీల్లో సివిల్ ఎస్‌ఐ రాత పరీక్ష

- కానిస్టేబుల్ సివిల్ అభ్యర్థులకు ఏప్రిల్ 23న నిర్వహణ
- కమ్యూనికేషన్ ఎస్‌ఐ అభ్యర్థులకు మార్చి 12న రాత పరీక్ష
- టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్ శ్రీనివాసరావు ప్రకటన



సాక్షి, హైదరాబాద్: యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో కీలకమైన తుది రాత పరీక్ష తేదీల షెడ్యూల్ ఖరారైంది. మార్చి 12 నుంచి పలు విభాగాల్లోని 17,560 పోస్టుల భర్తీకి తుది రాత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియలో పోలీస్ ఉద్యోగార్థులు తీవ్రంగా శ్రమించే సివిల్ ఎస్సై పోస్టులకు రాత పరీక్షను ఏప్రిల్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ప్రకటించారు. సివిల్ కానిస్టేబుల్ తుది రాత పరీక్షను ఏప్రిల్ 23న నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు పరీక్షల తేదీలను వెల్లడిస్తూ ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల

మిగతా 2వ పేజీలో ▶


ఈనెల 5తో ముగియనున్న దేహదారుఢ్య పరీక్షలు

పలు విభాగాల్లోని ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి దేహదారుఢ్య పరీక్షలు డిసెంబర్ 8న ప్రారంభించారు. ఈ ప్రక్రియ జనవరి 5తో ముగియనుంది. హైదరాబాద్‌సహా తెలంగాణ వ్యాప్తంగా 11 ప్రాంతాల్లో ఫిజికల్ ఈవెంట్స్‌ను నిర్వహిస్తున్నారు. దేహదారుఢ్య పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు తుది రాత పరీక్ష హాల్‌టికెట్లను త్వరలోనే జారీ చేయనున్నట్టు బోర్డు అధికారులు తెలిపారు. డ్రైవర్, డ్రైవర్ ఆపరేటర్స్, మెకానిక్ పోస్టులకు పోటీపడుతున్న అభ్యర్థులకు డ్రైవింగ్ టెస్ట్ తేదీలను త్వరలోనే వెల్లడించనున్నట్టు తెలిపారు.

ఇదంజగత్



బయటి వాళ్లు ఓకే అంటున్నార్సార్!.. సీనియర్లే..



తిరుమలలో తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ రవినాథ్ తిలహరి

ఉత్తర ద్వార దర్శనానికి రెండు లక్షల టోకెన్లు జారీ

- తొమ్మిది కేంద్రాల్లో భక్తులకు టోకెన్లు అందజేస్తున్న టీటీడీ
- 10రోజుల కోటా పూర్తయ్యే వరకూ ప్రక్రియ కొనసాగింపు

తిరుపతి అలిపిరి/తిరుమల: తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా 2వ తేదీ నుంచి తిరుమలలో ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ముందస్తుగా ఆదివారం ఉ.3 గంటల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం టోకెన్లు జారీచేస్తోంది. అందుకు తిరుపతిలో తొమ్మిది కేంద్రాలను ఏర్పాటుచేసింది. తొలిరోజు ఆదివారం రాత్రి 9గంటల వరకు రెండు లక్షల టోకెన్లు ఇచ్చారు. 10రోజుల కోటా పూర్తయ్యే వరకు టోకెన్ల జారీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. టోకెన్లు పొందిన తేదీల్లో మాత్రమే భక్తులు తిరుమలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. కాగా, తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్, న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరి, సినీనటుడు రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు. ఇక తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 15 నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,460 మంది స్వామివారిని దర్శించుకోగా 29,182 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.4.03 కోట్లు సమర్పించారు. దర్శన టోకెన్లు లేని భక్తులకు 18 గంటల సమయం పడుతోంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

తిరుమల ముస్తాబు

భూలోక వైకుంఠం తిరుమల పుణ్యక్షేత్రంలో పది రోజులపాటు జరగనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైకుంఠ ద్వార దర్శనం నిమిత్తం భక్తులకు టీటీడీ సకల ఏర్పాట్లూ పూర్తిచేసింది. సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకుంది. ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సిఫారసు లేఖలు రద్దుచేశామని.. అలాగే, రెండు మూడు తేదీల్లో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న ప్రముఖులకు మాత్రమే దర్శనం కల్పిస్తున్నట్లు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ స్పష్టంచేశారు. సోమవారం వేకువజామున 1.45 గంటల నుంచి వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం ప్రారంభిస్తామన్నారు.

'దళిత బంధు'కు మార్గదర్శకాలేవీ?

సందిగ్ధంలో నియోజకవర్గానికి ఐదొందల యూనిట్ల ఎంపిక ప్రక్రియ



సాక్షి, హైదరాబాద్: దళితబంధు లబ్ధిదారుల ఎంపిక సందిగ్ధంలో పడింది. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సంబంధిత శాసనసభ్యుడి సిఫార్సుల ఆధారంగా ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి వంద యూనిట్లు మంజూరు చేయగా.. ఎమ్మెల్యే సూచించిన జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేసి ఆర్థిక సాయాన్ని అందించారు. దీనివల్ల కేవలం ఎమ్మెల్యే అనుయాయులకే దళితబంధు ఫలాలు దక్కుతున్నాయంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం లేకుండా అర్హులను ఎంపిక చేయాలని హైకోర్టు ఆదేశించడంతో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1,500 యూనిట్లు మంజూరు చేసిన ప్రభుత్వం... తొలివిడతలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 500 యూనిట్ల ఎంపికకు అనుమతిచ్చింది. అయితే, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు వచ్చాకే ఎంపిక చేపట్టాలని అటు ఎస్సీ కార్పొరేషన్‌ను, ఇటు క్షేత్రస్థాయి అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో దళితబంధు కింద రూ.17,700 కోట్లు కేటాయించిన ప్రభుత్వం... ఇందులో మూడోవంతు లబ్ధిదారులను డిసెంబర్ నాటికే ఎంపిక చేసి లబ్ధి చేకూరుస్తామని గతంలో చెప్పింది. ఎమ్మెల్యే సిఫార్సు ద్వారా కాకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ప్రభుత్వానికి సూచనలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

'టెన్త్'కు కఠిన పరీక్ష!

చాయిస్ తగ్గింది.. ప్రశ్నల స్థాయి మించింది..

సాక్షి, హైదరాబాద్: ఎస్సెస్సీ పరీక్షల చుట్టూ వివాదం ముసురుతోంది. పరీక్ష విధానం, నిర్వహణ, సిలబస్, చాయిస్‌లలో చేసిన మార్పులపై పునః సమీక్షించాలన్న డిమాండ్లు వస్తున్నాయి. పరీక్షలకు సంబంధించిన మోడల్ పేపర్లను పరిశీలించిన ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఇప్పటికే ప్రభుత్వానికి వివిధ రూపాల్లో తమ అభ్యంతరాలు తెలిపాయి. తమ సూచనలను పరిగణనలోకి తీసుకోకుంటే.. విద్యార్థులకు ఇబ్బంది తప్పదని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెప్తున్నారు. ఈ అంశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతుండటంతో.. విద్యాశాఖ ఉన్నతాధికారులు డోలాయమానంలో పడ్డారు.

మోడల్ పేపర్లను చూసి..

ఇటీవల టెన్త్ పరీక్షల టైం టేబుల్ విడుదల చేసిన ఎస్సెస్సీ బోర్డు పరీక్షల మోడల్ పేపర్లనూ ఆన్‌లైన్‌లో పెట్టింది. ఈ మోడల్ పేపర్లను బట్టి పరీక్ష విధానం కఠినంగా ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు నిర్ధారణకు వచ్చాయి. అసలే కోవిడ్ వల్ల రెండేళ్లుగా అభ్యసన నష్టాలు ఉన్నప్పుడు పరీక్షను కఠినతరం చేస్తే విద్యార్థులకు నష్టమని అంటున్నాయి. టెన్త్ పరీక్షలు రాయబోయే దాదాపు 5 లక్షల మంది విద్యార్థుల్లో.. 2 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లవారు ఉంటారని.. వీరిలో 1.2 లక్షల మంది కనీస స్థాయిలో, మరో 45 వేల మంది అంతకన్నా తక్కువగా సబ్జెక్టు పరిజ్ఞానం ఉన్నట్టు ఇటీవలి అంచనాల్లో వెల్లడైందని పేర్కొంటున్నాయి. కోవిడ్ పరిణామాలతో ప్రైవేటు విద్యార్థుల్లోనూ ప్రమాణాలు తగ్గాయని.. ఇలాంటప్పుడు క్లిష్టమైన ప్రశ్నలు, సంక్లిష్టమైన సమాధాన రూపం ఉండటం సరికాదని స్పష్టం చేస్తున్నాయి.

గ్యాప్ ఇవ్వాల్సిందే..

సీబీఎస్‌సీ సిలబస్‌తో కొనసాగే కేంద్ర విద్యాసంస్థల్లో ప్రతీ పరీక్షకు మధ్య సన్నద్ధతకు సెలవు ఉంటుంది. మన రాష్ట్ర ఎస్సెస్సీ బోర్డ్ మాత్రం ఈ విధానాన్ని పాటించ లేదు. ప్రభుత్వ సెలవు దినాలు మినహా ప్రతీ సబ్జెక్టు పరీక్షల మధ్య విరామం ఇవ్వలేదు. ప్రతి సబ్జెక్టుకు రెండు



పేపర్లుగా పరీక్షలు (40 మార్కుల చొప్పున) నిర్వహించినప్పుడు మధ్యలో ఒకరోజు విరామం ఇచ్చారు. ఇప్పుడు మొత్తం 80 మార్కులతో ఒకే పరీక్ష నిర్వహించనున్నా మధ్యలో విరామం ఇవ్వకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ఈ విషయాన్ని విద్యామంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. కోవిడ్ నష్టాలున్న కాలం కాబట్టి విరామం, ఇతర వెసులుబాట్లు అమలు చేయాలని కోరినట్టు ఉపాధ్యాయ సంఘాల నేతలు చెప్తున్నారు.

చాయిస్ పెంచాలి..

ఒకే పేపర్‌గా పరీక్ష నిర్వహిస్తుండటం వల్ల విద్యార్థులకు ఇబ్బంది లేకుండా.. ప్రశ్నపత్రంలోని ఒకటి, రెండు సెక్షన్లలో కూడా చాయిస్ ఇవ్వాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. 2 మార్కులు, 3 మార్కుల ప్రశ్నలకు కనీసం 30శాతం చాయిస్ ఇవ్వాలని అంటున్నారు. మూడో సెక్షన్‌లో వ్యాస రూప ప్రశ్నలను తగ్గించాలని.. ఫిజిక్స్/కెమిస్ట్రీ, బయాలజీ పరీక్షలు ఒకేరోజు కాకుండా వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని సూచిస్తున్నారు. ఎస్సెస్సీ బోర్డు ఈ సూచనలు పాటించకపోతే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం దెబ్బతింటుందని స్పష్టం చేస్తున్నారు. ప్రైవేటు స్కూళ్లలో ముందుగా బోధన ప్రారంభం కావడం, రివిజన్ రెండు సార్లు చేయడం వల్ల తేలికగా పరీక్షలు రాసే వీలు ఉందని అంటున్నారు. అదే ప్రభుత్వ స్కూళ్లలో ఇప్పటికీ సిలబస్ పూర్తి కాలేదని, ఉపాధ్యాయుల కొరత ఇబ్బందికరంగా మారిందని చెప్తున్నారు.

పరీక్షల తీరులో మార్పులు చేయాలి

రెండేళ్లుగా కోవిడ్ వల్ల తరగతులే సరిగా జరగలేదు. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల ప్రమాణాలకు తగ్గట్టుగా ప్రశ్నపత్రాలు ఉంటే మంచిది. కానీ మోడల్ పేపర్లు చూస్తే చాలా కఠినంగా ఉన్నాయి. పరీక్షలపై సంఘాల నేతలతో కలిసి చర్చించి, మార్పులు చేయాలి.
– చావా రవి, టీఎస్ యూటీఎఫ్

వ్యాస రూప ప్రశ్నలు తగ్గించాలి

మోడల్ పేపర్లను బట్టి చూస్తే వ్యాస రూప ప్రశ్నల సంఖ్య ఎక్కువగా ఉంది. వాటిని తగ్గించాలి. భౌతిక, రసాయన శాస్త్రాలు.. జీవశాస్త్రం పేపర్లను ఒకేరోజు కాకుండా వేర్వేరు రోజుల్లో నిర్వహించాలి.
– బీరెల్లి కమలాకర్‌రావు, పీఆర్‌టీయూటీఎస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇబ్బందులివీ..	నిపుణుల సూచనలివీ..
వరుసగా రోజూ పరీక్షలు నిర్వహించడం	రోజు విడిచి రోజు పరీక్ష నిర్వహించాలి
సైన్స్‌లో ఫిజిక్స్/కెమిస్ట్రీ, బయాలజీ పరీక్షలను వెంట వెంట పెడుతున్నారు	దీన్ని వేర్వేరుగా వేర్వేరు రోజుల్లో పెట్టాలి
సూక్ష్మ ప్రశ్నల్లో చాయిస్ ఇవ్వలేదు	చాయిస్ ఇవ్వాలి. విద్యార్థులకు ప్రయోజనం
వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువ. సమయం తక్కువ	వ్యాసరూప ప్రశ్నలను 6 నుంచి 4కు కుదించాలి

అది అంబేడ్కర్ స్ఫూర్తికి విరుద్ధం

- ఆస్తిక, నాస్తిక వైరుధ్యంపై మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు
- నైతిక విలువలు పెంచేలా సిలబస్ మారుస్తాం: బోయిన్‌పల్లి వినోద్‌కుమార్
- ముగిసిన పుస్తక ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: భారతదేశం అనాదిగా నాస్తిక, ఆస్తిక వాదాలకు నిలయంగా ఉందని, అయితే ప్రస్తుత పరిస్థితులు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. నగరంలోని కళాభారతిలో 10 రోజులపాటు కొనసాగిన హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగింపు సభ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విద్యాసాగర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ పాల్గొన్నారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా సమతా స్ఫూర్తిని ప్రజలమధ్య నింపడానికి కృషిచేశారని, నాస్తికులు, ఆస్తికులు పోట్లాడుకుని జైళ్లకు వెళ్లడం అంబేడ్కర్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అప్పటి సామాజిక విధానాల్లో ఉన్న అస్పృశ్యతను తొలగించడానికి అంబేడ్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించి, అందులోని విధానాల ద్వారానే సౌభాతృత్వాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. వీటికి సంబంధించిన విజ్ఞానం లభించాలంటే ఇలాంటి పుస్తక ప్రదర్శనలు అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని తయారుచేయించడం అభినందనీయమని పేర్కొన్నారు.

గ్రామ స్థాయిలో గ్రంథాలయాలు: ఇంటర్నెట్‌తో పిల్లల్లో వచ్చిన మార్పులు చూశాక ఆందోళన అనిపించినా ఇలాంటి పుస్తక ప్రదర్శన ద్వారా ఆ భయాలు తొలగిపోయాయని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్ కుమార్ అన్నారు. నైతిక విలువలు పెంపొందించే విధంగా విద్యావిధానం ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో 100 స్కూళ్లను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని సిలబస్ మార్చే విధంగా కృషి చేస్తున్నామని, అందులో నీతి కథలు, పర్యావరణం, వ్యక్తిత్వ నిర్మాణం పాఠ్యాంశాలుగా చేర్చబోతున్నామని పేర్కొన్నారు. భిన్న వాదనలు ఉన్నా పుస్తకం మనుషులను ఏకం చేస్తుందని బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ సోమ భరత్‌కుమార్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, ఓయూ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విద్యాసాగర్‌రావు, జూలూరు, బి.వినోద్‌కుమార్ తదితరులు

డైరీ, కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: అబ్కారీ, క్రీడా, పర్యాటక శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సరం డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో వీటిని రూపొందించారు. కార్యక్రమంలో తెలంగాణ సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు నరహరిరావు, ప్రధాన కార్యదర్శి రాంచందర్ పాల్గొన్నారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

చింతపల్లి: నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన దశరథ కుటుంబం మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనం వద్ద కూలి పనులకు కుదిరారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఇక్కడికి మకాం మార్చి నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ వద్ద నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం సమయంలో వారి పది నెలల చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృతి చెందింది. అయితే చిన్నారి మృతదేహంతో భార్యాభర్తలు హైదరాబాద్‌కు వెళ్లగా, విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

100% క్లీన్‌సిటీగా హైదరాబాద్

దేశంలో మొదటి మురుగు నీటి శుద్ధి నగరంగా నిలవనుంది: మంత్రి కేటీఆర్

- ఈ ఏడాదిలో ఎస్‌ఆర్‌డీపీలోని మరో 11 ప్రాజెక్ట్‌లు పూర్తిచేస్తాం
- మౌలిక వసతుల కల్పనతో విశ్వనగరంగా హైదరాబాద్
- కొత్తగూడ మల్టీలెవల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో వెల్లడి

గచ్చిబౌలి (హైదరాబాద్): వంద శాతం మురుగు నీటి శుద్ధి చేసిన నగరంగా కొద్ది నెలల్లోనే హైదరాబాద్ నిలవనుందని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇలా దేశంలోనే మొదటి నగరంగా చరిత్రలో నిలిచిపోనుందని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీతోపాటు ఏడెనిమిది మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వంద శాతం మురుగునీటి శుద్ధీకరణకు రూ.3,866 కోట్ల నిధులను కేటాయించామన్నారు. 31 కొత్త ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను నిర్మిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్, మే నాటికి ఎస్‌టీపీల పనులు పూర్తవుతాయని, 100 శాతం మురుగునీటిని శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్ నిలవనుందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో రూ.263 కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్తగూడ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్, అండర్ పాస్‌ను కొత్త సంవత్సరం కానుకగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో జీవన ప్రమాణాలు పెంచి విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన చెప్పారు.

వెయ్యి కోట్లతో నాలాల విస్తరణ

స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్‌ఎన్‌డీపీ)లో భాగంగా వెయ్యి కోట్లతో నాలాల విస్తరణ చేపడతామని కేటీఆర్ చెప్పారు. సీఎం కేసీఆర్ విజన్‌తో దేశంలో ఏ నగరంలో జరగనంత మౌలిక వసతుల విస్తరణ హైదరాబాద్‌లో జరుగుతోందన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ఎన్నో ప్రాజెక్ట్‌లు చేపడుతున్నామని, అందులో ముఖ్యమైనది స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌ఆర్‌డీపీ) అని చెప్పారు. దీని ద్వారా చేపట్టిన 34 ప్రాజెక్ట్‌లను ఇప్పటికే ప్రారంభించామని, ఈ సంవత్సరంలో మరో 11 ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వచ్చిన కొత్తవారు ఇక్కడి అభివృద్ధిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, రెండు మూడేళ్లలో పెద్దఎత్తున మార్పులు వచ్చాయని సోషల్ మీడియాలో చెబుతుంటే సంతోషంగా ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి–సంక్షేమం అనే ద్విముఖ లక్ష్యంతో విస్తృతమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. విద్య–ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇతర పట్టణాలు, రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హైదరాబాద్‌కు వలస వస్తున్నారని, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టు పనుల్ని వేగంగా పూర్తిచేస్తున్న ఇంజినీర్ల కృషిని గుర్తించిన కేటీఆర్ కొత్తగూడ ఫ్లైఓవర్‌ను ఈ ప్రాజెక్టు పనులు పర్యవేక్షించిన జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) వెంకటరమణచే రిబ్బన్ కట్ చేయించడం విశేషం. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేయర్ విజయ లక్ష్మీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో కొత్తగా ప్రారంభించిన కొత్తగూడ మల్టీలెవెల్ ఫ్లైఓవర్



చీరపై వేసిన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చిత్రాలను తిలకిస్తున్న గవర్నర్ తమిళి సై

రాజ్‌భవన్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- కేక్ కట్ చేసిన గవర్నర్ తమిళిసై
- భారీగా హాజరైన సందర్శకులు

సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల: తెలంగాణ ప్రజలు కొత్త సంవత్సరంలో ఆరోగ్యంగా, సంతోషంతో, సురక్షితంగా, సంపన్నంగా ఉండాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆకాంక్షించారు. ఆదివారం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో నిర్వహించిన 2023–నూతన సంవత్సర వేడుకల్లో ఆమె కేక్ కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రాజ్‌భవన్‌కు తరలివచ్చిన వందలాది మంది నుంచి శుభాకాంక్షలు అందుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పలు రంగాలకు చెందిన వందలాది మంది రాజ్‌భవన్‌కు వచ్చి పుష్పగుచ్ఛాలు, శాలువాలు, పుస్తకాలు, కేలండర్లు, డైరీలు అందించి గవర్నర్‌ను అభినందించారు. భారీ ఎత్తున కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా దేశంలో 45 లక్షల మరణాలను నిరోధించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. దర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ను గవర్నర్ సందర్శించి చీరలు, ఇతర చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. గవర్నర్ దాదాపు రెండు గంటలకు పైగా దర్బార్ హాల్‌లో నిల్చుని ప్రజల శుభాకాంక్షలను స్వీకరించారు. అంతకుముందు తమిళిసై చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

రాజ్‌భవన్‌లో సిరిపట్టు చీరల ప్రదర్శన

రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ నేసిన రాజన్న సిరిపట్టు చీరలను ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రదర్శించారు. గవర్నర్ తమిళిసై ఆహ్వానం మేరకు హరిప్రసాద్ దంపతులు రాజ్‌భవన్‌కు వచ్చారు. ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చిత్రాలతో తాము నేసిన శాలువాను ఆవిష్కరించారు. ఆ చిత్రాలను చూసిన గవర్నర్ సంతోషం వ్యక్తం చేస్తూ.. హరిప్రసాద్‌ను అభినందించారు. హరిప్రసాద్ నేసిన అగ్గిపెట్టెలో ఇమిడేచీరను సైతం గవర్నర్ పరిశీలించారు. మరమగ్గాలపై జకార్డ్ సాయంతో నేసిన రాజన్న సిరిపట్టు చీరలను రాజ్‌భవన్ వేదికగా ప్రదర్శించడం సంతోషంగా ఉందని హరిప్రసాద్ తెలిపారు.

నుమాయిష్‌తో అపూర్వ అనుభూతి

మంత్రి హరీశ్ రావు

- మినీభారత్‌గా తలపిస్తున్న ఎగ్జిబిషన్ సెంటర్
- వచ్చే ఆదాయంతో విద్యాసంస్థలకు తోడ్పాటు
- అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన–82 షురూ

సాక్షి, హైదరాబాద్: ''పెరిగిన సాంకేతికతతో మొబైల్ ఫోన్‌లో ఆర్డర్స్ క్లిక్ చేస్తే వస్తువులు ఇంటి వద్దకు చేరవచ్చు. కానీ, నుమాయిష్‌లో వివిధ సంస్కృతులు, ఆహారపు అలవాట్లు, నచ్చిన, మెచ్చిన వస్తువులను చూసి కొనుగోలు చేయడం ద్వారా పొందే అనుభూతిని మాత్రం కోల్పోతామని రాష్ట్ర మంత్రి,, ఎగ్జిబిషన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)–82ను ఆయన మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులతో కలసి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వివిధ రాష్ట్రాల ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం వారు నుమాయిష్‌లోని టాయ్‌ట్రైన్‌లో ప్రయాణించారు. అంతకుముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన శైలిలో ప్రతి కొత్త సంవత్సరం హైదరాబాద్ నుమాయిష్ భాగమైపోయిందన్నారు. సామాజిక అనుబంధాన్ని కోల్పోకుండా నుమాయిష్‌ను సందర్శించి లభించే గొప్ప అనుభూతిని ఆస్వాదించాలని కోరారు. కన్యాకుమారి నుంచి జమ్మూకశ్మీర్ వరకు వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఎగ్జిబిషన్‌కు వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేస్తారని, వివిధ రకాల సంప్రదాయ ఉత్పత్తుల స్టాళ్లతో ఎగ్జిబిషన్ గ్రౌండ్ మినీ భారత్‌ను తలపిస్తోందని పేర్కొన్నారు. ఎంతో చరిత్ర కలిగిన హైదరాబాద్ నుమాయిష్ ప్రపంచంలో జరిగే వ్యాపార సమ్మేళనాల్లో ఒకటిని పేర్కొన్నారు.

మహిళాసాధికారతకు తోడ్పాటు

ప్రతి ఏడాది ఎగ్జిబిషన్ ద్వారా లభించే ఆదాయంతో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలో 19 విద్యాసంస్థలకు నిధులు సమకూర్చి దాదాపు 30 వేలమందికి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా మహిళా విద్యను ప్రోత్సహించేందుకు విద్యాసంస్థలు నడిపిస్తూ మహిళా సాధికారతకు తోడ్పాటునందిస్తున్నారు. హైదరాబాద్‌లోనే కాకుండా మారుమూల నిర్మల్ వంటి దూర ప్రాంతాల్లోనూ విద్యాసంస్థలు ప్రారంభించి, ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు గుర్తు చేశారు. సుమారు రెండు వేల టీచింగ్– నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, ప్రతి ఏడాది దాదాపు పదివేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడం జరుగుతోందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని , వారు సొసైటీని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎగ్జిబిషన్ ద్వారా లభించే ఆదాయాన్ని విద్య కోసం వెచ్చిస్తుందని పేర్కొన్నారు. మిగతా జిల్లాలో కూడా ఎగ్జిబిషన్ ఏర్పాటు విస్తరించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి మట్లాడుతూ లాభాపేక్ష లేకుండా సొసైటీ సేవలు అభినందనీయమని, మళ్లీ పాత నుమాయిష్ రోజులు రావాలని ఆకాంక్షించారు. మంత్రి తలసాని మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు నుంచి నుమాయిష్ నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతో పలు విద్యసంస్థలు నడపడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఎగ్జిబిషన్ గ్రౌండ్ స్థలం విషయంలో చొరవ చూపినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ సలీం, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టాయ్‌ట్రైన్‌లో ప్రయాణిస్తున్న మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, తలసాని తదితరులు

పోలీస్ పరీక్షల నిబంధనలు పునః పరిశీలించాలి

సాక్షి, హైదరాబాద్: సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల ఎంపిక నిబంధనలను పునఃపరిశీలించాలని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అభ్యర్థుల ఎంపిక కోసం రూపొందించిన శారీరక దారుఢ్య పరీక్షలు అమానవీయమని ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ నియామక ప్రక్రియ నిబంధనల పెంపుతో తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ) రాక్షసానందం పొందుతోందని దుయ్యబట్టారు. ఈ కారణంగా ముగ్గురు అభ్యర్థులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. పరీక్షల ఒత్తిళ్లతో మరో ఏడుగురు ఉద్యోగార్థులు మరణించగా.. మరికొందరు కాళ్లు, నడుములు విరగ్గొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'పోలీస్' తుది పరీక్షల షెడ్యూల్ ఖరారు

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. దేహదారుఢ్య పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులు తుది రాతపరీక్షకు సన్నద్ధం కావాలని సూచించారు.

పోస్టుల వారీగా తుది రాత పరీక్షల షెడ్యూల్

తేదీ	సమయం	పోస్ట్	వేదిక
12-03-2023	ఉ.10:00-1:00	కమ్యూనికేషన్ ఎస్సై	హైదరాబాద్
12-03-2023	మ.2.30-5:30	ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై	హైదరాబాద్
26-03-2023	ఉ.10:00-1:00	ఎస్సై (పీటీఓ)	హైదరాబాద్
02-04-2023	ఉ.10:00-1:00	కానిస్టేబుల్ (డ్రైవర్)	హైదరాబాద్
02-04-2023	మ.2-30-5:30	కానిస్టేబుల్ (మెకానిక్)	హైదరాబాద్
08-04-2023	ఉ.10:00-5:30	సివిల్ ఎస్సై (అర్థమెటిక్ రీజనింగ్, ఇంగ్లిష్)	హైదరాబాద్, వరంగల్, కరీంనగర్
09-04-2023	ఉ.10:00-5:30	సివిల్ ఎస్సై (జనరల్ స్టడీస్, తెలుగు/ఉర్దూ)	హైదరాబాద్, వరంగల్, కరీంనగర్
23-04-2023	ఉ.10:00-1:00	సివిల్ / ట్రాన్స్‌పోర్ట్ / ఎక్సైజ్ కానిస్టేబుల్	ఉమ్మడి పది జిల్లా కేంద్రాలు
23-04-2023	మ.2:30-5:30	ఐటీ, కమ్యూనికేషన్ కానిస్టేబుల్	హైదరాబాద్

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ నేతలు రైతు వ్యతిరేకులుగా నిలిచిపోతారు

టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరే వ్యక్తులు, సంస్థలపై అనుచితంగా మాట్లాడే బీఆర్‌ఎస్ నేతలు సీఎం కేసీఆర్ మెప్పు పొందగలరేమో కానీ, రైతు వ్యతిరేకులుగా మాత్రం నిలిచిపోతారని టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రైతుల సమస్యలపై మాట్లాడిన రైతు స్వరాజ్య వేదిక గురించి రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. రైతుబంధు సమితి అధ్యక్షుడి హోదాలో రైతు స్వరాజ్య వేదిక చేసిన ఆరోపణలను సమీక్షించుకుని పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలే తప్ప అసలు రాష్ట్రంలో పంట నష్టం జరగలేదని చెప్పడం దుస్సాహసమవుతుందని తెలిపారు. పంట నష్టాన్ని పరిశీలించేందుకు 2022 ఫిబ్రవరిలో మంత్రులు వరంగల్‌కు వెళ్లింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఒక వేళ పంట నష్టం పరిశీలనకు వెళ్లకపోతే విహార యాత్రలకు వెళ్లారా అని అన్వేశ్‌రెడ్డి ప్రశ్నించారు.

అనుమతి ఇచ్చినా... ఇవ్వకున్నా ధర్నా

కాంగ్రెస్ నేతలు మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: పంచాయతీలకు నిధుల పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి తీరుతామని కాంగ్రెస్ నేతలు మల్లు రవి, రాచమల్ల సిద్దేశ్వర్ స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచ్‌లతో కలిసి ఇందిరాపార్కు వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా నిర్వహించేందుకు అనుమతి కోరుతూ పోలీసులకు లేఖ ఇచ్చామని ఆదివారం ఒక ప్రకటనలో వారు తెలిపారు. పోలీసులు అనుమతి ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేసినా ధర్నా నిర్వహించి తీరుతామని హెచ్చరించారు.

ఫేమ్ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కేదెప్పుడు?

- కాంట్రాక్టు విషయంలో న్యాయపరమైన చిక్కులు
- రాష్ట్రానికి బస్సుల సరఫరాలో జాప్యం



సాక్షి, హైదరాబాద్: టెండర్లలో తక్కువ మొత్తం కోట్ చేసిన కంపెనీకి ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా కాంట్రాక్టును అప్పగించే విషయంలో నెలకొన్న వివాదం సకాలంలో బస్సులు రోడ్డెక్కకుండా చేస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈపాటికల్లా 300 ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రావాల్సి ఉంది. కానీ విషయం కోర్టుకు చేరటంతో బస్సులు రావటానికి మరింత సమయం పట్టే పరిస్థితి కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచే ఉద్దేశంతో తాజాగా ఫేమ్ (ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ ఇండియా)–2 పథకం కింద 10 వేల బస్సులను రాయితీపై సరఫరా చేయాలని నిర్ణయించింది. తెలంగాణకు 300 బస్సులు మంజూరయ్యాయి. ఇటీవల కేంద్ర భారీ పరిశ్రమల శాఖ టెండర్లు పిలిచి ఖరారు చేసింది. ఇందులో ఎల్–1(తక్కువ మొత్తం కోట్ చేసిన కంపెనీ)గా వచ్చిన కంపెనీకి ఎక్కువ బస్సులు సరఫరా ఉన్న రాష్ట్రాల బాధ్యత అప్పగించింది. ఎల్–2గా ఉన్న కంపెనీ జాబితాలో తెలంగాణ ఉంది. కాగా ఎల్–2గా ఉన్న కంపెనీతో ఒప్పందం చేసుకునే సమయంలో వివాదం తలెత్తింది.

ఆ కంపెనీ కోర్టుకు వెళ్లటంతో..

తొలుత టెక్నికల్ బిడ్ తెరిచినప్పుడు ఓ కంపెనీ బిడ్‌కు అర్హమైంది కాదని భావించిన అధికారులు దాన్ని తిరస్కరించారు. నిజానికి ఆ కంపెనీ కోట్ చేసిన మొత్తం ప్రకారం ఎల్–2 స్థానంలో అదే ఉంటుంది. మూడో స్థానంలో ఉన్న కంపెనీని ఎల్–2గా నిర్ధారించారు. దీనికి తెలంగాణకు బస్సుల సరఫరా బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. ఇంతలో అన ర్హమైందిగా అధికారులు తేల్చిన కంపెనీ కోర్టును ఆశ్రయించిందని, తీర్పు ఆ కంపెనీకి అనుకూలంగా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. దీంతో మూడో స్థానంలో ఉన్న కంపెనీని ఎల్–2గా నిర్ధారిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తొలుత ఎల్–2గా నిర్ధారించిన కంపెనీకే బస్సుల సరఫరా బాధ్యత అప్పగించాల్సి ఉంది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ఆ కంపెనీతో చర్చించే సమయంలో, కేంద్ర ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకుని దీనిపై ఎలాంటి నిర్ణయానికి రావద్దని, తాము కోర్టు తీర్పును సవాల్ చేయబోతున్నామని చెప్పినట్టు సమాచారం.

త్వరలో 500 అద్దె ఎలక్ట్రిక్ బస్సులు..

ఫేమ్–2 పథకం బస్సుల పరిస్థితి ఇలావుండగా, గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో 500 ఎలక్ట్రిక్ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోబోతున్నారు. దీనికి సంబంధించి పిలిచిన టెండర్లలో రెండు బడా కంపెనీలు పాల్గొన్నాయి. టెక్నికల్ బిడ్ ఓకే అయింది. ఫైనాన్షియల్ బిడ్‌లో తక్కువ మొత్తం కోట్ చేసిన కంపెనీకి ఆర్డర్ ఇవ్వనున్నారు. మరో నెలరోజుల్లో ఈ బస్సుల రాక ప్రారంభమవుతుందని అంచనా వేస్తున్నారు.

ఖమ్మం పాలిటిక్స్‌లో కలకలం

▶ మొదటి పేజీ తరువాయి

గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిలోగా అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తమ కార్యచరణకు పదును పెట్టుకుంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు వేదికగా అనుచరులతో సమావేశాలు పెట్టి బల ప్రదర్శన చేసుకున్నారు. ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం/ఖమ్మం మయూరి సెంటర్

తుమ్మల.. ఎన్నికల రిహార్సల్!



మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా నూతన సంవత్సర వేడుకల పేరిట ఖమ్మం రూరల్ మండలంలో తన అనుచరగణం, కేడర్‌తో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాను పాలేరు నుంచే పోటీ చేస్తానంటూ ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన తుమ్మల.. ఈ కార్యక్రమంలో మరోసారి స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ముగ్గురు సీఎంల వద్ద మంత్రిగా పనిచేశానని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు ఏమేం చేశారో, పాలేరు నియోజకవర్గానికి ఏం చేశారో వివరించారు. అయితే ఈ కార్యక్రమం వచ్చే ఎన్నికలకు రిహార్సల్‌గా, బల ప్రదర్శనగా చెప్పవచ్చని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల పాలేరు నియోజకవర్గంలో స్పీడ్ పెంచారని అంటున్నారు.

వచ్చే ఎన్నికల్లో నా టీమ్ పోటీ చేస్తుంది

బీఆర్‌ఎస్‌లో జరిగిన గౌరవం ఏమిటో ఆలోచించాల్సి ఉంది: పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నూతన సంవత్సరం సందర్భంగా తన అనుచర నేతలతో కేక్ కట్ చేస్తున్న పొంగులేటి

ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ కీలకనేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి పొంగులేటి అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లలో ఏం జరిగింది, తనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనేది అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ఈ రోజు బీఆర్‌ఎస్‌లో ఉన్నామని, కానీ ఆ పార్టీలో జరిగిన గౌరవమేంటి? భవిష్యత్‌లో జరగబోతున్న గౌరవం ఏమిటనేది ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రేమ, అభిమానాలు పొందిన, పొందుతున్న ప్రతీ నాయకుడు ప్రజాప్రతినిధి కావాలని, అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు శీనన్న (తన) టీమ్ అంతా సిద్ధంగా ఉందని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు.

ఎంపీగా గెలిచి.. బీఆర్‌ఎస్‌లో చేరి..

వైఎస్సార్‌సీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనుచరులు, అభిమానులను సంపాదించుకున్నారు. 2014లో ఎంపీగా గెలిచారు. వైరా, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారు. కానీ తర్వాతి రాజకీయ పరిణామాల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్)లో చేరారు. ఈ క్రమంలో రాజకీయ జీవితం కొంత ఒడిదుడుకులకు లోనైంది. సిట్టింగ్ అయిన ఆయనను కాదని.. నామా నాగేశ్వరరావుకు గులాబీ పార్టీ టికెట్ దక్కింది. ఏదైనా నామినేటెడ్ పదవి వస్తుందని పొంగులేటి ఆశించినా ఫలితం రాలేదు. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకే చెందిన పువ్వాడ అజయ్‌కు ప్రాధాన్యం దక్కడం, తుమ్మల నాగేశ్వర్‌రావు తిరిగి పట్టుపెంచుకునే ప్రయత్నాలు చేయడంతో.. ఆయన భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెట్టినట్టు రాజకీయ వర్గాలు చెప్తున్నాయి.

నన్ను దెబ్బతీసే ప్రయత్నాలు

'వాడవాడ పువ్వాడ' కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

గతంలో తనను దెబ్బకొట్టడం కోసం అనేక ప్రయత్నాలు జరిగాయని, రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ప్రచారాలు చేశారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. ఆయన ఆదివారం ఖమ్మంలో 'వాడవాడ పువ్వాడ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు తనపై నేరుగా ఆరోపణలు చేయలేక కార్పొరేటర్లను తులనాడి, వారిపై విషప్రచారం చేసి తనకు నష్టం చేయాలని చూశారని పువ్వాడ ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని.. డబ్బుతోనే అన్నీ సాధ్యం కాదని, క్యారెక్టర్, గుణం అవసరమని పేర్కొన్నారు. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు కొన్ని విలువలు అవసరమని.. ఆ విలువలకు కట్టుబడి ప్రజల అవసరాలు తీరుస్తూ ఎవరి దగ్గరా ఏమీ ఆశించకుండా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ముందుకుపోతున్నానని చెప్పారు.



ఖమ్మం శ్రీనివాసనగర్‌లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పువ్వాడ

ఒక్క ఓటు తగ్గినా గుడ్‌బై

రాజకీయాల నుంచి తప్పుకుంటానన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోదాడరూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 50 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని, ఈ మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 1994లో ఉన్నత ఉద్యోగాన్ని త్యాగం చేసి కోదాడ రాజకీయాల్లోకి వచ్చానని, 1999 నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి ఎంపీగా గెలిచినా కోదాడ, హుజూర్‌నగర్, హైదరాబాద్‌ల్లో అద్దె ఇంటిలోనే ఉంటున్నానని తెలిపారు. ప్రస్తుతం ఒక్కసారి గెలిచినవారే కోట్ల రూపాయలు పెట్టి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారంటే వారి అవినీతి, దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. పోలీసులు, తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా అధికారులు కూడా అధికార పార్టీ నాయకులకే వత్తాసు పలుకుతున్నారని, వారు చెప్పిన వారికే పనులే చేస్తున్నారని విమర్శించారు. అలాంటి అధికారులు, నాయకులు భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ల్యాండ్, శాండ్, వైన్స్, మైన్స్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల తనపై కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని(పార్టీ మార్పును ఉద్దేశించి), వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఉత్తమ్ చెప్పారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న వార్తలు నిరాధారమని కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురికావద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు.

'2023 తెలంగాణ.. కేసీఆర్ ఫ్రీ'

- ట్విట్టర్‌లో కొత్త హ్యాష్‌ట్యాగ్ మొదలెట్టిన వైఎస్సార్‌టీపీ
- ఈ ఏడాదే కేసీఆర్ చెత్తపాలనకు ఆఖరి సంవత్సరం: షర్మిల జోస్యం



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ 'వైఫల్యాల, మోసాల' పాలనను ట్విట్టర్ హ్యాష్‌ట్యాగ్ వేదికగా '2023 తెలంగాణ కేసీఆర్ ఫ్రీ'ద్వారా ప్రపంచమంతా గమనించేలా వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎండగట్టింది. గత ఎనిమిదేండ్ల పాలనలో, ప్రస్తుత బీఆరెస్ సర్కారు వల్ల తెలంగాణ ఎన్ని విధాలా దెబ్బతిందో, జాతీ య స్థాయిలో ఎన్ని రంగాల్లో, ఎన్ని సూచీల్లో అట్టడుగు స్థానానికి పడిపోయిందో, వీటన్నిటినీ నెటిజన్ల ముందుంచి కేసీఆర్‌కు తేరుకోలేని షాకిచ్చింది. దేశంలోనే టాప్ ట్రెండింగ్‌లో ఈ కేసీఆర్ ఫ్రీ కొనసాగుతోంది. దీనిపై స్పందించిన వైఎస్ షర్మిల కొత్త సంవత్సరం మొదటి రోజు కేసీఆర్‌కు తమ పార్టీ షాకిచ్చిందని ట్వీట్ చేశారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి రాష్ట్రాన్ని పాలించిన టీఆర్‌ఎస్ (ఇప్పటి బీ ఆర్ ఎస్) అవినీ తి, అహంకార, అసమర్థ పాలన వలన విద్య, వైద్య, శాంతిభద్రతలు, పారిశుధ్యం, ఇంకా ఎన్నో రంగాలలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకంటే చివరి స్థానంలో నిలుస్తోందన్నారు. దుబారా ఖర్చులతో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన కేసీఆర్ సర్కార్ రాష్ట్రాన్ని రూ.4 లక్షల కోట్ల అప్పులో ముంచిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో హాష్‌టాగ్ ద్వారా యువత ఆత్మహత్యలు, అన్నదాత అప్పు లు, కౌలు రైతుల దారుణ స్థితి తదితర అంశాలలో తెలంగాణ పనితీరు, పురోగతి ఎంత చెత్తగా ఉందో ప్రపంచానికి సునిశితంగా వివరించే ప్రయత్నం చేశామన్నారు. తమ పార్టీ పోరాటం బీఆర్‌ఎస్ మీద కొనసాగుతుందని పేర్కొంటూ ఈ సంవత్సరం కేసీఆర్ చెత్త పాలనకు చివరి సంవత్సరమని వైఎస్ షర్మిల జోస్యం చెప్పారు.

బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్!

- సీఎం కేసీఆర్ సమక్షంలో నేడు పలువురు ఏపీ నేతల చేరిక
- మాజీమంత్రి రావెల కిశోర్‌బాబుతో పాటు మరికొందరు
- చేరిక జాబితాలో మాజీ ఐఆర్‌ఎస్ పార్థసారథి తదితరులు



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కీలక నేత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్‌కు ఏపీలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పగ్గాలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌లో తోట చంద్రశేఖర్, మాజీమంత్రి రావెల కిశోర్‌బాబుతో పాటుగా పలువురు నేతలు కూడా పార్టీలో చేరేందుకు సోమవారం రంగం సిద్ధమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో మధ్యాహ్నం 2 గంటలకు వీరి చేరిక కార్యక్రమం ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. చేరిక అనంతరం ఆంధ్రప్రదేశ్ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షుడిగా కేసీఆర్ ప్రకటిస్తారని, ఆయన సమక్షంలోనే తోట చంద్రశేఖర్ ఏపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. కాగా, రావెల కిశోర్ బాబు, తోట చంద్రశేఖర్, ఐఆర్‌ఎస్ మాజీ అధికారి చింతల పార్థసారథి, టీజే ప్రకాశ్‌తో పాటు ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరతారు. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన తోట చంద్రశేఖర్ 2008లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఆదిత్య హైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారు. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఏలూరు ఎంపీగా, 2019లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. ఇదిలాఉంటే 1987 ఐఆర్‌టీఎస్ కేడర్ అధికారి రావెల కిశోర్ బాబు 2014–18 మధ్యకాలంలో ఏపీ మంత్రిగా పనిచేసి ఆ తర్వాత బీజేపీలో చేరి పార్టీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

త్వరలో మరో విడత సంజయ్ పాదయాత్ర?

7న సమావేశాలపై జిల్లా పార్టీ అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్



కార్యకర్తల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: రాష్ట్రంలో మరిన్ని విడతల 'ప్రజాసంగ్రామయాత్ర'చేపట్టాలనే ఒత్తిడి బీజేపీ నాయకత్వంపై పెరుగుతోంది. పాదయాత్రలతో కార్యకర్తలతో కొత్త ఉత్సాహం నెలకొన్నందున ఆ యాత్రలు కొనసాగించాలనే డిమాండ్ పెరుగుతోంది. దీనికి సంబంధించి కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కనీసం మరో విడత పాదయాత్ర నిర్వహించే అవకాశమున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఇప్పటిదాకా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలో ఐదు విడతలుగా చేపట్టిన పాదయాత్రలకు వచ్చిన భారీ స్పందన ద్వారా బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అనే అభిప్రాయం ఏర్పడిందని పార్టీనేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18 లేదా 20వ తేదీ నుంచి పాదయాత్రను మళ్లీ మొదలుపెట్టే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల పరిధిలోని అసెంబ్లీ సీట్లలో లేదా కొడంగల్ నుంచి నిజామాబాద్, ములుగు నుంచి ఖమ్మం, అచ్చంపేట నుంచి సూర్యాపేట, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఈ యాత్ర చేపట్టే అవకాశాలున్నట్టు పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇటీవల జరిగిన ముఖ్యనేతల భేటీలోనూ ఆరోవిడత పాదయాత్రకు బీజేపీ ప్రధానకార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. దీని తర్వాత బస్సుయాత్ర లేదా మరిన్ని విడతల పాదయాత్రలు నిర్వహించే యోచనలో ఉన్నట్టు సమాచారం. 7న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే పోలింగ్‌బూత్ కమిటీ సభ్యుల సమావేశాల్లో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రికార్డెడ్ ఉపన్యాసాన్ని వినిపించడంతోపాటు హాజరైన వారంతా మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా నమోదు చేసుకోవాలని నిర్ణయించారు. స్థానికంగా అసెంబ్లీలో బూత్ కమిటీలు, శక్తికేంద్రాల (నాలుగైదు పోలింగ్‌బూత్‌లు కలిపి) సమావేశాలు నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జీలు, అసెంబ్లీ కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లతో సంజయ్ నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి.

ఇక బీజేపీదే అధికారం

రాష్ట్రంలో ఇక బీజేపీదే అధికారమని సంజయ్ తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గం కేంద్రంగా జరిగిన బీజేపీ బూత్ కమిటీ సమావేశంలో సంజయ్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌తో తెలంగాణకు బంధం తెగిపోయిందని, సీఎం కేసీఆర్ ఇక్కడ దుకాణం మూసేసి ఇంకోదానిని తెరిచారని ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ శాంతిభద్రతల సమస్యను సృష్టించి బీజేపీ మీద వేయాలని చూస్తోందని ఆరోపించారు.

టీటీడీపీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తెలుగుదేశం పార్టీ (టీటీడీపీ)ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పలు కార్యక్రమాలు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర శాఖ నిర్ణయించింది. ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభను నిర్వహించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. సింహగర్జన పేరుతో నిర్వహించే ఈ సభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు నుంచి నాలుగు జిల్లాల్లో బహిరంగ సభలను నిర్వహించాలని సంకల్పించారు. బస్సుయాత్ర ద్వారా జిల్లాల్లో పర్యటించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించాలని కూడా తీర్మానించారు. బస్సు యాత్రల షెడ్యూల్‌ను త్వరలోనే ఖరారు చేయనున్నట్లు సమావేశం అనంతరం జ్ఞానేశ్వర్ తెలిపారు.

మోదీకి ప్రత్యామ్నాయం రాహుల్‌గాంధీ: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: దేశ ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీనేనని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు స్పష్టం చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని సమర్థిస్తూ బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, మాజీ సీఎం లాలూ ప్రసాద్‌యాదవ్‌లు ప్రకటన చేయడం శుభపరిణామని పేర్కొన్నారు.

పదవుల పందేరం ఎప్పుడు?

సంక్రాంతి తర్వాతైనా బొమ్మల కొలువు ఉంటుందా?

- ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న కీలక పదవులు
- ఏడాదిన్నరగా భర్తీకి నోచుకోని కేబినెట్ బెర్త్
- మండలిలోని ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టు ఖాళీ
- ప్రభుత్వ విప్ పదవుల కోసం ఎదురుచూపులు
- కేసీఆర్ ఆశీస్సుల కోసం ఆశావహుల ఆరాటం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రి మండలిలో కేబినెట్ బెర్త్‌తో పాటు శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్, విప్ పదవులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. శాసనసభ ఎన్నికలు మరో ఏడాది మాత్రమే ఉండటంతో ఖాళీగా ఉన్న కేబినెట్ మంత్రి పదవిపై కన్నేసిన ఆశావహులు బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టిలో పడేందుకు చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, కీలక పదవుల భర్తీ ఉంటుందనే వార్తలు ఎమ్మెలు, నేతలను ఆశలపల్లకిలో విహరింపజేస్తున్నాయి.

- మెదక్ జిల్లాలో రైతులకు సంబంధించిన భూ ఆక్రమణల ఆరోపణలపై ఈటల రాజేందర్‌ను 2021 మే చివరి వారంలో సీఎం కేసీఆర్ మంత్రివర్గం నుంచి తప్పించారు. తదనంతర పరిణామాలతో ఈటల బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఆయన నిర్వర్తించిన వైద్యారోగ్య శాఖ బాధ్యతలను ఆర్థిక మంత్రి హరీష్‌రావుకు అప్పగించారు. ఈటలను కేబినెట్ నుంచి భర్తరఫ్ చేసి ఏడాదిన్నర గడిచినా ఆయన స్థానంలో కొత్తగా మంత్రివర్గంలోకి ఎవరినీ తీసుకోలేదు. సంక్రాంతి తర్వాత జనవరి చివరి వారంలో మంత్రివర్గాన్ని పాక్షికంగా పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరుగుతోంది.మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న కేబినెట్ బెర్త్‌తో పాటు మరో ఇద్దరు మంత్రులను తప్పించి కొత్తవారికి చోటు కల్పిస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. పునర్వ్యవస్థీకరణలో కేబినెట్ నుంచి బయటకు వెళ్లేవారు, కొత్తగా చేరేవారు ఎవరనే అంశంపై పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

మండలి డిప్యూటీ చైర్మన్ పోస్టు ఎవరికో..

శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌తో పాటు మరో రెండు విప్ పదవులు కూడా దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్నాయి. గుత్తా సుఖేందర్‌రెడ్డి మరోమారు ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో 2022 మార్చిలో రెండో పర్యాయం మండలి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగకపోవడంతో 2021 జూన్ నుంచి ఖాళీగానే ఉంది. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు ఇంకా రెండున్నరేళ్ల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయనను ఎమ్మెల్యే కోటాలో సీఎం కేసీఆర్ శాసన మండలికి నామినేట్ చేశారు. దీంతో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన బండా ప్రకాశ్ డిసెంబర్ 2021లో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈయనకు ఈటల స్థానంలో రాష్ట్ర మంత్రివర్గంలోకి లేదా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవి లభిస్తుందనే ప్రచారం జరిగినా ముందుకు సాగలేదు. సుమారు ఏడాదిన్నరగా మండలి డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీగా ఉండటంతో ఆశావహులు కేసీఆర్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఖాళీగానే ప్రభుత్వ విప్ పదవులు

శాసన మండలిలో నలుగురు ప్రభుత్వ విప్‌లకు గానూ ప్రస్తుతం ఎంఎస్ ప్రభాకర్ ఒక్కరే కొనసాగుతున్నారు. బోడకుంటి వెంకటేశ్వర్లు ప్రభుత్వ చీఫ్ విప్‌గా 2019–21 వరకు కొనసాగారు. ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం పూర్తయిన తర్వాత ఆ స్థానంలో కొత్తగా ఎవరికీ అవకాశం దక్కలేదు. మరోవైపు ప్రభుత్వ విప్‌లుగా వ్యవహరించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి 2019లో, కర్నె ప్రభాకర్ 2020లో, కూచుకుంట్ల దామోదర్‌రెడ్డి, భానుప్రసాద్ 2022 జనవరిలో ఎమ్మెల్సీలుగా పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. కర్నె ప్రభాకర్ మినహా మిగతా ముగ్గురు మరోమారు శాసన మండలికి ఎన్నికైనా వీరిలో మళ్లీ ప్రభుత్వ విప్‌లుగా ఎవరికి అవకాశం దక్కకపోగా, సుదీర్ఘకాలంగా మండలిలో ప్రభుత్వ విప్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్, విప్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

మైనార్టీలపై కాంగ్రెస్ 'నజర్'

- సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లింలను మళ్లీ రాబట్టుకునేందుకు యత్నం
- త్వరలోనే రాష్ట్ర వ్యాప్త కార్యక్రమానికి సిద్ధం
- బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టడమే ఎజెండా
- ముస్లిం రిజర్వేషన్లు, స్వయం ఉపాధి పథకాలను డిమాండ్ చేస్తూ ప్రత్యేక కార్యక్రమం
- ఇప్పటికే దిగ్విజయ్‌తో మంతనాలు...
- పూర్తిస్థాయి వివరాలు కోరిన అధిష్టానం
- హాత్‌సే హాత్‌జోడో యాత్ర సమయంలోనే జరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దాదాపు 25 అసెంబ్లీ నియోజకవర్గాల్లో (పాతబస్తీ మినహా) గెలుపోటములపై ప్రభావితం చూపించే మైనార్టీ ఓట్లపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. గతంలో సాంప్రదాయక ఓటు బ్యాంకుగా ఉన్న మైనార్టీలు, ముఖ్యంగా ముస్లింలు చాలా మంది బీఆర్‌ఎస్ వైపు మళ్లిన నేపథ్యంలో వారిని తిరిగి తమ ఖాతాలో వేసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని యోచిస్తోంది. దీనిపై టీపీసీసీ ఇప్పటికే తాత్కాలిక షెడ్యూల్‌ను రూపొందించగా, పూర్తిస్థాయి వివరాలను పంపాలని అధిష్టానం కోరినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో పర్యటించిన దిగ్విజయ్ సింగ్ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపట్టాలా? మరేదైనా రూపంలో కార్యక్రమాన్ని చేపట్టాలా అన్న దానిపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది.

ఆ రెండు పార్టీలూ ఒకటే

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముస్లింలతో పాటు ఇతర మైనార్టీ వర్గాల ఆలోచనలో కూడా మార్పు వచ్చినట్టు పలు ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. గతంలో ఎంఐఎంతో పాటు కాంగ్రెస్‌కు అండగా ఉన్న ఈ వర్గాలు చాలా వరకు ఎంఐఎంతో పాటు బీఆర్‌ఎస్ వైపు మళ్లినట్టు అర్థమవుతోంది. గత పదేళ్లుగా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారానికి దూరంగా ఉండడంతో మైనార్టీ వర్గాలు పార్టీ నుంచి కొంత దూరమయ్యాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని మైనార్టీలకు సంబంధించిన రెండు ప్రధాన డిమాండ్లతో ఆ వర్గాల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ల కల్పన, మైనార్టీలకు స్వయం ఉపాధి కోసం రుణాల మంజూరు అనే అంశాలను తీసుకుని ప్రజల్లోకి వెళ్లనుంది. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన పార్టీగా, దేశ స్థాయిలో బీజేపీకి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ వైపు మైనార్టీలు వచ్చేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ముఖ్యంగా బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలు అంతర్గతంగా ఒక పార్టీకి మరోపార్టీ సహకరించుకుంటున్నాయనే విషయాన్ని మైనార్టీ వర్గాల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా ఆ వర్గాలను ఆకర్షించాలనేది కాంగ్రెస్ పార్టీ యోచనగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే మైనార్టీల పక్షాన యాత్ర లేదంటే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని, జనవరి 26 నుంచి జరగనున్న హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం సమయంలోనే ఈ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్టు సమాచారం.

మైనార్టీల పక్షాన ఉద్యమిస్తాం: జగ్గారెడ్డి

మైనార్టీల పక్షాన త్వరలోనే ఆందోళన చేపడతామని సంగారెడ్డి ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని మైనార్టీల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిపోవని, వెంటనే మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.1500 కోట్ల నిధులను విడుదల చేసి, రుణాల దరఖాస్తు గడువును నెల రోజుల పాటు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సంగారెడ్డి నియోజకవర్గం నుంచే మైనార్టీల పక్షాన నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుందని మంగళవారం ఒక ప్రకటనలో జగ్గారెడ్డి హెచ్చరించారు.



ఎక్కడైతే సరళత్వం, మంచితనం, సత్యం అనేవి లేవో... అక్కడ గొప్పతనం అనేది ఏమీ లేనట్టు!
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, జనవరి, 2

సాహితీ రంగవల్లికలు

ఇది ధనుర్మాసం. ముగ్గుల మాసం. మకర సంక్రాంతి వరకు ముంగిళ్లలో ముగ్గుల వ్రతాన్ని మహిళలు అప్రతిహతంగా కొనసాగిస్తారు. క్రీస్తుపూర్వం పదిహేనో శతాబ్ది ప్రాంతంలో ఆర్యులు అడుగు పెట్టే నాటికే, సింధులోయ నాగరికత పరిఢవిల్లిన చోట ముగ్గులు ఉండేవనేందుకు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆ లెక్కన ముగ్గులు పురాణాల కంటే ప్రాచీనమైనవి. కచ్చితంగా చెప్పుకోవాలంటే, వేదకాలం నాటివి. ముగ్గులు ఆదిమ చిత్రకళా రూపాలు. సింధులోయ ప్రాంతంలోనే కాదు... గ్రీకు, ఈజిప్టు శిల్పాల్లోనూ ముగ్గుల ఆనవాళ్లున్నాయి.

ముగ్గులను సంస్కృతంలో రంగవల్లిక అంటారు. సౌరసేని ప్రాకృతంలోని 'రంగోలి' అనే మాట నుంచి ఈ సంస్కృత పదం పుట్టింది. హిందీ, ఉర్దూల్లో 'రంగోలి' అంటారు. వాల్మీకి రామాయణంలోని యుద్ధకాండలో 'ఏకశృంగో వరాహస్త్వం' అనే వర్ణన ఉంది. సింధులోయ నాగరికత ప్రాంతంలో దొరికిన ముగ్గులలో ఒంటికొమ్ము వరాహరూపం ఈ వర్ణనకు సరిపోతుంది. అంతే కాదు, హరప్పా ప్రాంతంలో దొరికిన వాటిలో ఊర్ధ్వపుండ్రం, త్రిశూలం, అగ్నిగుండం, శివలింగం తదితర రూపాలలోని మెలికల ముగ్గులూ ఉన్నాయి.

సున్నపురాతి నుంచి తయారుచేసిన ముగ్గుపిండితోనూ, వరిపిండితోనూ ముగ్గులు వేయడం ఇప్పటికీ అన్ని చోట్లా వాడుకలో ఉన్న ప్రక్రియ. పురాణకాలంలో కర్పూరంతో రంగవల్లులను తీర్చిదిద్దేవారట! నన్నయ మహాభారతం ఆదిపర్వంలో 'అంగుళలనొప్పె కర్పూర రంగవల్లులు' అని వర్ణించాడు. వారణావతంలోని లక్క ఇంట్లో ఉండటానికి కుంతీసమేతంగా పాండవులు వస్తున్నప్పుడు వారికి స్వాగతం పలకడానికి వారణావతపుర వాసులు ఇంటింటా ముంగిళ్లలో కర్పూరంతో ముగ్గులు వేశారని నన్నయ వర్ణన. 'చిత్రవర్ణాతిశయ నూత్న రత్న చిత్రి/తాంగ రంగవల్లి సురగాంగణముల' అంటూ శివపురంలోని రంగురంగుల రంగవల్లులను నన్నెచోడుడు 'కుమారసంభవం'లో వర్ణించాడు. సీతాదేవి చేత జనక మహారాజు ముగ్గులు వేయించాడట! 'సంతానపరుడమ్మ జనక మహాముని/ తా ముద్దు కూతురిని తా జేరబిలిచి/ ఆవుపేడ తెచ్చి అయినిళ్లు అలికి/ గోవుపేడ తెచ్చి గోపురాలు అలికి/ ముత్యాలు చెడగొట్టి ముగ్గులేయించి' అని జానపద గీతం ఉంది.

'పలనాటి వీరచరిత్ర'లో శ్రీనాథుడు ముత్యాల ముగ్గులను వర్ణించాడు. 'కస్తూరి చేతను కలియ గనలికి/ ముత్యాల తోడ ముగ్గులను బెట్టి/ కర్పూర ముదకంబు కలిపి ముంగిటన్' అంటూ సంక్రాంతి సమయంలో ఆనాటి ముగ్గుల వేడుకను కళ్లకు కట్టాడు. క్రీడాభిరామంలో వినుకొండ వల్లభరాయడు 'చందనంబున గలయంపి చల్లినారు/ మ్రుగ్గులిడినారు కాశ్మీరమున ముదమున/ వ్రాసినా రిందు రజమున రంగవల్లి/ కంజముల దోరణంబులు గట్టినారు' అంటూ చందనంతో కళ్లాపి చల్లి ఆపైన ముగ్గులు వేసిన వైనాన్ని వివరించాడు. 'బోటి గట్టిన చెంగల్వపూవుటెత్తు/ దరు పరిణతోరు కదళి మంజరియు గొనుచు/ బోయి గుడినంబి విజనంబు జేయ జొచ్చి/ మ్రొక్కి వేదిక బలు వన్నె మ్రుగ్గు బెట్టి' అంటూ శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద'లో ఆలయాల్లో ముగ్గులు వేసే ఆనాటి ఆచారాన్ని వర్ణించాడు.


ఆధునికుల్లో తిరుమల రామచంద్ర ముగ్గువేస్తున్న ముదిత గురించి చక్కని సంస్కృత శ్లోకం రాశారు. 'రచయంతీ రంగలతాం/ మంగళగాత్రీ సలీలం అంగణకే/ విటజన హృదయాంగణకే/ అనంగజ బాధాం విశాలయతి కునూనమ్'. చక్కని అమ్మాయి ముంగిట్లో ముగ్గుపెడుతూ విటజనుల హృదయాలలో మన్మథబాధను విస్తరింపజేస్తున్నదని దీని తాత్పర్యం. ఈ శృంగార శ్లోకాన్ని ఆయన తన పదమూడేళ్ల ప్రాయంలోనే రాయడం విశేషం. 'ఉగ్గేల తాగుబోతుకు/ ముగ్గేల తాజమహలు మునివాకిటిలో' అంటూ శ్రీశ్రీ తన 'సిరిసిరిమువ్వ శతకం'లో ముగ్గు ప్రస్తావన తెచ్చారు. నేల మీద ముగ్గులు మనుషులు వేస్తారు గానీ, నీలాకాశం మీద చుక్కల ముగ్గులు వేసేది సాక్షాత్తు భగవంతుడేనని కరుణశ్రీ నమ్మకం. 'పనిమాలి ప్రతిరోజు ప్రాణికోటుల గుండె/ గడియారముల కీలు కదపలేక/ అందాలు చింద నీలాకాశ వేదిపై/ చుక్కల మ్రుగ్గులు చెక్కలేక/ ఎంతశ్రమ యొందుచుంటివో యేమొ స్వామి' అంటూ దేవుడి కష్టానికి కలత చెందడం ఆయనకే చెల్లింది!

ముగ్గుతో ముడిపడిన జాతీయాలు, సామెతలు కూడా ఉన్నాయంటే, ముగ్గులు మన సంస్కృతిలో ఎంతగా పెనవేసుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. బాగా నెరిసిన తలను 'ముగ్గుబుట్ట' అంటారు. 'ముగ్గులోకి దించడం' అంటే ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. 'వాయువేగమును మించి, లోకాలను గాలించి, చిటికెలోనే ఉన్న చోటికే వచ్చు. అదేమిటి?' అనే పొడుపు కథ ఉంది. దీనికి సమాధానం 'ముగ్గు'. మొదలు పెట్టిన చోటే ముగించడం ముగ్గు కళలో ప్రత్యేకత. 'మరిగే నూనెలో ముచ్చటైన ముగ్గు. తీసి తింటే కరకరమంటుంది' అనే పొడుపు కథకు సమాధానం 'జంతిక'. జంతికలు చూడటానికి మెలికల ముగ్గుల్లాగానే ఉంటాయి కదా!

భారతీయులకు ముగ్గులు ముదితల వ్యవహారమే గానీ, కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో ముగ్గులు వేయడం పురుషుల బాధ్యత. ఆఫ్రికన్లు ముగ్గులు వేయడానికి సున్నపురాతి ముగ్గుపిండి, వరిపిండి వంటివేమీ వాడరు. నేరుగా ఇసుకలోనే వేలితో లేదా కర్రపుల్లతో చుక్కలు పెట్టి, చుక్కల చుట్టూ మెలికల ముగ్గులు తీర్చిదిద్దుతారు. ముగ్గుల కళ దేశదేశాల్లో వ్యాపించి ఉన్నా, మన భారతీయ సాహిత్యంలో మాత్రం ముగ్గుల ప్రస్తావన విస్తారంగా కనిపిస్తుంది. అదీ విశేషం!

నూతన సంవత్సర తీర్మానాలు

కామెంట్



కరణ్ థాపర్

జీవన చక్రం కొత్త మలుపు తిరిగినట్టు అనిపించే నూతన సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఏవో కొత్త తీర్మానాలు చేసుకునే సందర్భం ఇది. కొత్త పట్టుదలలు ప్రదర్శించే అవకాశం కూడా! కానీ ఏం తీర్మానం చేసుకోవాలి? ధూమపాన రాయుళ్లకు సిగరెట్లను వదిలిపెట్టాలని అనుకోవడం సులభమైన తీర్మానం. చాకొలేట్లు, పుడ్డింగులు వదిలేసుకునే వాళ్లు నాకు తెలుసు. కొందరయితే మద్యపానం వదులుకోవడాన్ని ఎంచుకుంటారు. అతి కొద్ది మంది మాంసాన్ని కూడా వదిలేసుకుంటారు. మనం దేన్నయినా ప్రతిఘటిస్తున్నప్పుడు దృఢంగా ఉండాలని అనుకుంటాం. దానివల్ల మనది మనకు మెరుగైన భావన కలుగుతుంది. శుద్ధి అయినట్టు కూడా ఉంటుంది. అందుకే దేన్నయినా వదిలేసుకోవడం మంచి అనుభూతిని కలిగిస్తుంది. కానీ నిజమేమిటంటే, ఓటమిని అంగీకరించడం మరింత మంచి అనుభూతిని కలిగిస్తుంది. ఆస్కార్ వైల్డ్ చెప్పినట్లుగా, ఆశను లేదా ప్రలోభాన్ని అధిగమించడంలో ఉత్తమ మార్గం ఏమిటంటే, దానికి లొంగిపోవడమే!

పుట్టినరోజుల్లాగే నూతన సంవత్సరాది కూడా ప్రత్యేకమనిపిస్తుంది. ఈ రెండు సందర్భాల్లోనూ జీవనచక్రం కొత్త మలుపు తిరుగుతుంది. ఆశ, అంచనాలతో ముందుకు చూసే ఒక లిప్త పాటు అది. తాజా తీర్మానాలు చేసుకునే, కొత్త పట్టుదలలు ప్రదర్శించే అవకాశం అది. మనం మరింత ఉత్తమంగా ఉంటామనీ, లేదా కనీసం విభిన్నంగా ఉంటామనీ విశ్వాసం కలిగే సందర్భం ఇది.

నూతన సంవత్సర తీర్మానాలను ప్రజలు ఇందుకే చేసుకుంటారని నేను ఊహిస్తున్నాను. నేను కూడా తప్పనిసరిగా తీర్మానాలు చేసుకున్న కాలం ఒకప్పుడు ఉండేది. సదాచార కట్టుబాట్లు విధించుకుని ఒక వారం పాటు గట్టిగా కట్టుబడి ఉండేవాడిని. తర్వాత మరో వారం దాన్ని బలహీనంగా కొనసాగించి, అటుపై దానిగురించి సంతోషంగా మర్చిపోయేవాడిని. తొలివారం బాగా అనిపించేది. రెండోవారం మాత్రం అపరాధ భావనను మిగిల్చేది. కానీ నా తీర్మానానికి తిలోదకాలు ఇచ్చి నా పాత చెడు మార్గాలకు తిరిగి వెళ్లిపోయినప్పుడే ఉత్తమంగా ఉందనిపించేది.

ఇప్పుడు తీర్మానం లక్ష్యం స్వీయ నిరాకరణే. దీంట్లో తర్కం సరళం. మీరు దేన్నయినా ప్రతిఘటిస్తున్నప్పుడు దృఢంగా ఉండాలని సాధారణంగా భావిస్తుంటారు. కొన్నిసార్లు మీరు శుద్ధి చేయబడినట్లు భావిస్తుంటారు. సాధారణంగా మీరు మెరుగైనట్లు భావిస్తుంటారు. అందుకే దేన్నయినా వదిలేసుకోవడం మంచి అనుభూతిని కలిగిస్తుంది. కానీ నిజమేమిటంటే, ఓటమిని అంగీకరించడం మరింత మంచి అనుభూతిని కలిగిస్తుంది. ఆస్కార్ వైల్డ్ చెప్పినట్లుగా, ఆశను లేదా ప్రలోభాన్ని అధిగమించడంలో ఉత్తమ మార్గం ఏమిటంటే, దానికి లొంగిపోవడమే. అయితే ఆయన గుర్తించనిది ఏమిటంటే, కొంత కాలం ప్రతిఘటించిన తర్వాత దానికి లొంగిపోవడం మరింత ఉత్తమంగా ఉంటుందన్న సంగతి. తిరస్కరణకు సంబంధించిన ఒక మచ్చ ఆకలిని మరింత రెచ్చగొట్టి, ప్రలోభానికి పదునైన అంచును కల్పిస్తుంది. ఇక అతిక్రమణ ఎప్పుడైతే జరుగుతుందో అప్పుడు ఆ మొత్తం మరింత తియ్యగా ఉంటుంది.

సంక్లిష్టమైన ప్రశ్న ఏమిటంటే, అసలు ఒకరు వదులుకోవాల్సినది ఏమిటి? దీనికి ముందు షరతు ఏమిటంటే, అది అంత సులభమైనదిగా ఉండకూడదు. లేకుంటే తొలి వారంలో మీరు అమరత్వం పొందిన సన్యాసత్వ ప్రభను పొందలేరు. అలాగే ఆ వదులుకునేది మీకు ఏమంత మంచిది కాకుండా ఉండాలి. లేకపోతే మీరు చేసుకున్న



తీర్మానం విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు నిందించుకోలేరు. కానీ అంతిమంగా, అది అంత ప్రాధాన్యత లేని విషయంగా ఉండాలి. లేకుంటే మీరు చేతులు ఎత్తేసినప్పుడు మీకు ఉపశమనం కలగక పోగా, అపరాధ భావన కలుగుతుంది.

ఇది ఇక పరిధి లేదా పరిమితిని గణనీయంగా కుదించివేస్తుంది. ధూమపాన రాయుళ్లకు సులభమైన అవకాశం ఏమిటంటే, సిగరెట్లను వదిలిపెట్టడమేనని నేను అనుకుంటున్నాను. ఈ ప్రయత్నంలో వారు విజయవంతమైనప్పుడు వారు మంచి అనుభూతి చెందుతారు. తాము సద్గుణవంతులుగా కూడా భావిస్తారు. అయితే వారు తొట్రుపడి పొరపాట్లు చేసి, తొలి పఫ్ పీల్చే ఆనందానికి లొంగిపోయినప్పుడు అది మరింత బాగుంటుంది.

చాకొలేట్లు, పుడ్డింగులు (కేకుల్లాంటివి) వదిలేసుకునే వాళ్లు నాకు తెలుసు. కొందరయితే మద్యపానం వదులుకోవడాన్ని కూడా ఎంచుకుంటారు. అతి కొద్దిమంది మాంసాన్ని కూడా వదిలేసుకుంటారు. నిజాయితీగా చెప్పాలంటే, వీరిలో ఎవరూ నన్ను ప్రలోభ పెట్టలేదు. నా డిజర్టులు (తీపి పదార్థాలు), తాగుళ్లు నాకు ఎంత ఇష్టమంటే వీటిని వదులుకోవాలనే కనీస ఆలోచన కూడా నేను చేయలేను. నేను కచ్చితమైన మాంసాహారిని. అంతకంటే ముఖ్యంగా, నేనేమీ సాధుత్వం కోసం ప్రయత్నించటం లేదు. వారం, పదిరోజులకోసారి స్వయంకృతాపరాధమే అయినా స్వల్పకాలిక 'చిత్రహింస'ను భరిస్తాను.

నేను అబద్ధాలు చెప్పడం ఆపివేయాలనుకున్న సందర్భం కూడా ఒకటి ఉండేది. ఇప్పుడు నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. ఏదో సామెత చెప్పినట్టు, నేనేమీ అబద్ధాల కోరును కాదు. కానీ వింత అబద్ధాలను చెబుతుంటాను. కానీ చాలా తక్కువసార్లు మాత్రమే. దాన్ని గురించి మీరు ఆలోచించినట్లయితే, ఈ అబద్ధాలను వదులుకోవడం అనేది నూతన సంవత్సర తీర్మానాల్లోకి బ్రహ్మాండంగా సరిపోతుంది. మీరు దాన్ని అమలు చేస్తున్నప్పుడు అది బాగుందనిపిస్తుంది. కానీ మీరు పొరపాట్లు చేయడం మొదలైనప్పుడు మళ్లీ అపరాధ భావన కలుగుతుంది. ఇక మీరు తిరుగుబాటు చేసి, బొంకులు చెప్పడం తిరిగి మొదలుపెట్టినప్పుడు ఎంతో ఉపశమనం కలిగినట్లుగా ఉంటుంది.

నేను దాన్ని కనీసం రెండోరోజు వరకు కూడా పాటించలేకపోయాను. నిజానికి, మొదటిరోజుకే సరిపోయింది. ప్రతి చిన్న అతిశయోక్తినీ తనిఖీ చేసుకోవాల్సి వచ్చింది. అది కూడా ఒక రకం అబద్ధమే. పర్యవసానంగా, సంభాషణ జరపడం అత్యంత అసాధ్యంగా మారింది. నేను ఏం చెప్పాల్సి ఉంటుందనే విషయంపై ఆచితూచి, కచ్చితంగా వ్యవహరించాల్సి వచ్చింది. ఆఖరికి నేను ఏమరుపాటుగా ఏదో చెప్పినదాన్ని కూడా దిద్దుకోవడానికి నన్ను మళ్లీ మళ్లీ ఎంత సవరించుకోవాల్సి వచ్చిందంటే, దాదాపుగా నేనిక మాట్లాడలేక పోయాను. మీకు నన్ను ఒకటి చెప్పనివ్వండి. మీకు గప్పాలు కొట్టడం రాకపోతే గనక, మీరు ఒక కథ చెప్పలేరు. కాబట్టి నా దగ్గర నిజంగానే చెప్పడానికి ఏమీ లేకుండాపోయింది.

2023 సంవత్సరం లోకి అడుగుపెడుతున్న వేళ ఏ 'కొత్త సంవత్సరపు' తీర్మానం చేసుకోవాలో నాకు కచ్చితంగా తెలీదు. నాకు ఇష్టమైనదాన్ని ఉద్దేశపూర్వకంగా నాకు నేనుగా తిరస్కరిస్తున్నప్పుడు ఒక పరమపావన గుణాన్ని నేను అనుభూతి చెందుతాను. కానీ అదేమిటో నేను ఆలోచించలేదు. బహుశా నా మనసును సిద్ధపర్చుకోవడానికి ఈ రోజంతా ఉంది. కానీ అందులో విఫలమవుతానని నాకు ముందే అనిపిస్తోంది. అయితే ఒకటి, కనీసం వచ్చే సంవత్సరం కోసమైనా ఏదైనా ఎంపిక చేసుకోవడానికి నాకు 364 రోజులు ఉంటాయి. కాబట్టి ఏదైనా సరైనదాన్ని గురించి మీరు ఆలోచిస్తున్నట్లయితే, అదేమిటో నన్ను కూడా తెలుసుకోనిస్తారా?

నూతన సంవత్సర శుభాకాంక్షలు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జరగకూడనివి



కొత్త సంవత్సరంలో కనీసం మూడు విషయాల్లో నేను గట్టిగా ఆశావహంగా ఉన్నాను: 1. మూడో ప్రపంచ యుద్ధం జరగదు. లేదా యూఎస్, చైనా, రష్యా మధ్య ప్రత్యక్ష సైనిక ఘర్షణ ఉండదు(కోల్డ్ వార్ 2.0). 2. తైవాన్ మీద చైనా సైనిక దాడి జరగదు. 3. ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా అణ్వాయుధాలను వినియోగించదు.

– వెలీనా త్చకరోవా, విశ్లేషకురాలు

అన్నీ చూసుకోవాలి



చాలా కాలం కిందటే ఈ కొత్త సంవత్సర పార్టీలకు వెళ్లడం నేను మానుకున్నాను. ఎందుకంటే ఎప్పుడైతే మీరు మద్యం తాగరో మీరింక అతిథి కాదు, మీరే అడ్మిన్ అవుతారు.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్


ఇదేనా మంచి?



ముంబయి విమానాశ్రయంలో రెండు సమోసాలు, ఒక చాయ్, ఒక వాటర్ బాటిల్ కలిపి మొత్తం 490 రూపాయలు! చాలా 'అచ్చే దిన్' (మంచి రోజులు) వచ్చినట్టున్నాయి.

– ఫరాహ్ ఖాన్, ట్రావెలర్

కరుణ ముఖ్యం



ప్రతి ఒక్కరికీ మనశ్శాంతి మీద కొంత ఆసక్తి ఉంటుంది. అంతర్గత శాంతిని నిలుపుకోవాలంటే మనం గుర్తించవలసింది – కోపం, అనుమానం లాంటి నాశనకారి ఉద్వేగాలు మన మనసుకు అంతరాయం కలిగిస్తున్నాయని! మరోవైపు కరుణ శాంతినీ, ఆత్మ విశ్వాసాన్నీ తెస్తుంది.

– దలై లామా, బౌద్ధ గురువు

పోగొట్టుకోవద్దు



ప్రజాదరణ అనేది ఇతరుల్లో మన ప్రతిష్ఠకు సంబంధించినది. కానీ సమగ్రత (ఇంటిగ్రిటీ) అనేది మనతో మనకు సంబంధం ఉన్నది. ప్రజాదరణను తిరిగి పొందవచ్చు, కానీ సమగ్రతను పొందలేం.

– మార్క్ మాన్సన్, రచయిత

ఇలా చేయాలి




కొంత ఎండను తగలనిద్దాం! మంచి ఆరోగ్యం, కండరాల వయసు పెరుగుదలను ఆపడానికి ఉన్న ఏకైక మార్గం– శుభ్రంగా తినడం, ఎండ తగలడం, నిద్ర, తగినన్ని నీళ్లు.

– పల్లవీ ఆగా, వెల్‌నెస్ డాక్టర్

తెలుగు–ఒడియా అనువాద వారధి

ఫకీర్ మోహన్ సేనాపతితో మొదలైన ఆధునిక ఒడియా సాహిత్యం ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్త కొత్త ధోరణులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. సమాజం లోని విభిన్న వర్గాల గొంతులను ప్రతిధ్వనిస్తోంది. ఇదివర కటితో పోల్చుకుంటే, ఒడియా రచయితలు అనువాదాలపై మరింతగా దృష్టిపెడుతున్నారు. ముఖ్యంగా ఇరుగు పొరుగు భాషల్లో వెలువడిన సాహిత్యాన్ని ఒడియాలోకి అనువదించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆధునిక ఒడియా సాహిత్య రంగంలో ఇదొక మేలి మలుపు. బరంపురంలో డిసెంబర్ 24, 25 తేదీలలో కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో జరిగిన 'వికాసం' స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు ఒడియా రచయితలు అనువాదాలు మరింత విస్తృతంగా జరగాల్సి ఉందని అన్నారు.

'రాజకీయాలు మనుషులను విడగొడితే, సాహిత్యం మనుషులను చేరువ చేస్తుంది. పరస్పర అనువాదాల వల్ల భాషా సంస్కృతుల మధ్య, మనుషుల మధ్య మరింతగా సఖ్యత ఏర్పడుతుంది' అని ప్రముఖ ఒడియా పాత్రికేయుడు, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు గౌరహరి దాస్ అభిప్రాయ పడటం విశేషం. ఆయన కథలను 'గౌరహరి దాస్ కథలు' పేరిట కెవీవీఎస్ మూర్తి తెలుగులోకి అనువదించారు. 'వికాసం' స్వర్ణోత్సవ కార్య క్రమాల్లోనే ఈ అనువాద సంపుటి ఆవిష్కరణ కూడా జరిగింది.



బంగాళీ నంద



గౌరహరి దాస్

డిజిటల్ మీడియా వ్యాప్తి ఎంతగా పెరిగినా, ఒడియాలో ముద్రిత పత్రికలకూ ఆదరణ తగ్గకపోవడం మరో విశేషం. గౌరహరి దాస్ సంపాదకత్వంలోని 'కథ' మాసపత్రిక ఒడిశాలోనూ, ఒడిశా వెలుపల కూడా మంచి పాఠకాదరణ పొందుతోంది. కేవలం కథానికలను ప్రచురించే ఇలాంటి సాహితీ పత్రికేదీ మన తెలుగులో లేకపోవడం విచారకరం. 'కథ' మాసపత్రికను అత్యధిక జనాదరణ గల దినపత్రిక ఒడియా 'సంబాద్' ప్రచురిస్తోంది. ఇదే కాకుండా, ఒడిశాలో 'కాదంబిని', 'ఆహ్వాన్', 'ఒడియా సాహిత్య', 'ప్రేరణ' వంటి పత్రికలు సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నాయి. ఇవి అనువాద సాహిత్యానికి కూడా పెద్దపీట వేస్తున్నాయి. ఇక 'కరోనా' కాలంలో తెలుగులో మనకు ఉన్న వారపత్రికలు కూడా మూతబడ్డాయి.

ఒడియాలో అనువాద సాహిత్యానికి అక్కడి పత్రికలు బాసటగా నిలుస్తుంటే, మనకు అలాంటి పత్రికలే ఇక్కడ కరవయ్యాయి. తెలుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే, ఒడిశా వెనుకబడిన రాష్ట్రమే అయినా, సాహితీరంగంలో మాత్రం ముందంజలో ఉందనే చెప్పుకోవాలి.


ఇతర భాషల సంగతి పక్కనపెడితే, తెలుగు నుంచి ఒడియాలోకి అనువాదాలు ఇటీవలి కాలంలో చెప్పుకోదగ్గ స్థాయిలోనే వస్తున్నాయి. బరంపురానికి చెందిన కడి రామయ్య వేమన పద్యాలను దాదాపు మూడు దశాబ్దాల కిందటే ఒడియాలోకి అనువదించారు. ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ నవల 'హృదయ నేత్రి'ని రఘునాథ్ పాఢి శర్మ ఒడియాలోకి అదే పేరుతో అనువదించారు. ఇది ఒడియాలోనూ మంచి పాఠకాదరణ పొందింది. వేంపల్లి గంగాధర్ రాసిన 'ఆగ్రా టాంగా'ను 'ఆగ్రారొ టాంగావాలా' పేరిట అంజలీ దాస్ అనువదించారు. తెలుగు నుంచి ఒడియాలోకి విరివిగా అనువాదాలు సాగిస్తున్న వారిలో బంగాళీ నంద ప్రముఖుడు. ఉభయ భాషలూ ఎరిగిన ఒడియా రచయిత బంగాళీ నంద నేరుగా తెలుగు నుంచి ఒడియాలోకి అనువాదాలు సాగిస్తుండటం విశేషం. శివారెడ్డి, ఎన్.గోపి, ఓల్గా తదితరుల రచనలను ఆయన అనువదించారు. వీటిలో పలు పుస్తకాలను సాహిత్య అకాడమీ ప్రచురించింది.

బరంపురానికి చెందిన ఉపద్రష్ట అనూరాధ పలు తెలుగు రచనలను ఒడియాలోకి అనువదించడమే కాకుండా, సుప్రసిద్ధ ఒడియా రచయిత మనోజ్ దాస్ కథలను, పలు ఇతర ఒడియా రచనలను తెలుగులోకి తీసుకొచ్చారు. ఉభయ భాషల్లోనూ ఆమె అనువాదాలు పాఠకాదరణ పొందాయి. కళింగ సీమలో చాగంటి తులసి కూడా విరివిగా అనువాదాలు చేశారు. 'వికాసం' కార్యదర్శి రవిశర్మ ఇటీవల అరణ్యకృష్ణ కవితలను తెలుగు నుంచి ఒడియాలోకి అనువదించారు. ఉభయ భాషల్లోని కొత్తతరం రచయితలు, కవులు విరివిగా అనువాదాలు చేస్తున్నట్లయితే, ఒకరి సాహిత్యం మరొకరికి చేరువ కావడమే కాకుండా, ఉభయ భాషల ప్రజల మధ్య సాన్నిహిత్యం కూడా మరింత పెరుగుతుందని ఆశించవచ్చు.

– పన్యాల జగన్నాథదాసు, కవి, సీనియర్ జర్నలిస్టు

దేశంలో ఆకలి కేకలు ఆగాలంటే...

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

దేశానికి 'స్వాతంత్ర్యం' వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా ప్రజల మౌలిక అవసరాలను పరిష్కరించటంలో పాలక ప్రభుత్వాలన్నీ విఫలమైనాయి. కూడు, గూడు, గుడ్డ లేక పేదలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. కోట్లాది మంది పేదలు ఆహారం కోసం హాహా కారాలు చేస్తున్నారు.

ప్రపంచ ఆకలి సూచిలో (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) భారత స్థానం దిగజారుతూ వస్తున్నది. 2021లో 101 స్థానంలో ఉండగా 2022లో 107వ స్థానానికి దిగజారింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదికలో 121 దేశాలు ఉన్నాయి. వీటిల్లో చైనా, టర్కీ, కువైట్ సహా 17 దేశాలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. ఐర్లాండ్‌కి చెందిన 'కన్సర్న్ వరల్డ్ వైడ్', జర్మనీకి చెందిన 'వెల్ట్ హంగర్ హైఫ్' సంస్థలు ఈ నివేదికను రూపొందించాయి. ఈ 121 దేశాల్లో ఆసియా ఖండంలో భారతదేశం కంటే అఫ్గానిస్తాన్ మాత్రమే వెనకబడి ఉంది. పాకిస్తాన్ 99, బంగ్లాదేశ్ 84, నేపాల్ 81, శ్రీలంక 64 స్థానాల్లో మనకంటే మెరుగ్గా ఉన్నాయి. 2020లో గ్లోబల్ ఇండెక్స్ స్కోర్ 38.8గా ఉండి నేడు 29.1గా నమోదు అయ్యింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్‌ఐ) ప్రపంచ స్థాయిలో, రీజనల్ స్థాయిలో ఆకలిస్థాయిని వెల్లడిస్తుంది. 29.17 స్కోర్‌తో భారతదేశం 'అత్యంత సీరియస్' అన్న లేబుల్ పొందింది. ఆసియా రీజియన్‌లోనూ, మొత్తం ప్రపంచంలో అత్యంత ఎక్కువ ఆకలి స్థాయిలో భారత్ ఉందని నివేదిక వెల్లడించింది.

జీహెచ్‌ఐ నివేదికను పోషకాహార లోపం, పిల్లల పెరుగుదల, పిల్లల మరణాలు వంటి అంశాలను ఆధారంగా చేసుకుని 100 పాయింట్ స్కేల్లో లెక్కిస్తారు. సున్నా వస్తే ఉత్తమ (ఆకలి లేదు) స్కోర్, 100 వస్తే చెత్త స్కోర్, అంటే ఆకలి బాగా ఎక్కువగా ఉండటంగా పరిగణిస్తారు.

దేశంలో పోషకాహార లోపం 2018–20లో 140 శాతం ఉంటే 2019–21 నాటికి 163 శాతానికి పెరిగింది. ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్న జనాభా 828 మిలియన్లు ఉంటే, ఇండియాలోనే 224.3 మిలియన్ల మంది ఉన్నారు. 117 దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించిన నివేదికలో భారతదేశంలో 22.4 కోట్ల మంది పోషకాహారం లభించక బాధపడుతున్నారు. ఇందులో 15 నుంచి 49 ఏళ్ల లోపు వయస్సుగల మహిళలు 51 శాతం అని నివేదిక పేర్కొన్నది. 2019లో చిన్నారుల స్థితిపై యునిసెఫ్ నివేదిక ప్రకారం 5 ఏళ్ల లోపు 69 శాతం పిల్లలు సరైన పౌష్టికాహారం లేక ప్రాణాలు కోల్పోతున్నారు. 4.66 కోట్ల మంది వయస్సుకు తగ్గ ఎత్తు పెరగటం లేదు. 2.56 కోట్ల మంది చిన్నా రులు ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. 5 నుంచి 23 సంవత్సరాల లోపు పిల్లల్లో కేవలం 10 శాతం మందికే పోషక విలువలు గల



ఆహారం లభిస్తున్నదని కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా డేటా తెలుపుతున్నది.

భారతదేశంలో 20 కోట్లకు పైగా వలస కార్మికులు ఉన్నారు. వీరు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. మరో 20 కోట్ల మంది దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. కనీస ఆదాయం లేక 23 కోట్ల మంది రోజు వారీ కూలీలు, చిరు వ్యాపారులు... పస్తులు, అర్ధాకలితో జీవిస్తున్నారు. భారత ఆహార సంస్థ గోదాముల్లో ఆహార ధాన్యాలు ముక్కి పోతున్నా పేదలకు, అన్నార్తులకు అందించక పోవటం ఏమిటని సుప్రీమ్ కోర్టు అనేక సార్లు ప్రశ్నించింది. గోదాముల్లో 7.10 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ ఉన్నాయి. గత ఆరేళ్ల కాలంలో 40 వేల టన్నుల ఆహార ధాన్యాలు పాడై పోయాయి. దీన్ని గమనిస్తే ఆహార ధాన్యాలు పాడైనా ఫరవాలేదు, పేదలకు మాత్రం పంపిణీ చేయం అన్నదే పాలకుల విధానంగా ఉంది.

దేశం అభివృద్ధి బాటలో పయనిస్తున్నదనీ, ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధిని సాధించటమే కాకుండా ఎగుమతి చేసే స్థాయిలో ఉందనీ మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. కేంద్రం చెబుతున్న దానికీ, గ్రామీణ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాల కూ పొంతన లేకుండా ఉంది. గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా రైతాంగం అధిక సంఖ్యలో నిరసనలు చేస్తున్నారు. కోటి 40 లక్షల మంది రైతులు వ్యవసాయం నుంచి ఎందుకు వైదొలిగారు? ఆహార ధాన్యాల ఎగుమతిదారుగా భారత్ ఉంటే రైతాంగం ఎందుకు వ్యవసాయం నుంచి వైదొలుగుతున్నారు? నేటికీ దేశంలో 27 కోట్ల మంది ప్రజలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితుల ఎందుకు ఉన్నాయి? దేశంలో పండిన పంటలను దేశ అవసరాలకు ఉపయోగించి నప్పుడే ఏ దేశమైనా స్వావలంబన సాధించినట్టు చెప్పవచ్చు. ప్రజలకు ఆహారం అందుబాటులో లేక ఆకలి కేకలు పెడుతుంటే, వారి ఆకలి తీర్చకుండా ఎగుమతులు చేయటం స్వావలం బన సాధించటం కాదు.

దేశ ప్రజల పేదరికానికీ, వారి ఆకలి ఆర్తనాదాలకూ దేశ పాలకులు అమలు జరిపిన విధానాలే కారణం. సామ్రాజ్యవాదం, బడా బూర్జువా, భూస్వామ్య వర్గంతో లాలూచి పడిన పాలక ప్రభుత్వాలన్నీ దేశ సహజ వనరులన్నిటినీ వారికి కట్టబెడుతూనే ఉన్నారు. ఫలితంగా దేశాభి వృద్ధి కుంటుపడటమే కాకుండా ప్రజల జీవన ప్రమా ణాలు దిగజారుతూ వచ్చాయి.ఈ పరిస్థితి మారాలంటే... సహజ వనరులన్నీ దేశాభివృద్ధికి ఉపయోగపడేలా చేయాలి. సామ్రాజ్యవాద దోపిడీని అరికట్టాలి. పారి శ్రామిక అభివృద్ధిలో పాత్రధారులైన కార్మికులకూ పరిశ్రమల్లో హక్కు కల్పించాలి. అలాగే గ్రామీణ పేదలకు భూమి పంపిణీ జరగాలి. అప్పుడే దేశంలో ఆకలి కేకలు ఆగిపోతాయి.

వ్యాసకర్త రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు కూలీ సంఘం (ఏపీ) । మొబైల్: 98859 83526

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** శు.ఏకాదశి రా.10.31 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** భరణి సా.5.04 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** తె.5.31 నుండి 7.10 వరకు(తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.37 నుండి 3.22 వరకు, **అమృతఘడియలు:** ప.12.06 నుండి 2.22 వరకు, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం** 6.35 ; **సూర్యాస్తమయం** 5.33.

క్లుప్తంగా...

యాదాద్రిలో నేడు వసతిగదుల సముదాయం ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి వచ్చే భక్తులు బస చేయడాని కోసం నిర్మించిన 240 వసతి గదులను సోమవారం ప్రారంభించనున్నారు. భక్తుల సౌకర్యంకోసం దాతల సహకారంతో నిర్మించిన ఈ వసతి గదుల సముదాయాన్ని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిలు ప్రారంభిస్తారని ఆలయ ఈవో గీతారెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, యాదాద్రి కొండ కింద గల తులసీ కాటేజీ ప్రాంతంలో రూ.21 కోట్ల వ్యయంతో 240 గదులను నిర్మించామని చెప్పారు. కేటగిరీని బట్టి దాతలు రూ.12 లక్షలు, రూ.6 లక్షలు, రూ.5 లక్షల చొప్పున విరాళం ఇచ్చి ఈ వసతి గదుల నిర్మాణానికి తోడ్పాటును అందించారన్నారు. మొదట శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించిన తరువాత గదులను ప్రారంభిస్తామన్నారు. ఈ వసతిగదుల సముదాయం వల్ల భక్తులకు మరిన్ని గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

విసిరిన వలకే చిక్కుకుని...


అగేశ్

శివ్వంపేట (నర్సాపూర్): చేపలు పట్టేందుకు చెరువులోకి దిగిన మత్స్యకారుడికి తాను విసిరిన వలే శాపంగా మారింది. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన మదరబోయిన అగేశ్(47) శనివారం రాత్రి గ్రామ శివారులో ఉన్న కస్నం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపల వల విసిరాడు. ప్రమాదవశాత్తు అది కాళ్లకు చుట్టుకోవడంతో నీటమునిగి అగేశ్ మృత్యువాత పడ్డాడు. ఆదివారం ఉదయం వరకు అగేశ్ ఇంటికి రాకపోవడంతో స్థానికులు ఉదయం చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ విఠల్ తెలిపారు.

రాష్ట్రాల పర్యటనకు అర్థ గణాంక, ప్రణాళిక అధికారులు

సాక్షి, హైదరాబాద్: అర్థగణాంక, ప్రణాళిక శాఖలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో భాగంగా పలు అంశాలపై అధ్యయనం చేసేందుకుగాను రాష్ట్రాల పర్యటనకు వెళ్లాలని ఆయా శాఖల అధికారులు నిర్ణయించారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ నేతృత్వంలో అర్థగణాంక, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు సమావేశమై సుదీర్ఘ సమీక్ష చేశారు. ఈ సమీక్షకు అర్థగణాంక శాఖ డైరెక్టర్ దయానంద్, అధికారులు డి.శివకుమార్, కస్తూరి వెంకట్, బి.వేణుమాధవ్, ఆర్.నరసింహాచారి, హరికృష్ణ, బాబూరావు, వెంకటేశ్వర్లు, అశోక్, వెంకటరమణ, మాన్యలతో పాటు పలు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించిన బృందం కర్ణాటక, తమిళనాడు, కేరళ, రాజస్తాన్‌లకు వెళ్లి క్షేత్రస్థాయి పరిస్థితులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఇందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. అర్థ గణాంక, ప్రణాళిక శాఖలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం కోసం పక్కా ప్రణాళిక రూపొందించాలని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఈ రెండు శాఖలు కీలక పాత్ర పోషిస్తున్నందున సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్లాలని తెలిపారు. ఈ శాఖలను మరింత బలోపేతం చేసేందుకుగాను ఐఏఎస్ అధికారులకు పోస్టింగులు ఇస్తామని వెల్లడించారు.

‘ముక్కోటి’కి యాదాద్రి ముస్తాబు

నేడు ఉదయం 6.48 గంటలకు వైకుంఠనాథుడిగా స్వామి ఉత్తర ద్వార దర్శనం

- మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, విప్ సునీత హాజరయ్యే అవకాశం
- ప్రారంభం కానున్న అధ్యయనోత్సవాలు


ప్రధానాలయం వీధుల్లో భక్తుల రద్దీ. (ఇన్‌సెట్‌లో) యాదాద్రిలో ముస్తాబైన ఉత్తర ద్వారం

యాదగిరిగుట్ట: వైకుంఠ (ముక్కోటి) ఏకాదశికి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధంగా ఉన్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముస్తాబయ్యాయి. సోమవారం యాదాద్రీశుడు వైకుంఠనాథుడిగా ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ప్రధానాలయం ప్రారంభమయ్యాక తొలిసారిగా వస్తున్న వైకుంఠ ఏకాదశి కావడంతో ఇది చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ప్రధానాలయం పనులు జరుగుతున్న సందర్భంగా బాలాలయంలో తూర్పు ద్వారం గుండానే భక్తులకు శ్రీస్వామి వారు దర్శనం ఇచ్చారు. ఈ సారి ప్రధానాలయంలో ఉత్తర ద్వారం ఏర్పాటు చేయడంతో ఉత్తర రాజగోపురం నుంచి భక్తులకు వైకుంఠనాథుడి దర్శన భాగ్యం కల్పిస్తారు.

ప్రధానాలయంలో..

వైకుంఠ ద్వార దర్శనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో రంగురంగుల పుష్పాలు, మామిడి, అరటి తోరణాలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సరిపడా పులిహోర, లడ్డూ మహా ప్రసాదాలను సిద్ధం చేశారు. ప్రధానాలయంలో సోమవారం ఉదయం 6.48 గంటలకు శ్రీస్వామివారు వైకుంఠనాథుడిగా దర్శనం ఇవ్వనున్నారు. ఈ వేడుకల్లో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొనే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

పాతగుట్టలో..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కూడా ఉదయం 6.48 గంటలకు ఉత్తర ద్వారానికి శ్రీస్వామి వారిని వేంచేపు చేయించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం శ్రీస్వామి వారిని ఆలయ ముఖ మండపంలో అధిష్ఠింపచేసి, క్యూలైన్లలో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఉదయమే భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున్న ఉత్తరం వైపు భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరిచి సుప్రభాతం, ఆరాధన, తిరుప్పావై నిర్వహించి, అలంకార సేవను ఏర్పాటు చేస్తారు. ఉదయం 6.48 గంటల నుంచి 7 గంటల వరకు వైకుంఠద్వార దర్శనం, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అలంకార దర్శనం కల్పిస్తారు.


నేటి నుంచి అధ్యయనోత్సవాలు..

యాదాద్రీశుడి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 6వతేదీ వరకు ఐదు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలలో విశేష అలంకార సేవలు నిర్వహిస్తారు. ఐదురోజులపాటు లక్ష్మీ సమేతుడైన నారసింహుడు దశావతారాలతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక అలంకరణ సేవల్లో తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అధ్యయనోత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు భక్తులు నిర్వహించే మొక్కు, శాశ్వత బ్రహ్మోత్సవాలు, నిత్య, శాశ్వత కల్యాణోత్సవాలు, శ్రీసుదర్శన నారసింహ హోమం రద్దు చేశారు.

‘యాదాద్రి’కి పోటెత్తిన భక్త జనం

- నూతన సంవత్సరం రోజు భారీగా భక్తుల రాక
- స్వామి దర్శనానికి 4 గంటల సమయం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరంతో పాటు ఆదివారం సెలవు రోజు కలసి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. శనివారం అర్ధరాత్రి నుంచే భక్తులు భారీగా శ్రీనృసింహుడి సన్నిధికి వచ్చారు. దీంతో కొండ కింద గల అద్దె గదులు పూర్తిగా నిండిపోవడంతో భక్తులు చాలా వరకు వైకుంఠద్వారం ముందు, రింగ్ రోడ్డు, పాత గోశాల సమీపంలో నిద్రించారు. ఆదివారం వేకువజాము నుంచే శ్రీస్వామిని దర్శించుకునేందుకు యాదాద్రి కొండకు చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద కౌంటర్లు, బస్టాండ్, ఘాట్ రోడ్డు, లక్ష్మీపుష్కరిణి, మెట్ల దారి, కల్యాణకట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో కనిపించారు. స్వామి వారి ధర్మదర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర, బ్రేక్ దర్శనానికి 20 నిమిషాల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆదివారం 50 వేలకుపైగా భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8 గంటలు దాటినా భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో కనిపించారు. సోమవారం వైకుంఠ ఏకాదశి కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా, వివిధ పూజలతో దేవస్థానానికి రూ.75,94,285 నిత్యాదాయం వచ్చింది.



హంసవాహనంలో రామయ్య జల విహారం

- భద్రాచలంలో కనులపండువగా తెప్పోత్సవం
- భారీగా తరలి వచ్చిన భక్తజనం
- నేడు ఉత్తర ద్వార దర్శనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రగిరిపై కొలువైన వైకుంఠ రాముడు గోదావరి నదిలో జలవిహారం చేశారు. హంస వాహనంలో సీతాసమేతుడై జలవిహారం చేస్తున్న రామయ్యను చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం తెప్పోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి తిరుప్పావై సేవాకాలం, మూలవర్లకు అభిషేకం, వేద పారాయణం, ప్రబంధ పాశుర పఠనం.. తదితర కార్యక్రమాలను ఆలయంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం దర్బారు సేవ అనంతరం ప్రత్యేక పల్లకిలో సీతాసమేత రామచంద్రస్వామిని మేళతాళాల నడుమ గోదావరి తీరానికి తీసుకెళ్లారు. అక్కడ హంసాకృతిలో అలంకరించిన పడవలో సీతారాములను వెంచేపు చేసి, ఆగమ శాస్త్ర పద్ధతిలో షోడశోపచార పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు హంస వాహనంలో స్వామివారి జలవిహారం ప్రారంభమైంది. ఒక్కో పరిక్రమణానికి ఒక్కో రకమైన హారతి ఇస్తూ కనుల విందుగా వేడుకను నిర్వహించారు. రాత్రి 7:01 గంటలకు ఐదు పరిక్రమణాలతో తెప్పోత్సవాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, భూలోక వైకుంఠంగా పేరొందిన భద్రాచలంలో సోమవారం శ్రీసీతారామచంద్రస్వామి భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తారు. ఇందుకోసం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.


గంగాజలం కోసం వెళుతున్న మెస్రం వంశీయులు

నాగోబా జాతర నిర్వహణకు తొలి అడుగు

- గంగాజలం సేకరణ పాదయాత్రకు శ్రీకారం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతర నిర్వహణకు తొలి అడుగు పడింది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని నిర్వహించే నాగోబా మహా పూజకు గంగాజలం కోసం మెస్రం వంశీయులు ఆదివారం బయల్దేరి వెళ్లారు. ఏడు రోజుల పాటు మెస్రం వంశీయులున్న గ్రామాల్లో నాగోబా మహాపూజ, గంగాజలం సేకరణపై ప్రచారం నిర్వహించి కేస్లాపూర్ చేరుకున్నారు. ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు ఆదివారం కేస్లాపూర్ గ్రామానికి చేరి నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో సమావేశమై గంగాజలం పాదయాత్ర, నాగోబా మహాపూజ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఝరి (కలశం) దేవతకు మెస్రం వంశీయులు, మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం గంగాజలం సేకరణ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెస్రం వంశం అల్లుళ్లు, ఆడపడుచులు బుందో పట్టగా... మెస్రం వంశీయులు కానుకలు వేసి ముందుకు సాగారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు శాశ్వత భవనాలు

- ఒక్కో భవనానికి రూ.50 లక్షలు వెచ్చించేందుకు ఈఎస్‌ఐసీ సిద్ధం
- స్థలాల గుర్తింపు బాధ్యత కలెక్టర్లకు అప్పగింత!



సాక్షి, హైదరాబాద్: ఈఎస్‌ఐ చందాదారులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ కార్యాచరణ చేపట్టింది. క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు అన్ని రకాల వసతులతో శాశ్వత భవనాలను నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 71 డిస్పెన్సరీలున్నాయి. ఇవిగాకుండా కొత్తగా 14 డిస్పెన్సరీలను ఈఎస్‌ఐ కార్పొరేషన్ మంజూరు చేసింది. ప్రస్తుతమున్న డిస్పెన్సరీల్లో 65 డిస్పెన్సరీలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె కాంట్రాక్టు గడువు ముగియడంతో కొన్నింటిని పలు మార్లు మార్పు చేసిన సందర్భాలున్నాయి. డిస్పెన్సరీల మార్పులతో అటు రోగులకు, ఇటు వైద్యులు, సిబ్బందికి ఇబ్బందులు వస్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు శాశ్వత భవనాల నిర్మాణానికి కార్మిక శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి డిస్పెన్సరీకి శాశ్వత భవనంకోసం అనువైన స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మరోవైపు అనువైన స్థలాల గుర్తింపు బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని కోరింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

స్థలాలు గుర్తిస్తే వెంటనే భవన నిర్మాణం..

ప్రస్తుతం స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని కార్మిక శాఖ భావిస్తోంది. ఈ దిశగా చర్యలు వేగవంతం చేసింది. స్థలాలను గుర్తిస్తే వెంటనే భవన నిర్మాణాలను చేపట్టేందుకు కార్మిక శాఖ సిద్ధంగా ఉంది. గతవారం ఈఎస్‌ఐసీ ప్రాంతీయ బోర్డు సమావేశం జరిగింది. రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిస్పెన్సరీలకు శాశ్వత నిర్మాణాలపైనా చర్చించారు. ఈ క్రమంలో ఈఐఎస్‌ఐసీ ఉన్నతాధికారులు స్పందిస్తూ శాశ్వత భవనాలను నిర్మించేందుకు అవసరమైన నిధులను ఇచ్చేందుకు కార్పొరేషన్ సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు ఒక్కో భవనానికి రూ.50 లక్షలు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. ఈ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిసహాయ సహకారాలను తీసుకుంటామని వివరించారు. చందాదారుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ముఖరా కే గ్రామం పల్లెలకు ఆదర్శం కావాలి: ఎర్రబెల్లి



సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా కే గ్రామం పల్లెప్రగతి విజయవంతంగా అమలు చేసి స్వయం సమృద్ధి గ్రామంగా అభివృద్ధి చెందుతోందని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. పల్లెప్రగతి ద్వారా సమకూర్చిన ట్రాక్టర్, అమలు చేస్తున్న తడి చెత్త, పొడి చెత్త విధానం, డంపింగ్ యార్డు నిర్వహణ, కంపోస్ట్ ఎరువు తయారీ ఇప్పుడు ఆ గ్రామానికి ఆదాయ మార్గంగా మారిందన్నారు. ఈమేరకు ఆదివారం మంత్రిని కలిసి సర్పంచ్ దంపతులు తమ గ్రామంలో తయారు చేసిన వర్మీకంపోస్టును అందజేశారు. ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ, దాన్ని వర్మీకంపోస్ట్ ఎరువుగా మార్చడం ద్వారా ఈ గ్రామ సర్పంచ్ గాడిగె మీనాక్షి ఏడాదిన్నరలో రూ.7 లక్షల ఆదాయం సంపాదించారు. ఇందులో రూ.4 లక్షలతో సోలార్ లైట్లు, రూ.2 లక్షలతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఆర్గానిక్ కంపోస్ట్ తయారు చేయడమే కాకుండా దానిద్వారా వచ్చే లాభాలను రైతులకు వివరించడం ద్వారా వంద మంది ఆ గ్రామంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నట్లు సర్పంచ్ వివరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి గ్రామ సర్పంచ్‌ను అభినందించారు. పల్లెప్రగతి స్ఫూర్తిని అర్థం చేసుకుని ప్రతి పల్లె స్వయం సమృద్ధంగా మారాలని, పరిశుభ్రంగా ఉంటూ, పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.

సన్మానానికి దూరంగా రిటైర్డ్ ఐఏఎస్‌లు

- పోస్టింగ్స్‌లో అన్యాయం, ఉద్యోగ విరమణ రోజైనా వీడ్కోలు గౌరవం లభించలేదని అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘంలో లుకలుకలు బయటపడ్డాయి. ఉద్యోగ విరమణ చేసిన ఐఏఎస్ అధికారులకు తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించింది. 19 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించగా, కేవలం ముగ్గురు నలుగురు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండి తమ నిరసనను తెలియజేశారు. సుదీర్ఘ కాలంగా లూప్‌లైన్లలో ఉంచి పోస్టింగ్‌లలో తీవ్ర అన్యాయం చేయడం, సీనియారిటీని గౌరవించకపోవడంతో పాటు ఉద్యోగ విరమణ సమయంలో కనీస గౌరవంగా వీడ్కోలు కూడా పలకలేదని చాలా మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు తీవ్ర అసంతృప్తితో ఉండటమే దీనికి కారణమని తెలుస్తోంది. కెరీర్‌లో ఇంత అన్యాయం జరిగిన తర్వాత వాళ్లు ఇచ్చే శాలువాలు, పూలబొకేల కోసం ఈ కార్యక్రమానికి వెళ్లాలా? అని ఓ రిటైర్డ్ అధికారి ఒకరు ‘సాక్షి’కి తెలిపారు. ప్రధానంగా రిటైర్డ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐఏఎస్ అధికారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అందుకే సన్మాన కార్యక్రమానికి చాలామంది దూరంగా ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ వ్యవహరిస్తున్నారు. సోమేశ్‌కుమార్ తీరు పట్ల అసంతృప్తితో మరికొందరు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మద్యం మత్తులో మితిమీరిన వేగంతో..

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరిని బలిగొన్న డ్రంకెన్ డ్రైవ్
- న్యూ ఇయర్ పార్టీ తర్వాత కారును నడిపిన యువకుడు
- వాహనాలు, పాదచారుల పైకి దూసుకుపోయిన కారు

బంజారాహిల్స్ (హైదరాబాద్): న్యూ ఇయర్ పార్టీలో పాల్గొన్న ఇద్దరు యువకులు తెల్లవారుజాము వరకు మత్తులో జోగారు. అదే నిషాలో తమ వాహనంలో ఇంటికి బయలుదేరారు. బంజారాహిల్స్ రోడ్ నం.2లో వీరి వాహనం అదుపు తప్పి పాదచారుల పైకి దూసుకుపోయింది. డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీలు కొట్టింది. ఈ ఉదంతంలో ఇద్దరు పాదచారులు అక్కడికక్కడే చనిపోగా... మరికొందరు క్షతగాత్రులయ్యారు. మొత్తం మూడు వాహనాలు ధ్వంసం అయ్యాయి. కారు డ్రైవర్ మద్యం మత్తు కారణంగా కొత్త సంవత్సరం తొలి రోజే ఇద్దరికీ ఆఖరి రోజైంది. అభం శుభం తెలియని వీరి బతుకులు తెల్లవారుజామునే తెల్లారిపోయాయి.

ఇద్దరూ వలసవచ్చిన వాళ్లే...

ఏపీలోని రాజమండ్రి సమీపంలోని రాలీ గ్రామానికి చెందిన అవిడి శ్రీను (50) నగరానికి వలసవచ్చాడు. పెయింటర్‌గా పని చేస్తూ కొండాపూర్‌లో భార్య సీత, ముగ్గురు కుమార్తెలతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్ నం.2లోని రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద టీ తాగాడు. కొండాపూర్ వెళ్లడానికి రోడ్డు దాటుతున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని కాళ్ల మండలం జక్రం గ్రామానికి చెందిన భీమవరపు ఈశ్వరి (55) కూడా అదే సమయంలో రోడ్డు దాటుతున్నారు. నగరానికి వలసవచ్చిన ఆమె బంజారాహిల్స్ ఇందిరానగర్‌లో ఉంటున్నారు. ఆమె కొన్నాళ్ల క్రితం బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో హెల్పర్‌గా పని చేసి మానేశారు. ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఆమె కుమారుడు అరుణ్‌కుమార్ బాచుపల్లిలో నివసిస్తున్నాడు.


ఈశ్వరి


అవిడి శ్రీను

తనిఖీలు ముగిసే వరకు ఆగి...

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 10 నుంచి ఆదివారం తెల్లవారుజామున 5 గంటల వరకు డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న విద్యానగర్‌కు చెందిన కొడాలి ప్రణవ్ (21), నాచారంకు చెందిన పోలసాని శ్రీవర్ధన్‌రావు (21) ఈ విషయం గమనించి ఆ సమయం దాటిన తర్వాత ఇంటికి బయలుదేరారు. మణిపాల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వీరు.. ప్రణవ్ తండ్రి పేరుతో ఉన్న సిలేరియా కారులో ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో ప్రణవ్ వాహనాన్ని నడుపుతున్నాడు. తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఈ వాహనం బంజారాహిల్స్ రోడ్ నం. 2 కేబీఆర్ పార్కు వైపు నుంచి పంజగుట్ట వైపు మితిమీరిన వేగంతో వస్తోంది. అక్కడి రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు కుడి వైపునకు మలుపు తిరిగి ఉంటుంది. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారును నడుపుతున్న ప్రణవ్ ఆ మలుపు వద్ద వాహనాన్ని కంట్రోల్ చేయలేకపోయాడు. ఆ దారిలో వెళ్తున్న రెండు కార్లను ఢీ కొట్టాడు. వాహనం అప్పటికీ నియంత్రణలోకి రాక డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచి పల్టీలు కొట్టింది. ఆ సమయంలో అక్కడే రోడ్డు దాటుతున్న శ్రీను, ఈశ్వరిలను బలంగా ఢీకొంది. దీంతో వీరిద్దరూ గాల్లోకి ఎగిరి పది అడుగుల దూరంలో ఉన్న ఓ ఫొటో స్టూడియో బోర్డును తగిలి కిందపడ్డారు. తీవ్రగాయాల పాలైన వీరిని ఆస్పత్రికి తరలించేందుకు స్థానికులు ప్రయత్నించగా, అప్పటికే ప్రాణాలు వదిలారు. ఆ రెండు కార్లు నుజ్జునుజ్జు కాగా వాటిలో ప్రయాణిస్తున్న వారికీ గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రణవ్, శ్రీవర్ధన్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. వీరి రక్తనమూనాలను పరీక్షలకు పంపగా మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆఫీసు అద్దె కట్టని ట్విట్టర్

కోర్టుకెక్కిన భవన యజమాని

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేతికి వెళ్లినప్పటి నుంచీ ట్విట్టర్‌ను వరుస బెట్టి కష్టాలు చుట్టుముడుతున్నాయి. తాజాగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న కార్యాలయానికి 1,36,250 డాలర్ల అద్దె చెల్లించడంలో విఫలమవడంతో పరిస్థితి విషయం కోర్టు కేసు దాకా వెళ్లింది! హార్ట్‌ఫోర్డ్ బిల్డింగ్‌లో 30వ అంతస్తులో ఉన్న కార్యాలయానికి బకాయి ఉన్న అద్దెను ఐదు రోజుల్లోగా చెల్లించాలంటూ గత డిసెంబర్ 16న యాజమాన్య సంస్థ కొలంబియా రీట్ తాఖీదులిచ్చింది. గడువులోగా చెల్లించకపోవడంతో గురువారం ట్విట్టర్‌పై కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది! ప్రధాన కార్యాలయంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏ కార్యాలయానికి ట్విట్టర్ కొద్ది కాలంగా అద్దె చెల్లించడం లేదంటూ న్యూయార్క్ టైమ్స్ డిసెంబర్ 13వ తేదీనే కథనం ప్రచురించింది. రెండు చార్టర్ విమానాల అద్దె చెల్లించేందుకు తిరస్కరించినందుకు డిసెంబర్లో కూడా ట్విట్టర్‌పై కేసు నమోదైంది.

క్లుప్తంగా...

కాబూల్ విమానాశ్రయంలో బాంబు పేలుడు

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో మిలటరీ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కొందరు మరణించారని, పలువురికి గాయాలయ్యాయని తాలిబన్ అధికారులు వెల్లడించారు. కానీ కచ్చితంగా ప్రాణనష్టం ఎంత జరిగిందో చెప్పలేదు. ఈ బాంబు దాడికి ఇప్పటివరకు ఎవరూ బాధ్యతను ప్రకటించలేదు. అయితే ఖొరాసన్ ప్రావిన్స్‌లో ఇస్లామిక్ స్టేట్ పని అయి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళలపై అరాచకాలు : 31 వేల ఫిర్యాదులు

న్యూఢిల్లీ: మహిళలపై జరిగిన నేరాలు ఘోరాలకు సంబంధించి 2022లో దాదాపుగా 31 వేల ఫిర్యాదులు అందాయని జాతీయ మహిళా కమిషన్ వెల్లడించింది. 2014 తర్వాత ఇవే అత్యధికమని తెలిపింది. 2021లో 30,864 ఫిర్యాదులు అందితే , తర్వాత ఏడాదికి స్వల్పంగా పెరిగి 30,957 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల్లో ఎక్కువగా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినవే ఉన్నాయని, 9,710 వరకు ఆ ఫిర్యాదులేనని గణాంకాలు వెల్లడించాయి. ఆ తర్వాత గృహ హింసకు సంబంధించి 6,970 కేసులు, వరకట్నం వేధింపులు 4,600 ఫిర్యాదులు అందాయి.

పాక్, భారత్ మధ్య అణు సమాచార మార్పిడి

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య భవిష్యత్‌లో ఉద్రిక్తతలు పెరిగిపోతే దాడులు చేయకూడదని అణు కేంద్రాలు, స్థావరాలపై సమాచారాన్ని ఇరు దేశాలు ఇచ్చిపుచ్చుకున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించినప్పటికీ మూడు దశాబ్దాలుగా ప్రతీ ఏడాది జరిగే అణు సమాచారాన్ని ఇరుదేశాలు ఒకరికొకరు అందించుకున్నట్టుగా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 1991లో ఇరు దేశాల మధ్య అమల్లోకి వచ్చిన అణు కేంద్రాలు, స్థావరాలపై దాడులు నిషిద్ధమనే ఒప్పందం మేరకు ఈ స్థావరాల వివరాలు అందించుకున్నారు.

కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం.. ముగ్గురు పౌరులు మృతి

రాజౌరి: జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లా రాజౌరిలో ఆదివారం సాయంత్రం మైనారిటీ వర్గం లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా 10 మంది గాయపడ్డారు. రాజౌరికి 8 కిలోమీటర్ల దూరంలోని అప్పర్ డాంగ్రి గ్రామంలోని మూడు ఇళ్లలోకి చొరబడిన ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. క్షతగాత్రులైన 10 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. తప్పించుకుపోయిన ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టినట్లు అదనపు డీజీపీ ముకేశ్ సింగ్ చెప్పారు.

పెరిగిన పాక్ డ్రోన్ల ముప్పు

చండీగఢ్: పాకిస్తాన్ నుంచి డ్రోన్లు సరిహద్దును దాటి భారత్‌లోని పంజాబ్‌లోకి ప్రవేశిస్తున్నాయి. ఇలా వచ్చిన డ్రోన్ల సంఖ్య కేవలం ఏడాదిలోనే నాలుగు రెట్లు పెరగడం గమనార్హం. 2021లో 67 డ్రోన్లు, 2022లో 254 డ్రోన్లు పాక్ భూభాగం నుంచి పంజాబ్‌లోకి వచ్చినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022లో 254 డ్రోన్లు రాగా, వీటిలో 9 డ్రోన్లను బీఎస్‌ఎఫ్ సిబ్బంది కూల్చివేశారు. 13 డ్రోన్లు వివిధ కారణాలతో నేలకూలాయి. పాక్ ముష్కరులు మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రితో కూడిన డ్రోన్లను భారత్‌లోకి చేరవేస్తున్నట్లు సైనికాధికారులు చెబుతున్నారు. 2022లో గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లో ఉన్న తూర్పు సరిహద్దులో 311 డ్రోన్లను గుర్తించారు. 2020లో 77, 2021లో 104 డ్రోన్లు పట్టుబడ్డాయి. సరిహద్దుల్లో జామింగ్ టెక్నాలజీ లేదా రైఫిల్ ఫైరింగ్ ద్వారా డ్రోన్లను కూల్చివేస్తున్నట్లు బీఎస్‌ఎఫ్ అధికారి ఒకరు వెల్లడించారు. కూల్చివేతలో పాల్గొన్న బృందానికి రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తున్నామని తెలిపారు.

'రాహుల్ ప్రభ కొనసాగితే రాజకీయ మార్పు తథ్యం'

ముంబై: కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ ఒక నాయకుడిగా గత ఏడాది బలోపేతం అయ్యారని, ఆయన ప్రాభవం పెరిగిందని ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన నేత సంజయ్ రౌత్ చెప్పారు. ఈ ఏడాది కూడా ఇదే ట్రెండ్ కొనసాగితే 2024లో సాధారణ ఎన్నికల్లో రాజకీయంగా భారీ మార్పు ఖాయమని శివసేన పత్రిక 'సామ్నా'లో రాసిన వ్యాసంలో స్పష్టం చేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!



ఎప్పుడో 50 వేల ఏళ్ల క్రితం కన్పించిన ఓ తోకచుక్క త్వరలో మళ్లీ మనల్ని పలకరించనుంది. ఫిబ్రవరి 1న భూమికి అత్యంత సమీపంగా, అంటే 2.6 కోట్ల మైళ్ల దూరం నుంచి వెళ్లనుంది. జనవరి 26 నుంచి వారం పాటు మామూలు కంటికి కూడా కన్పిస్తుందని నాసా చెబుతోంది. అది ప్రస్తుతం మనకు 11.7 కోట్ల మైళ్ల దూరంలో ఉంది. సి2022 ఈ3గా పిలుస్తున్న ఈ తోకచుక్కను నాసా సైంటిస్టులు కెమెరాలో బంధించారు. అన్నట్టూ, భూమి మాదిరిగానే ఇది కూడా సూర్యుని చుట్టూ తిరుగుతుందట. 50 వేల ఏళ్లకు ఒక పరిభ్రమణం పూర్తి చేస్తుందట! 2020 జూలైలోనూ ఇలాగే ఒక తోకచుక్క మనకు కన్పించేంత సమీపంగా వచ్చింది.

నయా సాల్ జోష్.. 3.50 లక్షల బిర్యానీలు

2.5 లక్షలకు పైగా పిజ్జా ఆర్డర్లు

దేశవ్యాప్తంగా ఒక్కరోజులో డెలివరీ చేసిన స్విగ్గీ



హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకలను జనం బిర్యానీ, పిజ్జాలతో ఘనంగా జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా శనివారం ఒక్కరోజే 3.50 లక్షల బిర్యానీ, 2.5 లక్షలకు పైగా పిజ్జా ఆర్డర్లను కస్టమర్లకు చేరవేసినట్లు చేసినట్లు ఫుడ్ డెలివరీ యాప్ 'స్విగ్గీ' వెల్లడించింది. ట్విట్టర్‌లో తాము నిర్వహించిన ఓ సర్వేలో 75.4 శాతం మంది హైదరాబాద్ బిర్యానీ, 14.2 శాతం మంది లక్నో బిర్యానీ, 10.4 శాతం మంది కోల్‌కతా బిర్యానీని ఇష్టపడుతున్నట్లు తేలిందని వివరించింది. హైదరాబాద్‌లో బావార్చీ హోటల్ పసందైన బిర్యానీకి పేరొందిన హోటల్. కొత్త సంవత్సరం డిమాండ్‌ను తట్టుకోవడానికి శనివారం ఏకంగా 15 టన్నుల బిర్యానీని సిద్ధం చేసినట్లు బావార్చీ హోటల్ యాజమాన్యం తెలియజేసింది. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి 7 గంటల కల్లా 1.76 లక్షల చిప్స్ ప్యాకెట్లను కస్టమర్లు ఆర్డర్ చేశారని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ పేర్కొంది. అలాగే 2,757 డ్యూరెక్స్ కండోమ్ ప్యాకెట్లను కస్టమర్లకు చేరవేశామని తెలిపింది. కొత్త సంవత్సరం సందర్భంగా దేశవ్యాప్తంగా 12,344 మంది వినియోగదారులు కిచిడీ కోసం స్విగ్గీలో ఆర్డర్ చేయడం మరో విశేషం.

ప్రమాదకరంగా పైపైకి

శరవేగంగా పెరుగుతున్న సముద్ర మట్టాలు

- మధ్యధరా తీరంలో ఇది మరీ ఎక్కువ
- వాతావరణ మార్పులే ప్రధాన కారణం
- పెను హెచ్చరిక సంకేతాలే: నిపుణులు



మధ్యధరా సముద్ర ప్రాంత ద్వీపమైన కోర్సికా వద్ద ఇటీవల విరుచుకుపడ్డ రాకాసి అలలు

వాతావరణ మార్పులు, తద్వారా నానాటికీ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రపంచాన్ని నానాటికీ ప్రమాదపుటంచులకు నెడుతున్నాయి. వీటి దుష్పరిణామాలను 2022 పొడవునా ప్రపంచమంతా చవిచూసింది. ఆస్ట్రేలియా మొదలుకుని అమెరికా దాకా పలు దేశాల్లో ఒకవైపు కార్చిచ్చులు, మరోవైపు కనీవినీ ఎరగని వరదలు, ఇంకోవైపు తీవ్ర కరువు పరిస్థితులు, భరించలేని వేడి గాలుల వంటివి జనానికి చుక్కలు చూపాయి. ఆర్కిటిక్ బ్లాస్ట్ దెబ్బకు ఇంగ్లండ్‌తో పాటు పలు యూరప్ దేశాలు గత 40 ఏళ్లలో ఎన్నడూ కనీవినీ ఎరగనంతటి చలి, మంచు వణికించాయి. ఆ వెంటనే అమెరికాపై విరుచుకుపడ్డ బాంబ్ సైక్లోన్ 'శతాబ్ది మంచు తుపాను'గా మారి దేశమంతటినీ అతలాకుతలం చేసి వదిలింది. 2023లో కూడా ఇలాంటి కల్లోలాలు, ఉత్పాతాలు తప్పవని పర్యావరణ నిపుణులు ఇప్పటినుంచే హెచ్చరిస్తుండటం మరింత కలవరపెడుతోంది. వీటికి తోడు మరో పెను సమస్య చడీచప్పుడూ లేకుండా ప్రపంచంపైకి వచ్చిపడుతోంది. అదే... సముద్ర మట్టాల్లో అనూహ్య పెరుగుదల! ప్రపంచవ్యాప్తంగా అన్ని తీర ప్రాంతాల్లోనూ ఈ ప్రమాదకర పరిణామం చోటు చేసుకుంటోంది. ముఖ్యంగా మధ్యదరా ప్రాంతంలో సముద్ర మట్టాలు మరీ ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న వైనాన్ని తాజా అధ్యయనం ఒకటి వెలుగులోకి తెచ్చింది. ఇదిప్పుడు పర్యావరణ వేత్తలందరినీ కలవరపెడుతోంది!

20 ఏళ్లలో 8 సెంటీమీటర్లు!

సముద్ర మట్టాల్లో పెరుగుదల తాలూకు దుష్పరిణామాలు మధ్యదరా తీర ప్రాంతాల్లో కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా గత రెండు దశాబ్దాల్లో ఇటలీలోని అమ్లాఫీ తీరం వద్ద సముద్ర మట్టం స్పెయిన్‌లోని కోస్టా డెల్‌సోల్‌తో పోలిస్తే రెండింతలు పెరిగినట్టు పరిశోధకులు తేల్చారు. ''మధ్యదరా పరిధిలో కూడా ఇతర ప్రాంతాలతో పోలిస్తే అడ్రియాటిక్, ఎజియన్, లెవంటైన్ సముద్రాల తీర ప్రాంతాల్లో నీటి మట్టం 20 ఏళ్లలో ఏకంగా 8 సెంటీమీటర్లకు పైగా పెరిగింది. పైగా ఈ పెరుగుదల రేటు ఇటీవలి కాలంలో బాగా వేగం పుంజుకుంటుండటం మరింత ప్రమాదకర పరిణామం'' అని వారు వెల్లడించారు! తమ అధ్యయనంలో భాగంగా అలలు, ఆటుపోట్ల గణాంకాలతో పాటు మంచు కరిగే రేటుకు సంబంధించి ఉపగ్రహ ఛాయాచిత్రాలు తదితరాలను లోతుగా విశ్లేషించారు. 1989 తర్వాత నుంచీ మధ్యదరా సముద్ర మట్టం శరవేగంగా పెరుగుతోందని తేల్చారు. పరిశోధన ఫలితాలు అడ్వాన్సింగ్ అర్త్ స్పేస్ సైన్సెస్ జర్నల్ తాజాగా ప్రచురితమయ్యాయి.

అతి సున్నిత ప్రాంతం

నిజానికి మధ్యదరా ప్రాంతం వాతావరణ మార్పులపరంగా ప్రపంచంలోనే అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో ఒకటి. వరదలు, క్రమక్షయం వంటి వాటి దెబ్బకు ఇప్పటికే ఈ ప్రాంతంలోని ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఏకంగా 86 శాతం దాకా లుప్తమయ్యే ముప్పును ఎదుర్కొంటున్నాయి. 2022 మొదట్లో జరిగిన మరో అధ్యయనం కూడా ఇలాంటి ప్రమాదకరణ పరిణామాలనే కళ్లకు కట్టింది. మధ్యదరాతో పాటు ప్రపంచవ్యాప్తంగా కూడా సముద్రమట్టాలు గతంలో భావించిన దానికంటే చాలా వేగంగా పెరుగుతున్నాయన్న చేదు వాస్తవాన్ని వెల్లడించింది. గ్రీన్‌లాండ్ బేసిన్లో పరుచుకున్న అపారమైన మంచు నిల్వలు గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఊహాతీత వేగంతో కరిగిపోతుండటం ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. దానివల్ల అపారమైన పరిమాణంలో నీరు సముద్రాల్లోకి వచ్చి చేరుతోందని వివరించింది. అంతేకాదు, గ్రీన్‌లాండ్ మంచు ఇదే వేగంతో కరగడం కొనసాగితే 2100 కల్లా ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు ప్రస్తుతం ఊహిస్తున్న దానికంటే ఏకంగా ఆరు రెట్లు ఎక్కువగా పెరిగిపోతాయని కూడా హెచ్చరించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పెను ప్రమాదమే...!

సముద్ర మట్టాలు పెరిగితే సంభవించే దుష్పరిణామాలు అన్నీ ఇన్నీ కావు...

- తీర ప్రాంతాలు ముంపుకు గురవుతాయి
- చిన్న చిన్న ద్వీప దేశాలు ఆనవాళ్లు కూడా మిగలకుండా సముద్రంలో కలిసిపోతాయి
- షికాగో మొదలుకుని ముంబై దాకా ప్రపంచ వ్యాప్తంగా సముద్ర తీరాల్లో అలరారుతున్న అతి పెద్ద నగరాలు నీట మునుగుతాయి
- వందలాది కోట్ల మంది నిర్వాసితులవుతారు.
- ఇది ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద ఆర్థిక, సామాజిక సమస్యగా పరిణమిస్తుంది
- సముద్రపు తాకిడి నుంచి ప్రధాన భూభాగాలకు రక్షణ కవచంగా ఉండే చిత్తడి నేలలతో కూడిన మడ అడవులు అంతరిస్తాయి
- వాటిలో నివసించే పలు జీవ జాతులు అంతరించిపోయే ప్రమాదముంది
- నేల క్రమక్షయానికి లోనవుతుంది. సాగు భూమి పరిమాణమూ తగ్గుతుంది
- భారీ వర్షాలు, అతి భారీ తుఫాన్ల వంటివి పరిపాటిగా మారతాయి

వెనకబడ్డ తరగతుల జడ్జిలు...

హైకోర్టుల్లో 15 శాతమే

పార్లమెంటు సంఘానికి న్యాయ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో గత ఐదేళ్లలో హైకోర్టుల్లో నియమితులైన న్యాయమూర్తుల్లో వెనుకబడిన తరగతులకు చెందినవారు కేవలం 15 శాతం మందే ఉన్నారని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ వెల్లడించింది. బీజేపీ సీనియర్ నేత, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీని నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి ఈ విషయాన్ని నివేదించింది. జడ్జిలను నియమించే అధికారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని కొలీజియంకు కట్టబెట్టి 3 దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ హైకోర్టుల్లో బీసీ జడ్జిల సంఖ్య పెరగడం లేదని స్పష్టంచేసింది. జడ్జిలుగా ఎవరిని నియమించాలన్నది కొలీజియమే తేలుస్తుందని గుర్తుచేసింది. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను మాత్రమే ప్రభుత్వం ఆమోదించగలదని వెల్లడించింది. న్యాయస్థానాల్లో సామాజిక వైవిధ్యాన్ని ఇంకా సాధించలేకపోయామని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్‌అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల నియామకం విషయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలతోపాటు మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరచుగా కొలీజియంను కోరుతూనే ఉందని వివరించింది. 2018 నుంచి 2022 డిసెంబర్ 19 వరకూ హైకోర్టుల్లో 537 మందిని జడ్జిలుగా నియమించగా, వీరిలో 1.3 శాతం మంది ఎస్టీలు, 2.8 శాతం మంది ఎస్సీలు, 11 శాతం మంది ఓబీసీలు, 2.6 శాతం మైనారిటీలు ఉన్నారని తెలియజేసింది.

నోట్ల రద్దుపై నేడు సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: పెద్ద నోట్లను రద్దు చేస్తూ 2016లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించనుంది. జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. నోట్ల రద్దుకు దారి తీసిన పరిస్థితులపై సంబంధిత రికార్డులను సమర్పించాలని కేంద్రం, ఆర్‌బీఐలను ఆదేశించి డిసెంబర్ 7న తీర్పును రిజర్వు చేసింది. సోమవారం నాటి సుప్రీంకోర్టు షెడ్యూల్ ప్రకారం నోట్ల రద్దు అంశంపై రెండు వేర్వేరు తీర్పులుంటాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ బీవీ నాగరత్న ఇచ్చే ఈ తీర్పులు ఏకీభవిస్తాయా, భిన్నంగా ఉంటాయా అనేది స్పష్టంగా తెలియలేదు. ధర్మాసనంలో వీరితోపాటు జస్టిస్ ఏఎస్ బొపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ఉన్నారు.

సెల్ డ్రైవింగ్‌తో దేశవ్యాప్తంగా...

ఏడాదిలో 1,040 మంది మృతి

న్యూఢిల్లీ: సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ వాహనాలను నడిపిన కారణంగా జరిగిన ప్రమాదాల్లో 2021లో 1,040 మంది మృతి చెందారు. అదేవిధంగా, రెడ్‌లైట్ పడినా పట్టించుకోకుండా వాహనాలను ముందుకు పోనివ్వడంతో 555 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని, 222 మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్లపై గుంతల కారణంగా 3,625 ప్రమాదాలు జరగ్గా, 1,481 మంది మృత్యువాతపడ్డారు. 2021కి సంబంధించి కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ ఇటీవల వెల్లడించిన నివేదిక ఈ అంశాలను పేర్కొంది. 2021లో దేశవ్యాప్తంగా మొత్తం 4,12,432 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 1,53,972 మంది చనిపోగా, 3,84,448 మంది గాయపడినట్లు ఆ నివేదిక తెలిపింది.





దేవుడా ఏమిటీ పరీక్ష?

పాకిస్తాన్‌లో నిరుద్యోగ సమస్యకు నిదర్శనమీ చిత్రం. 1,667 పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం రాజధాని ఇస్లామాబాద్‌లోని ఓ స్టేడియంలో రాత పరీక్ష జరిగింది. ఏకంగా 32,000 మంది అభ్యర్థులు తరలివచ్చారు. అప్పల కారణంగా ఖర్చును భరించే పరిస్థితి లేక అధికారులు అందరినీ ఒకేచోటుకి పిలిపించి పరీక్ష నిర్వహించారు. పాకిస్తాన్ యువతలో 31 శాతం మంది నిరుద్యోగులే ఉన్నారు.

స్కూటీని ఢీకొట్టి, 4 కి.మీ. ఈడ్చుకెళ్లి...

మద్యం మత్తులో యువతిని బలిగొన్న ప్రబుద్ధులు.. ఢిల్లీలో దారుణం



న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం వేళ ఢిల్లీలో మనసుని కలిచివేసే ఘటన జరిగింది. న్యూ ఇయర్ సంబరాల్లో తప్ప తాగిన కొందరు ఆదివారం తెల్లవారుజామున ఇష్టారాజ్యంగా కారుని నడుపుతూ ఒక స్కూటీని ఢీకొట్టారు. స్కూటీపై వెళుతున్న 20 ఏళ్ల యువతి కారు కింద పడిపోతే, కనీసం ఏం జరిగిందో కూడా చూడకుండా ఆమెను ఏకంగా 4 కి.మీ. ఈడ్చుకెళ్లారు. దీంతో తీవ్రమైన గాయాలతో ఆ యువతి మధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. ఢిల్లీ పోలీసుల కథనం ప్రకారం ఢిల్లీలోని సుల్తాన్‌పురి ప్రాంతంలో కారు కింద ఒక యువతి శరీరాన్ని ఈడ్చుకెళుతున్న దృశ్యాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు కొందరు తెల్లవారుజామున 3.24 గంటలకి పోలీసు కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించారు. తిరిగి 4.11 గంటలకి కంఝావాల ప్రాంతంలో రోడ్డుపై ఒక మహిళ మృతదేహం పడి ఉందన్న సమాచారం వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం పికెట్స్ దగ్గరుండే పోలీసు కానిస్టేబుల్స్‌ని అప్రమత్తం చేసి కారు రిజిస్టర్డ్ నెంబర్ సాయంతో దానిని గుర్తించారు. అందులో ప్రయాణించిన అయిదుగురు పురుషుల్ని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో క్రెడిట్ కార్డు కలెక్షన్ ఏజెంట్, డ్రైవర్, రేషన్ షాపు యజమాని ఉన్నారు. కారు కింద పడి ప్రాణాలు కోల్పోయిన యువతిని అమన్ విహార్‌లో నివాసం ఉండే అంజలిగా గుర్తించారు. ఆమెకు తల్లి, నలుగురు చెల్లెల్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. పిల్లల్లో అంజలి పెద్దది. కొన్నేళ్ల క్రితమే తండ్రి మరణించారు. కారులో ఉన్న అయిదుగురు నిందితులు స్కూటీకి కారు ఢీకొన్న విషయం తెలుసే తప్ప, తమ కారు కిందే ఆ యువతి ఉందన్న విషయం తమకు తెలీదని చెప్పినట్టు ఢిల్లీ పోలీసు అధికారి హరేంద్ర కె. సింగ్ వెల్లడించారు. ఇది అత్యాచారం కేసు అని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం నిజం కాదని సింగ్ స్పష్టం చేశారు. అలా ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కారులో ప్రయాణిస్తున్న వారంతా డిసెంబర్ 31 రాత్రంతా మద్యం బాగా తాగి కారుని నడిపారని తమకు సమాచారం ఉందని ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ చెప్పారు. ఇంతకంటే దారుణమైన ఘటన మరొకటి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షిపణి ప్రయోగంతో కొత్త ఏడాదిలోకి..



సియోల్: ప్రపంచ దేశాలన్నీ బాణసంచా వెలుగులతో నూతన సంవత్సరంలోకి అడుగుపెడితే ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ మాత్రం క్షిపణి ప్రయోగంతో స్వాగతం పలికారు. శనివారం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం నిర్వహించింది. అది 400 కిలోమీటర్లు ప్రయాణించి, కొరియా ద్వీపకల్పం-జపాన్ మధ్య సముద్ర జలాల్లో పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రయోగంపై దక్షిణ కొరియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అణ్వస్త్రాలను కలిగి ఉండాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. అగ్రరాజ్యం అమెరికాను కిమ్ శత్రుదేశంగా పరిగణిస్తున్నారు. ఆయుధ శక్తితో అమెరికాకు బుద్ధి చెప్పడమే తమ లక్ష్యమని తరచుగా చెబుతున్నారు. ఉత్తర కొరియా సైన్యం గత ఏడాది 70కి పైగా క్షిపణులను విజయవంతంగా పరీక్షించింది. ఇందులో 3 షార్ట్-రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లను దక్షిణ కొరియా శనివారం గుర్తించింది. త్వరలో తొలి నిఘా ఉపగ్రహం(శాటిలైట్) ప్రయోగానికి కిమ్ సైన్యం సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం.

కోచ్‌పై లైంగిక వేధింపుల కేసు...

హరియాణా మంత్రి రాజీనామా

- క్యాంప్ ఆఫీస్‌కు పిలిచి, సంతృప్తి పరచాలంటూ బలవంతం చేశారు
- పైన చెయ్యేశారు, టీ షర్టు చింపేశారు
- ఫిర్యాదులో మహిళా కోచ్ తీవ్ర ఆరోపణలు, ఖండించిన మంత్రి

చండీగఢ్: భారత్ హాకీ జట్టు మాజీ కెప్టెన్, హరియాణా మంత్రి సందీప్ సింగ్ లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర క్రీడలు, ప్రింటింగ్, స్టేషనరీ శాఖల మంత్రి సందీప్ సింగ్ తనను నిర్బంధించి, లైంగికంగా వేధించారంటూ జూనియర్ అథ్లెటిక్స్ మహిళా కోచ్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ క్రీడల శాఖకు రాజీనామా చేసినట్లు మంత్రి సందీప్ సింగ్ తెలిపారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు సదరు కోచ్ చేసిన ఆరోపణలన్నీ, నిరాధారాలని మంత్రి కొట్టి పారేశారు. వీటిపై నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని మంత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి ఫిర్యాదుపై విచారణకు ఏడీజీపీ మమతా సింగ్ నేతృత్వంలో కమిటీని నియమించినట్లు హరియాణా డీజీపీ పీకే అగర్వాల్ తెలిపారు.

కలవాలనుంది..రమ్మని బలవంతపెట్టారు!

బాధిత కోచ్ ఘటనకు దారి తీసిన పరిస్థితులను గురువారం మీడియాకు వివరించారు. 'తనను జిమ్‌లో చూశానని, ఒకసారి కలవాలనుందని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మంత్రి నాతో కాంటాక్టులోకి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న జాతీయ క్రీడల సర్టిఫికెట్‌ను క్లియర్ చేసేందుకు రెసిడెన్స్ కమ్ క్యాంప్ కార్యాలయానికి రావాలని బలవంతం చేశారు. తనను సంతృప్తి పరిస్తే సంతోష పెడతానన్నారు. అక్కడికి వెళ్లాక నాపై చేయి వేశారు. టీ షర్ట్‌ను చించివేశారు. నేను రోదిస్తూ, కేకలు వేసినా అక్కడి సిబ్బంది చూస్తూ ఉండిపోయారే తప్ప, సాయం చేసేందుకు ముందుకు రాలేదు'అని ఆమె తెలిపారు. క్రీడల శాఖలో తనవంటి బాధిత మహిళా సిబ్బంది ఇంకా ఉన్నారని, భయంతోనే వారంతా బయటకు రావడం లేదని చెప్పారు. బాధితురాలు హోం శాఖ మంత్రి విజ్‌ను కలిశారు. తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. సందీప్‌పై ఐపీసీ 354, 354ఏ, 354బీ, 342, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు డీజీపీ చెప్పారు.



ముద్దు పేరు ఫ్లికర్ సింగ్..

భారత ఒలింపిక్ హాకీ జట్టు మాజీ కెప్టెన్, ఫ్లికర్ సింగ్‌గా పేరున్న సందీప్ సింగ్(36) కురుక్షేత్రలోని పెహోవా నుంచి బీజేపీ టికెట్‌పై మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో రైలులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు తుపాకీ బుల్లెట్ వెన్నెముకకు తగిలి పక్షవాతానికి గురయ్యారు. రెండున్నరేళ్ల విశ్రాంతి అనంతరం పూర్తి స్థాయిలో కోలుకున్నారు. మరింత నైపుణ్యం సాధించి హాకీ జట్టు విజయాలకు బాటలు వేశారు. ఈయన జీవిత కథ స్ఫూర్తితో సూర్మా పేరుతో సినిమా కూడా వచ్చింది. తన హాకీ స్టిక్‌తో బంతిని గంటకు 145 కిలోమీటర్ల వేగంతో అత్యంత నైపుణ్యంతో గోల్ పోస్ట్ వైపు తీసుకెళ్లే సందీప్ సింగ్‌ను ముద్దుగా ఫ్లికర్ సింగ్ అని పిలిచేవారు.

దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం

డిసెంబర్‌లో 8.3 శాతానికి చేరుకున్న నిరుద్యోగ రేటు



న్యూఢిల్లీ: భారత్‌లో నిరుద్యోగం రోజు రోజుకీ ఎక్కువైపోతోంది. డిసెంబర్‌లో అత్యధికంగా 8.3% శాతానికి నిరుద్యోగం రేటు ఎగబాకింది. గత 16 నెలల్లో అదే అత్యధికమని సెంటర్ ఫర్ మోనటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ఒక నివేదికలో తెలిపింది. పట్టణాల్లో నిరుద్యోగ రేటు 2022 నవంబర్‌లో 8.96 ఉంటే, డిసెంబర్ వచ్చేసరికి 10.09 శాతానికి పెరిగింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు నవంబర్‌లో 7.55% ఉంటే స్వల్పంగా తగ్గి డిసెంబర్ నాటికి 7.44శాతానికి చేరుకుంది. నిరుద్యోగం రేటు అత్యధికంగా హర్యానాలో 37.4% ఉంది. ఆ తర్వాత స్థానాల్లో రాజస్థాన్ (28.5%), ఢిల్లీ (20.8%) ఉన్నాయి.

కేంద్రానికి అతి పెద్ద సవాల్

పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం అదుపు చెయ్యడం, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం మోదీ సర్కార్ ముందున్న అతి పెద్ద సవాల్‌గా ఉంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పాదయాత్రలో కూడా అధిక ధరలు, నిరుద్యోగం సమస్యలపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇలాంటి సమయంలో నిరుద్యోగం రేటు మరోసారి పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశమే. అయితే కరోనా భయాలు తొలగిపోయిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల భాగస్వామ్యం బాగా పెరిగిందని, ఇది నిజంగానే మంచి విషయమని సీఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ వ్యాస్ చెప్పారు. గత ఏడాది కాలంలో ఉపాధి కార్మికుల భాగస్వామ్యం రేటు పెరిగి డిసెంబర్‌లో అత్యధికంగా 40.48% నమోదైందని ఆయన వివరించారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ၊ 2 ၊ జనవరి ၊ 2023

ముక్కోటికి సర్వం సిద్ధం

సోమవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం నేపథ్యంలో నగరంలోని పలు ఆలయాలను అందంగా అలంకరించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయని ఆయా ఆలయాల నిర్వాహకులు పేర్కొన్నారు. తీరొక్క పూలు, మిరుమిట్లు గొలిపే లైట్లు, అందమైన సెట్టింగ్‌లతో ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



నేడు పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ప్రాథమిక కీ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గత నెల జరిగిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల జవాబు పత్రాల ప్రాథమిక కీని సోమవారం విడుదల చేయనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. కీ లోని ప్రశ్నలు, జవాబుల్లో తప్పులు, ఒప్పులు ఇతర సందేహాలు ఉంటే నాలుగు రోజుల్లో మెయిల్ ద్వారా పంపించాలన్నారు. తర్వాత వారం రోజుల్లో ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

న్యూస్‌రీల్

భాగ్యలక్ష్మి అమ్మవారి సేవలో గవర్నర్



పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్

చార్మినార్: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ దంపతులు ఆదివారం చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ శశికళ వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆమె మొదటి పూజను చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి చేసినట్లు తెలిపారు.

మహంకాళి అమ్మవారికి మంత్రి తలసాని పూజలు



రాంగోపాల్‌పేట్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో సాగుతోందని, ఈ ఏడాది కూడా మరింత అభివృద్ధి సాధించాలని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆయన ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి, చైర్మన్ సురిటి కామేష్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈవో అన్నపూర్ణ, మాజీ కార్పొరేటర్లు అరుణ గౌడ్, కిరణ్మయి, శేషుకుమారి నాయకులు తలసాని సాయి కిరణ్‌యాదవ్, పవన్‌కుమార్‌గౌడ్, మహేష్ యాదవ్, ఆనంద్ పాటిల్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, చందు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్ వైద్యుల భర్తీకి నోటిఫికేషన్

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ నెల7వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈఎల్‌సీయూ పైలెట్ ప్రాజెక్ట్ కింద ఈ నియామక ప్రక్రియను చేపట్టారు. అనస్థీషియా, జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎం.డి చేసిన అభ్యర్థులు సీనియర్ పోస్టుకు అర్హులవుతారని ప్రాజెక్ట్ కోర్డినేటర్ పేర్కొన్నారు. రూ.80 వేల నెలవారీ వేతనంపై ముగ్గుర్ని నియమించాలని నిర్ణయించారు. కాగా సీనియర్ రెసిడెంట్‌లకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

దూరవిద్య పూర్వ విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని ప్రొఫెసర్.జి రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఇతర కోర్సులు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీలలో జరిగే ఓయూ గ్లోబల్ అలుమ్ని మీట్-2023కు దూరవిద్య పూర్వ విద్యార్థులు హాజరుకావచ్చని వెల్లడించారు.

స్పాట్ రిజిస్ట్రేషన్

గ్లోబల్ అలుమ్ని మీట్-2023కు హాజరు కావాలనుకునే పూర్వవిద్యార్థులు ఇంత వరకు రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే గ్లోబల్ అలుమ్ని మీట్ వద్ద పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

రేపు వీసీ రీసెర్చ్ అవార్డుల ప్రదానం..

ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 3న వైస్ చాన్స్‌లర్ రీసెర్చ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఓయూ క్యాంపస్‌లో పాటు అనుబంధ కాలేజీల పర్మనెంట్, కాంట్రాక్టు అధ్యాపకులు రేపు ఉదయం 10.30 గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో హాజరుకావాలని పేర్కొన్నారు.



బిర్లా టెంపుల్‌కు పోటెత్తిన భక్తులు

జలవిహార్‌లో రద్దీ....



కొత్త సందడి

న్యూ ఇయర్ మొదటి రోజు సండే కావడంతో నగరవాసులు బాగా ఎంజాయ్ చేశారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. బిర్లా, ఇస్కాన్, సాయి ఆలయాలతోపాటు ఎన్టీఆర్ గార్డెన్స్, లుంబినీ పార్కు, శిల్పారామం, లుంబినీ పార్కు తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. ముఖ్యంగా ఆలయాల వద్ద భారీ క్యూలు కన్పించాయి.



శిల్పారామం వద్ద...

స్వాగతం..సుస్వాగతం

- కొత్త సంవత్సరానికి గ్రాండ్ వెల్‌కమ్
- భక్తులతో ఆలయాల్లో రద్దీ
- రహదారులపై ట్రాఫిక్
- భారీగా మద్యం, చికెన్, బిర్యానీ వినియోగం
- బంజారాహిల్స్‌లో విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం



జలవిహార్‌లో యువత జలకాలాట..

సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరానికి భాగ్యనగరం సాదరస్వాగతం పలికింది. తెల్లవారు జామునే ఇళ్ల ముందు వాకిళ్లను అందమైన రంగవల్లులతో అలంకరించి నగరవాసులు నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఉదయాన్నే ఆలయాలకు తరలి వెళ్లారు. చిలుకూరు బాలాజీ టెంపుల్‌తో పాటు నగరంలోని అనేక చిన్న, పెద్ద గుడులు, ఆలయాల వద్ద భక్తజన సందోహం బారులు తీరింది. పలు చోట్ల దర్శనం కోసం భక్తులు గంటల తరబడి పడిగాపులు కాశారు. మరోవైపు ఆదివారం అయినప్పటికీ వివిధ అవసరాల కోసం ఇళ్ల నుంచి బయటకు వెళ్లిన నగరవాసులతో రహదారులపై రద్దీ నెలకొంది. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అర్ధ రాత్రి నుంచే ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు. చికెన్, మటన్, చేపలకు పెద్దఎత్తున గిరాకీ ఏర్పడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు భారీ సంఖ్యలో బిర్యానీల అమ్మకాలు జరిగినట్లు స్విగ్గీ వెల్లడించింది. మద్యం అమ్మకాల్లోనూ గ్రేటర్ టాప్‌లో నిలిచింది. మరోవైపు బంజారాహిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.

మద్యం విక్రయాల్లో టాప్...

నూతన సంవత్సరం సందర్భంగా గ్రేటర్‌లో మద్యం ఏరులైపారింది. మందుబాబులు పెద్ద ఎత్తున మద్యం సేవించారు. ఎక్సైజ్‌శాఖ లెక్కల ప్రకారం గత ఆరు రోజులుగా రూ.473.1 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో రంగారెడ్డి మొదటి స్థానంలో ఉంది. సుమారు రూ.278.93 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు ఈ ఒక్క జిల్లాలోనే జరిగాయి.హైదరాబాద్‌లో రూ.134.33, కోట్లు, మేడ్చెల్ జిల్లాలో రూ.59.84 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మరోవైపు డిసెంబర్ నెల మొత్తంగా రంగారెడ్డి లో రూ.847.29 కోట్లు, హైదరాబాద్ రూ.382.28 కోట్లు. మేడ్చెల్ రూ.174.82 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

డిసెంబర్ 26 నుంచి 31 వరకు మద్యం అమ్మకాలు రూ.కోట్లలో...

తేదీ	రంగారెడ్డి	హైదరాబాద్	మేడ్చల్
26	42.83	18.33	8.83
27	41.06	16.54	7.76
28	43.05	17.13	6.77
29	45.45	21.64	9.18
30	63.33	33.24	15.88
31	43.21	27.44	11.42
	278.93	134.33	59.84

భారీగా పెరిగిన చికెన్ వినియోగం

న్యూ ఇయర్ వేడుకల్లో ఈసారి చికెన్ వినియోగం బాగా పెరిగింది. గ్రేటర్ హైదరాబాద్‌లో గత శని, ఆదివారాల్లో లక్షల కిలోల చికెన్ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ వర్గాల ద్వారా తెలిసింది. ధర కూడా కిలోకు దాదాపు 50 వరకు పెంచేశారు. ఇళ్లల్లోనే కాకుండా రెస్టారెంట్లలోనూ చికెన్, మటన్ విక్రయాలు భారీగా పెరిగాయి.



ప్రయాణికులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు

ప్రయాణికుల సంక్షేమానికి పెద్దపీట

- ఆర్టీసీకి సిబ్బంది, ప్రయాణికులు రెండు కళ్లలాంటి వారు..
- 2022లో ప్రయాణికుల ప్రోత్సాహం మరువలేనిది
- టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీఎస్‌ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రయాణికులు, సిబ్బందితో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ప్రయాణికులతో ముచ్చటించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీలో పని చేస్తున్నందుకు చాలా గర్వంగా ఉందని, గత సంవత్సరం ప్రయాణికులు బాగా ఆదరించారని చెప్పారు. ఒక్క రాఖీ పౌర్ణమి నాడే దాదాపుగా 40 లక్షల మంది ప్రయాణించారని, ఆ ఒక్క రోజే రికార్డ్ స్థాయిలో రూ. 20 కోట్ల రాబడి వచ్చిందని గుర్తు చేశారు.గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రయాణికుల ఆదరాభిమానాలు ఉంటాయని ఆశా భావం వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది ఆర్టీసీకి రెండు కళ్లు వంటివారన్నారు. ప్రయాణికుల సంక్షేమానికి ఈ ఏడాది పెద్ద పీట వేస్తామని తెలిపారు. అందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. లేఖలు, ట్విట్టర్ ద్వారా తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రజారథాన్ని సజ్జనార్ ప్రారంభించారు.

ప్రయాణికులకు సన్మానం

ఎన్నో ఏళ్లుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఎండీ సజ్జనార్ సన్మానించారు. సంగీత, కిష్టయ్య, బి.జయలక్ష్మి, జయ ప్రకాష్, సుధారాణి, స్వప్న, లక్ష్మణ్, అశోక్, నర్సింహులు, నరసింహా రెడ్డి, సుధాకర్, సిద్దా రెడ్డి, ప్రమీల, జి. రమాదేవి, సుధామని, కంభం రాములు, జె. శ్రీనివాస్, సుహాసిని, ఉమాపతి, సునీత, సి హెచ్ విజయ్, ఎస్ ఎం. హుస్సేన్, ఎండీ జియాస్, ధనలక్ష్మి, సరిత, సంగీతలను శాలువాలతో సత్కరించారు. 8 స్మార్ట్ ఫోన్లను రికవరీ చేసిన హెడ్ కానిస్టేబుల్ బాబురావును సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీవోవో డా.రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం, హైదరాబాద్, రంగారెడ్డి ఆర్‌ఎంలు రాజేంద్రప్రసాద్, శ్రీధర్, తదితర ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తాగేశారు... తోలేశారు!!

- సిటీలో 1413 డ్రంక్ డ్రైవింగ్ కేసులు
- ఇతర ఉల్లంఘనలపై 10,337 నమోదు



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగం ఎన్ని సూచనలు చేసినా... ఎంతగా హెచ్చరించినా... మందుబాబులు మాత్రం మారలేదు. డిసెంబర్ 31 నేపథ్యంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు మద్యం తాగి వాహనాలు నడిపేశారు. ఈ నేపథ్యంలో సిటీ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 22,543 వాహనాలను తనిఖీ చేస్తే... 1413 మంది (6.26 శాతం) డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ చిక్కారు. వీరిలో ద్విచక్ర వాహనచోదకులు 1240 మంది, కార్లు వంటి తేలిక వాహనాల డ్రైవర్లు 132 మంది, ఆటోడ్రైవర్లు 34 మంది ఉన్నారు. 'న్యూ ఇయర్ డే'ను జీరో యాక్సిడెంట్ నైట్‌గా చేయడానికి సిటీ కాప్స్ పటిష్ట ఏర్పాట్లు చేశారు. అయితే తనిఖీలు ముగిసిన తర్వాత బంజారాహిల్స్ రోడ్ నెం.2లో ఘోర ప్రమాదం జరిగింది. మొత్తం 25 ట్రాఫిక్ పోలీసుస్టేషన్లలోని 75 చోట్ల శ్వాసపరీక్ష యంత్రాలతో ఈ తనిఖీలు నిర్వహించారు. శనివారం రాత్రి 10 నుంచి ఆదివారం తెల్లవారుజాము 5 గంటల వరకు చెకింగ్స్ నడిచాయి. డ్రంక్ డ్రైవింగ్ చేసిన వాహనచోదకుల వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వయస్సుల వారీగా పట్టుబడిన మందుబాబులు

18 ఏళ్ల లోపు	22
19-30	789
31-40	380
41-50	154
51-60	57
61-70	11
మొత్తం	1413

వీరికి కుటుంబం సభ్యుడు లేదా సంరక్షకుడి సమక్షంలో సోమ-మంగళ-బుధవారాల్లో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. ఆపై న్యాయస్థానంలో హా జరుపరచనున్నారు. నిబంధనల ప్రకారం 100 ఎంఎల్ రక్తంలో 35 ఎంజీ ఆల్కహాల్ ఉంటే డ్రంక్ డ్రై వింగ్ ఉల్లంఘన కిందికి వస్తుంది. దీన్నే బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ (బీఏసీ) అంటారు. అయితే 'డిసెంబర్ 31' నేపథ్యంలో చిక్కిన 1413 మందిలో 157 మందికి బీఏసీ కౌంట్ 36-50 మధ్య, 496 మందికి 51-100 మధ్య, 612 మందికి 101-200 మధ్య, 125 మందికి 201-300 మధ్య, 16 మందికి 301-400 మధ్య, ఏడుగురిని 401 కంటే ఎక్కువ బీఏసీ కౌంట్స్ వచ్చాయి. ఈసారి ట్రాఫిక్ విభాగం అధికారులు కేవలం డ్రంక్ డ్రైవింగ్ పైనే కాకుండా ఇతర ఉల్లంఘనలనూ పరిగణలోకి తీసుకున్నారు. సాధారణ ప్రజలు, వాహనచోదకులపై ఇబ్బంది కలిగించే వాటిపై దృష్టి పెట్టారు. దీంతో హెల్మెట్ ధరించని 6242, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన 609, ట్రిపుల్ రైడింగ్ చేసిన 513, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన 2381, అక్రమ పార్కింగ్ చేసిన 479, ఇతర ఉల్లంఘనలపై 113 వాహనచోదకులపై కేసులు నమోదయ్యాయి.

సైబరాబాద్‌లో 1,314 డీడీ కేసులు

సైబరాబాద్ పరిధిలో 1314 మంది డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కారు. వీరిలో ముగ్గురు మహిళలు సైతం ఉన్నారు. వీరందరి డ్రైవింగ్ లైసెన్స్‌లు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. పట్టుబడిన మందుబాబులలో యువతే ఎక్కువగా ఉంది. 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉన్న వాళ్లు 765 మంది ఉన్నారు.

హ్యాపీ న్యూఇయర్ సర్..

నగర కమిషనరేట్లకు చెందిన ఉన్నతాధికారులు ముగ్గురు న్యూఇయర్ సందర్భంగా ఆదివారం హోం మంత్రి మహమూద్ అలీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు సీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ చౌహాన్‌లు వేర్వేరుగా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.





చివరి రోజు రద్దీ



ప్రత్యేకాకర్షణగా అతిపెద్ద బుక్

ముగిసిన బుక్‌ఫెయిర్

నగరం వేదికగా డిసెంబర్ 22వ తేదీ నుంచి నిరంతరాయంగా 11 రోజుల పాటు కొనసాగిన 35వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఈ పుస్తక ప్రదర్శనను దాదాపు పది లక్షల మందికి పైగా సందర్శించారని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు కావడంతో ఆదివారం పుస్తక ప్రదర్శన పుస్తక ప్రియులతో కిక్కిరిసిపోయింది. సాహిత్య ప్రేమికులే కాకుండా సోషల్ మీడియా వేదికగా ప్రతి నిత్యం పలకరించుకునే స్నేహితులు భౌతికంగా కలుసుకోవడానికి కూడా ఈ ప్రదర్శన ఒక వేదికగా నిలిచింది. మూడు వందలకు పైగా స్టాల్స్‌తో వివిధ భాషలకు చెందిన లక్షల పుస్తకాలు ఇక్కడ కొలువుదీరాయి. గతంతో పోల్చితే ఈ ప్రదర్శనలో పుస్తకాలు కొనే వారి నుంచి అనూహ్య స్పందన లభించగా మరోవైపు ఈ ప్రదర్శనలో అధిక సంఖ్యలో యువ రచయితల కొత్త పుస్తకాలు దర్శనమిచ్చాయి. - సాక్షి, సిటీబ్యూరో

నెత్తురోడిన రహదారులు

- ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధ దంపతుల దుర్మరణం
- మల్లాపూర్‌లో కారు ఢీకొని మరో వ్యక్తి మృతి




తులసీదాస్, రాజమణి మృతదేహాలు



ఘటనాస్థలంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

కంటోన్మెంట్: నగరంలో ఉంటున్న కుమారుడిని చూసేందుకు నిర్మల్ నుంచి వచ్చిన వృద్ధ దంపతులు ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన సంఘటన బోయిన్‌పల్లి చౌరాస్తాలో ఆదివారం చోటు చేసుకుంది.. నిర్మల్ నగరానికి చెందిన తులసీదాస్ (65), రాజమణి (62) దంపతులు నగరంలోని గచ్చిబౌలిలో ఉంటున్న తమ కుమారుడు రామరాజు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం నగరానికి వచ్చారు. మధ్యాహ్నం బోయిన్‌పల్లిలో బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బాలానగర్ నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. పోలీసులు బస్సు డ్రైవర్ మార్గం నరహరి అదుపులోకి తీసుకున్నారు. మృతుల కుమారుడు రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు

బోయిన్‌పల్లి చౌరస్తాలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆగ్రహించిన స్థానికులు పోలీసులు, అధికారులకు కనువిప్పు కలగాలంటూ ఓ పక్క అంబులెన్స్‌లో మృతదేహాలు, ఆర్టీసీ బస్సును చూపిస్తూ ఓ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పాదచారులు రోడ్డు దాటేందుకు తగిన ఏర్పాట్లు లేకపోవడం కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కుషాయిగూడ: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కుషాయిగూడ పీఎస్ పరిధిలోని మల్లాపూర్ అశోక్‌నగర్ కాలనీ మర్రిగూడ హెచ్‌పీ పెట్రోల్ పంప్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన రాజు మహతో నగరానికి వలసవచ్చి మల్లాపూర్‌లోని న్యూ నర్సింహనగర్‌లో కుటుంబంతో సహా నివాసం ఉంటూ ఉల్లిపాయల వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం తోపుడుబండిపై ఉల్లిపాయలు విక్రయిస్తుండగా మర్రిగూడ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి బావ నాగేందర్‌కుమార్ ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని రాష్ట్రాలకు ఆదర్శం జీవన్‌దాన్



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఆర్గాన్ దోనర్స్ సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

వనస్థలిపురం: అన్ని రాష్ట్రాలకు తెలంగాణ జీవన్‌దాన్ ఆదర్శంగా నిలుస్తుందని, ఇతర రాష్ట్రాలు దీనిని అనుసరిస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఆదివారం వనస్థలిపురం చింతలకుంటలోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవయవదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవయవదానంపై ప్రజలకు అపోహలు ఉన్నాయన్నారు. అవయవదానం గొప్ప విషయమని, అవయవదానం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడి తాము చనిపోయినా జీవించే అవకాశం ఉంటుందన్నారు. సకాలంలో ఆర్గాన్స్ దొరక్క పలువురు చిన్న వయస్సులోనే మృత్యువాతపడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న తమ బంధువులకు కిడ్నీలు, గుండె కావాలంటూ నిత్యం తనకు ఫోన్‌లు వస్తాయని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా ఇంకా కృత్రిమ గుండె తయారు చేయలేమన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలతో 8 మంది ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. బ్రెయిన్ డెడ్ అయినవారి కుటుంబాలను చైతన్యం చేస్తే మరికొందరికి ప్రాణాలు పోయవచ్చన్నారు. గాంధీ ఆసుపత్రిలో రూ. 35 కోట్లతో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే ధనికులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని చాలామంది అభిప్రాయమని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గాంధీ, నిమ్స్, ఉస్మానియా ఆసుపత్రుల్లో పైసా ఖర్చులేకుండా అవయవ మార్పిడి చేస్తున్నామన్నారు. నూతన సంవత్సరం వేళ అవయవదానంపై ఇంతమంచి కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభినందనీయులని, ఆయనను ఆదర్శంగా తీసుకుని మిగతా ఎమ్మెల్యేలు ఆర్గాన్ డొనేషన్స్ పెంపునకు కృషి చేయాలని సూచించారు. అవయవాలు కావాలనుకునే వారి వెయిటింగ్ లిస్ట్ 3 వేలకు పైగానే ఉందన్నారు. అవయవదానానికి ముందుకొచ్చిన 250 మందికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అవయవ దానంపై తన తండ్రి జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి చెందాయని, పలు ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయన్నారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో మోకీలు ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. అవయవదానానికి పేర్లు నమోదు చేసుకున్న 250 మందికి మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, ట్రస్ట్ చైర్ పర్సన్ కమలా సుధీర్ రెడ్డి, జీవన్‌దాన్ ఇన్‌చార్జి డా.స్వర్ణలత, దేవిరెడ్డి నర్సింహారెడ్డి, చల్లా రామ్‌కల్యాణ్, రమాకాంత్, కార్పొరేటర్ సుజాత, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మేడి రాజేశ్వర్‌రావు



ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నేతి రాజేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాత్రి నల్లగొండలోని సుశృత గ్రామీణ వైద్యుల సంఘం ఆవరణలో అసోసియేషన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేతి రాజేశ్వర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన గతంలో ఒక్కసారి రాష్ట్ర అధ్యక్షునిగా ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆదివారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... త్వరలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని రూపొందిస్తానని తెలిపారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అన్ని జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులకు కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిట్‌నెస్ కాపాడుకోవాలి.. క్రైం రేటు తగ్గించాలి



కేబీఆర్ పార్కు వద్ద నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న సీపీ సీవీ ఆనంద్

బంజారాహిల్స్: నూతన సంవత్సరంలో పోలీసు అధికారులు తమ ఫిట్‌నెస్ దృష్టి పెట్టడంతో పాటు క్రైం రేటు తగ్గించేందుకు కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం రాత్రి బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 'ఫిట్‌కాప్' యాప్‌ను హోంగార్డు ఆఫీసర్ నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని అందులో ఆరోగ్య వివరాలు పొందుపర్చాలని ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఉత్సాహంగా పని చేయాలని సూచించారు. నగర ట్రాఫిక్‌లో ఎన్నో మార్పులు తీసుకురాబోతున్నామని డ్రోన్ కెమెరాల వ్యవస్థను ఇందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్‌లో బందోబస్తులు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు కూడా డ్రోన్‌ల సహాయంతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏసీపీలు సుదర్శన్, పీవీ గణేష్, ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేరాలు అదుపులో ఉన్నాయి

రాంగోపాల్‌పేట్: నగరంలో నేరాలు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయని, డ్రగ్స్‌పై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శనివారం రాత్రి ఆయన సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలో ఉత్తర మండలం పోలీసులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం పోలీసు అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి స్వయంగా కేక్ తినిపించారు. నూతన సంవత్సరంలో అందరి ఆలోచనలు నెరవేరాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు . నేరాలు పూర్తిగా అదుపులో ఉన్నాయని, ట్రాఫిక్ పోలీసులు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఉత్తర మండలంలో కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ పోలీసులు చాకచక్యంతో, ముందస్తు ప్రణాళికతో సాఫీగా పరిష్కరించే చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉత్తర మండలం డీసీపీ చందనా దీప్తి, ట్రాఫిక్ డీసీపీ ప్రకాష్‌రెడ్డి, సెంట్రల్‌జోన్ డీసీపీ రాజేష్, అదపు డీసీపీ యోగేష్ గౌతం, ఏసీపీలు రమేష్, సుధీర్, పృథ్వీరాజ్, శ్రీధర్, నర్సయ్య, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పక్కా హైదరాబాద్ కార్నివాల్



ఖైరతాబాద్: నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వేదికగా డిసెంబర్ 24న ప్రారంభమైన పక్కా హైదరాబాద్ కార్నివాల్ నేటితో ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగర వాసులను అలరించేందుకు వారం రోజుల పాటు ఎగ్జిబిషన్‌తో పాటు పిల్లలను ఆకట్టుకునేందుకు గేమ్స్, కార్నివాల్, మ్యూజిక్, డ్యాన్స్‌లతో పాటు చోటాబీం బృందంతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆదివారం నగరం నలు మూలల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు.

బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి ఏఐ–952 విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దుస్తుల్లోని అడుగు భాగంలో పేస్టు రూపంలో ఉన్న 283 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ. 16 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ పిల్లలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



బాలికలతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ముషీరాబాద్: రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల సంక్షేమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పిల్లల చదువుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు. ఆదివారం ఆయన రెయిన్‌బో అనాథశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... అనాథ పిల్లల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2015 జూన్ 23న అనాథ పిల్లల చదువు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ ఉప సంఘంతో జరిగిన సమావేశంలో పేర్కొన్నారన్నారు. అనాథ పిల్లలు కుల ధృవీకరణ పత్రం విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రెవెన్యూ అధికారులు కుల ధృవీకరణ పత్రం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. అనాథ పిల్లలకు స్మార్ట్‌కార్డులు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జెల రాజశేఖర్, గంగి కృష్ణ నాయకులు, శామ్యూల్, పెంటయ్య, ఎల్లయ్య, సదా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి



డేవిడ్ మృతదేహం

నిజాంపేట్: నూతన సంవత్సర వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది..చెరువు గట్టుపై కూర్చున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తులో చెరువు పడి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు చెందిన డేవిడ్(25) శనివారం రాత్రి స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం అతను సమీపంలోని తురక చెరువు గట్టుపై స్నేహితులతో కలిసి కూర్చున్నాడు. నిద్రమత్తులో ప్రమాదవశాత్తు డేవిడ్ చెరువులో పడ్డాడు. దీనిని గుర్తించిన అతని స్నేహితులు చెరువులో అతడి కోసం గాలించారు. అయితే డేవిడ్‌కు ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా ఆలయానికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయానికి ఐఎస్‌ఓ 2001:2015 సర్టిఫికెట్ దక్కింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పూజల అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గుండ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పూర నర్సింహగుప్త తదితరులు బాబా సమక్షంలో సర్టిఫికెట్ అందుకున్నారు. సాయి ట్రస్ట్ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సేవా కార్యక్రమాలకు గుర్తుగా ఈ గుర్తింపు వచ్చినట్లు చైర్మన్ తెలిపారు. బాబాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వీబూది ప్రసాదం అందజేసేందుకు అవసరమైన ప్యాకెట్ మిషన్‌ను జి.నాగిరెడ్డి, అన్నపూర్ణ దంపతులు ఆలయానికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ వీవీ రవికుమార్, ఈసీ మెంబర్లు కోడి రాజశేఖర్, బి.కిరణ్‌కుమార్, కృష్ణవేణి, సాయికృష్ణ షిండే, కార్యవర్గ సభ్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

థిన్నర్‌తోనే తిప్పలు!

- గాంధీనగర్ పేలుడుకు అదే కారణం
- నివేదిక ఇచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు
- సిటీలో తరచూ ఇలాంటి ఉదంతాలు
- కనీస జాగ్రత్తలే మేలంటున్న నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: గాంధీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉన్న డంపింగ్ యార్డులో గత నెల 15న జరిగిన పేలుడుపై స్పష్టత వచ్చింది. ఈ ఉదంతంలో చెత్త ఏరుకునే చంద్రన్న, ఆయన కుమారుడు సురేష్ తీవ్రంగా గాయపడి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. థిన్నర్ డబ్బా కారణంగానే ఈ పేలుడు చోటు చేసుకుందని ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. ఈ మేరకు పోలీసులకు నివేదిక అందించారు. నగరంలో తరచు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కొన్ని కనీస జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రంగుల్లో వాడే థిన్నర్లలో వలటైల్ ఆర్గానిక్ సాల్వెంట్స్‌గా పిలిచే ఎసిటోన్ లేదా ఈ రసాయనం కలిపిన టాల్విన్, ఈథర్ వంటివి అధిక మోతాదులో ఉంటాయి. థిన్నర్ లేదా పెయింట్ డబ్బా సీల్ తెరిచిన తర్వాత సగం వినియోగించి మిగిలింది అలానే ఉంచి మూత పెట్టడం సాధారణం. ఇలా చేయడం వల్ల ఆ డబ్బాల్లో ఉండే రంగుల్లోని ఆవిరి స్వభావం కలిగిన రసాయనాలు ఆక్సిజన్‌తో కలుస్తూ వ్యాకోచించడానికి ప్రయత్నిస్తాయి. గట్టిగా మూత పెట్టి ఉండటంతో అది సాధ్యం కాక డబ్బా లోపలి భాగంలో వాక్యూమ్ ఏర్పడుతుంది. ఈ స్థితిలో ఉన్న డబ్బా మూతలు సైతం బిగుసుకుపోతాయి. అలాంటి వాటిని తెరవడానికి రాపిడి కలిగించినా, గట్టిగా కొట్టినా చిన్నస్థాయి పేలుడు చోటు చేసుకుంటుంది. గతంలో పెయింట్స్‌ను ఇనప డబ్బాల్లో విక్రయించే వాళ్లు. అయితే ఇటీవల కాలంలో దాదాపు అన్ని రకాల రంగుల్ని ప్లాస్టిక్ డబ్బాల్లోనే ఉంచి విక్రయిస్తున్నారు. ఇనుప వాటి కంటే ఇవి అత్యంత ప్రమాదకరమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సగం ఖాళీ అయిన ఇనుప డబ్బాలో ఉన్న రంగుకు ఆక్సిజన్ అందుబాటులోకి రాక రసాయన క్రియ జరగదు. కేవలం గడ్డ కట్టడం మాత్రమే జరుగుతుంది. అదే ప్లాస్టిక్ డబ్బాలో ఉంటే ఉన్న చిన్నపాటి సందుల నుంచి ఆక్సిజన్ వెళ్తుంది. దీంతో పాటు ఆర్గానిక్ సాల్వెంట్స్ కొన్ని రోజులకు ప్లాస్టిక్‌తో కలిసి పాలిమరైజేషన్ జరుగుతుంది. ఈ కారణంగా ఏర్పడే వేపరైజర్ల కారణంగానూ దాన్ని తెరవడానికి ప్రయత్నించినప్పుడు పేలుడు జరిగే ప్రమాదం పొంచి ఉంటుంది. ఇలాంటి డబ్బాలు ఇంట్లో ఉన్నప్పటికీ ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్గానిక్ సాల్వెంట్స్ కలిగి ఉండే పెయింట్స్‌ను డబ్బా సీల్ తీసిన తర్వాత పూర్తిగా వాడేయడం ఉత్తమం. అలా కాకుండా కొంత మిగిలితే బయట పారబోయాలి. తర్వాత వినియోగిద్దామనే ఉద్దేశంతో దాచిపెట్టినా, కొన్నాళ్లకు పారేసినా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి డబ్బాలు తెరవడానికి ప్రయత్నించిన ప్రతిసారీ పేలిపోవాలని లేదు. పేలుడుకు చోటు చేసుకోవడానికి అవసరమైన స్థాయిలో సాల్వెంట్స్ రేష్యో తయారైతేనే అలా జరుగుతుంది. ఇలా సగం ఖాళీ అయిన డబ్బాలు ఇంట్లో ఉండి, వాటిని తెరవాల్సిన అవసరం వస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటి వాటిని వెంటనే తెరవకుండా కనీసం గంట సేపు చల్లని నీటిలో ఉంచాలి. ఫ్రిజ్ వాటర్‌ను బక్కెట్‌లో పోసి అందులో ఈ డబ్బాలను వేయాలి. ఇలా చేస్తే అందులో ఉన్న ఆవిరి చల్లబడి మళ్లీ పెయింట్‌గా మారుతుంది. అప్పుడు రాపిడి కలిగిస్తూ తెరిచినా ఎలాంటి ప్రమాదం ఉండదని వివరిస్తున్నారు.

క్లుప్తంగా

గోదాదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీ గోదా రంగనాయక స్వామికి తిరుప్పావై అనంతరం విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. విశేష అలంకరణలో శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా రూ.11, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 37, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 40, పందిరిబీర 40, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 21, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

దరఖాస్తుల స్వీకరణ

సనత్‌నగర్: బేగంపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ (2 పోస్టులు), ఎకనామిక్స్ (3), కామర్స్ (3), కెమిస్ట్రీ (3), మ్యాథ్స్ (3), బోటనీ (2), మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (1)లకు గాను బోధనా సిబ్బందిని తీసుకోవడం జరుగుతుందన్నారు. జనవరి 2 సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 3న ఉదయం 10 గంటలకు బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

డైరీ ఆవిష్కరణ

సికింద్రాబాద్: నగరానికి చెందిన ప్రముఖ విబ్సన్ ఫార్మా వార్షిక డైరీని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో అధునాతన మార్పులు రోగులకు మేలు చేకూర్చేలా ఉండాలని ఆకాంక్షించారు. విబ్సన్ ఫార్మా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నేత సుంకు రామ్‌చందర్, కార్పొరేటర్లు హేమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పూర్వ విద్యార్థులకు హాస్టల్ భోజనాలు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్లోబల్ అలుమ్ని మీట్-2023లో భాగంగా ఓయూ పూర్వవిద్యార్థులకు భోజన సదుపాయాన్ని క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్లలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే కార్యక్రమంలో 4న మధ్యాహ్నం భోజనాన్ని ఆయా హాస్టళ్ల మెస్సులలో ప్రస్తుత విద్యార్థులతో కలిసి తినేలా ఏర్పాటు చేశామన్నారు. హాస్టళ్లలో జరిగిన నాటి మధుర జ్ఞాపకాలను పూర్వవిద్యార్థులు నెమరవేసుకొని పంచుకునేలా పాతబడి మూసివేసిన ఏ, బీ హాస్టల్ భవనాలను తెరువనున్నారు.

భైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

సనత్‌నగర్: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి భైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నెమలి ఆనంద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్లపై విమర్శలు చేయడం ఇటీవల కాలంలో ఫ్యాషన్ అయిపోయిందన్నారు. హరిహర పుత్రుడైన అయ్యప్పను దూషించిన వారు ఎవరైనా కఠినంగా శిక్షించాలన్నారు. కులాలు, మతాలు వేరయినా కలిసిమెలిసి జీవించే భారతీయ సంస్కృతిని చెడగొట్టే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భైరీ నరేష్‌ను కఠినంగా శిక్షించే వరకు ఆందోళనలు ఆపేది లేదని హెచ్చరించారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం

రసూల్‌పురా: కోమటి నాగయ్య గల్లీ, రావీ చెట్టు గల్లీ, ట్రాన్స్‌ఫార్మర్ గల్లీల్లో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైను పనులను బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసూల్‌పురాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని మాటిచ్చిన కేసీఆర్ మరచిపోయాడని కాని బీజేపీ మాట ఇవ్వకుండానే పలు అభివృద్ధి పనులు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మాదారపు అశోక్, జై యాదవ్, లక్ష్మణ్, ప్రశాంత్, ప్రభు, స్థానికులు పాల్గొన్నారు.







జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం, శ్రీనగర్ కాలనీలోని శ్రీవారి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న సిబ్బంది

'వైకుంఠ' దర్శనానికి వేళాయే..

- ముక్కోటి ఏకాదశికి పూర్తయిన ఏర్పాట్లు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయాలు
- నేటి తెల్లవారుజాము 3 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలు

బంజారాహిల్స్: వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పర్వదినాన్ని సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో శ్రీవారి ఆలయాలు ఉత్తర ద్వార దర్శనం కోసం ముస్తాబయ్యాయి. రంగురంగుల పూల మాలలు, విద్యుత్ దీపాలతో ఆలయాలన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఆలయ నిర్వాహకులు పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు.

- సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనానికి అనుమతులిస్తామని బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు అద్దంకి శశికాంతాచార్యులు వెల్లడించారు. రాత్రి 9 గంటలదాకా వైకుంఠ ద్వార దర్శనం కొనసాగుతుందన్నారు.
- శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారుజామున 2.30 గంటలకు సుప్రభాత సేవ, తదుపరి శ్రీ స్వామివారి గరుడ సేవ, అనంతరం వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయని ఆలయ ఈవో ఎస్.లావణ్య తెలిపారు. అర్చన, నివేదన, తిరుప్పావై, ప్రబంధ సేవా కాలం, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగాలు ఉంటాయని తెలిపారు.
- జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు తిరుప్పావై, సహస్రనామార్చన, తోమాల సేవ అనంతరం ఉదయం 3 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుంది.
- ఫిలింనగర్ దైవసన్నిధానం, బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని జగన్నాథ ఆలయంలో ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఉత్తర ద్వార దర్శనానికి రానున్నారు. దీంతో ఆయా ఆలయాల వద్ద ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పలు ఏర్పాట్లు చేస్తున్నారు.
- వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ రోడ్లన్నీ బిజీగా మారనున్నాయని నిత్యం ఈ మార్గాల గుండా వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్తే ఇబ్బందులు లేకుండా ఉంటుందని లేదంటే ట్రాఫిక్‌లో అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



మంత్రి చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకుంటున్న రాజ్‌కుమార్‌జాదవ్

పంజగుట్ట: గిరిజన లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌కు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (గజిటెడ్ అధికారి) నియామక పత్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతులమీదుగా అందుకున్నారు. ఆదివారం రాజ్‌కుమార్ జాదవ్ విలేకరులతో మాట్లాడుతూ... వైద్యసేవలు కార్పొరేట్ చేతుల్లోకి చిక్కి వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిన రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు సేవ అందించడంలోనే ఎంతో తృప్తి ఉందన్నారు. గిరిజన తండాల్లో పుట్టి అక్కడి పరిస్థితులు దగ్గరగా గమనించినందుకే తాను వైద్యవృత్తి ఎంచుకుని పేదప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు.

శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న టీఆర్‌ఎస్ నేత సుధాకర్‌రెడ్డి

ఫిలింనగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన నేతలు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నివాసిత ప్రాంతం కార్యకర్తలు, నేతలు, అభిమానులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపేందుకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వచ్చిన కార్యకర్తలను ఆయన పేరుపేరునా పలకరించారు.

రేవంత్‌రెడ్డికి...



శుభాకాంక్షలు చెబుతున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా టీ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నివాసం వద్ద కార్యకర్తలు, నేతల సందడి నెలకొంది. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిన్‌రెడ్డి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో కలిసి రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేటర్ విజయారెడ్డికి..



విజయారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఖైరతాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డికి పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

అతిగా మద్యం సేవించి బుక్కయ్యారు!



బంజారాహిల్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు విందు, వినోదాల్లో పాల్గొని ఇంటికి వెళ్లే క్రమంలో పలుచోట్ల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మందుబాబులు పెద్ద సంఖ్యలో పట్టుబడ్డారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 49 మంది వాహనదారులు పట్టుబడ్డారు. ఇందులో ఆరు కార్లు ఉండగా 43 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ఈ తనిఖీలు నిర్వహించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 48 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 51 మంది వాహనాలను పట్టుకున్నారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకంగా 73 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. బంజారాహిల్స్ పరిధిలో స్టడీ సర్కిల్ వద్ద, పార్క్‌హయత్ హోటల్ వద్ద, జూబ్లీహిల్స్ పరిధిలో బీవీబీపీ జంక్షన్‌లో, చిరంజీవి బ్లడ్ బ్యాంకు వద్ద, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 డైమండ్ హౌజ్ వద్ద, పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రీన్‌ల్యాండ్ జంక్షన్ వద్ద, ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణకాంత్ పార్కు, ఐసీఐసీఐ యూటర్న్ వద్ద, సైఫాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం, లక్డీకాపూల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సారి సెలబ్రిటీలు ఎవరూ ఈ డ్రైవ్‌లో పట్టుబడకపోవడం విశేషమనే చెప్పాలి. అంతేకాకుండా గతంలో మాదిరిగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మహిళలు కూడా ఎవ్వరూ పట్టుబడలేదు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బంజారాహిల్స్: కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చర్చి పాస్టర్ ఎం. ప్రభుదాస్ నూతన సంవత్సర ప్రసంగం చేశారు. యువత ఆట, పాటలతో సందడి చేశారు.



ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మహిళా పాస్టర్లు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కేలండర్ల ఆవిష్కరణ

శ్రీనగర్‌కాలనీ: మధురానగర్ సంక్షేమ సమితి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం సమితి కార్యాలయంలో ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, కార్పొరేటర్ దేదీప్య ఆవిష్కరించారు. సమితి ప్రెసిడెంట్ కోడె సాంబశివరావు, జనరల్ సెక్రటరీ మన్నె కళ్యాణచక్రవర్తి, రాజగోపాల్, కృష్ణ, రాజన్‌బాబు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

బ్రహ్మశంకర్‌నగర్‌లో...

రహమత్‌నగర్: బ్రహ్మశంకర్‌నగర్ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం కమిటీ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆలయ ధర్మకర్త ఓర్సు అడవయ్య ఆవిష్కరించారు. బస్తీ అధ్యక్షుడు ఓర్సు వీర వసంత్ కుమార్, రామోజీ, రాజు, నాగేశ్, సతీష్, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకులు రేలంగి నరసింహారావు, కార్పొరేటర్ దేదీప్య



బ్రహ్మశంకర్‌నగర్‌లో ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

9న 'సీనియర్'కు క్రీడా పోటీలు

సనత్‌నగర్: ఖైరతాబాద్ సర్కిల్-17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న ఇండోర్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్యారమ్స్ (సింగిల్ అండ్ డబుల్స్), చెస్, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల సీనియర్ సిటిజన్స్ ఈనెల 7వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి హాజరై ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. క్యారమ్స్‌కు కృష్ణారెడ్డి (98660 45059), వైకేడీ ప్రసాద్ (94939 74300), చెస్‌కు సంబంధించి జే.ప్రసాద్ (89779 14856), జనరల్ నాలెడ్జ్‌కు జేఎస్‌టీ శాయి (90001 55432).

సమతా రాజ్యాన్ని నిర్మిస్తాం

లిబర్టీ: భారత్‌కు ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశించిన సమతా రాజ్యాన్ని నిర్మిస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. భీమ్ కోరేగాం యోధుల సంస్కరణ సభ దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమ బుద్ధుని తాత్విక వెలుగులో పని చేస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్



జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్త సంవత్సరంలో మంచి జరగాలని వేడుకోలు

బంజారాహిల్స్: నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఏడాది అంతా శుభాలతో ఉండాలని కోరుకునేందుకు భక్తులు కొత్త సంవత్సరం రోజు ఆలయాలకు పోటెత్తారు. ఆదివారం అందులోనూ కొత్త సంవత్సరం కావడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లిని తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారిని సుమారు లక్షన్నర మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


జగన్నాథ మందిరంలో...

నూతన సంవత్సరం రోజు బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని జగన్నాథ టెంపుల్ భక్తజన సందోహంతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో విచ్చేశారు. సుమారు లక్ష మంది భక్తులు జగన్నాథుడిని దర్శించుకొని తరించిపోయారు.











బంజారాహిల్స్‌లోని జగన్నాథ మందిరంలో..

అన్నదానం.. పుణ్యకార్యం



అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ దంపతులు

హిమాయత్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి విస్తృత పర్యటన చేశారు. ఆదివారం పలు దేవాలయాల వద్ద ఆమె అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు రూపొందించిన కేలండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఒక్కొటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అన్నదానం మహా పుణ్యకార్యమని.. ఆకలిలో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చితే అందులో ఎంతో తృప్తి ఉంటుందన్నారు. ఈ ఏడాదిలో కూడా ప్రజలకు మరింత దగ్గర అవుతూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాను ప్రయత్నిస్తానని తెలిపారు.

వాహనాల రద్దీ.. స్తంభించిన ట్రాఫిక్



బంజారాహిల్స్ రోడ్ నెం. 10 తెలంగాణ భవన్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు

వెంకటేశ్వరకాలనీ: ఒక వైపు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి, మరో వైపు జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం, ఇంకోవైపు బంజారాహిల్స్‌లోని జగన్నాథ మందిరం, విరించి చౌరస్తా లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఫిలింనగర్ దైవసన్నిధానం.. ఇలా... బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో ఉన్న ఆలయాలకు నూతన సంవత్సరం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తడంతో రహదారులన్నీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారిపోయాయి. ఎటు చూసినా ట్రాఫిక్ జామ్‌లు కనిపించాయి. ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉన్న నియంత్రించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, ఎస్‌ఆర్‌నగర్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో వాహనదారులు ట్రాఫిక్‌లో విలవిల్లాడిపోయారు.

మురుగు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించండి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ప్రాంతవాసులను ఎంతో కాలంగా వేధిస్తున్న మురుగు నీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజయారెడ్డి కోరారు. సచివాలయ నిర్మాణ పనుల కారణంగా మింట్ కంపౌండ్, సచివాలయం గుండా వెళ్లే పైప్‌లైన్ బ్లాక్ అవడం, వాటర్ వర్క్స్ ఆఫీసు నుంచి ఇందిరానగర్ కాలనీ డబుల్ బెడ్‌రూం గుండా ఐమ్యాక్స్ పక్కన ఖాళీ స్థలం నుంచి ఎన్టీఆర్ గార్డెన్ వరకు వెళ్లే నాలా ఐమ్యాక్స్ పక్కన ఖాళీ స్థలంలో కార్ రేస్ గురించి చేపడుతున్న నిర్మాణాల కారణంగా ఆగిపోవడంతో ఖైరతాబాద్ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులు ఈ పైప్‌లైన్లను శిథిలం అవకుండా, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదివారం విజయారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం తెలిపారు.

క్లుప్తంగా...

అనకాపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు



సాక్షి, అమరావతి: అత్యధికంగా ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించడంలో భాగంగా అనకాపల్లి వద్ద భారీ ఎంఎస్ఎంఈ పార్కును ఏపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అనకాపల్లి జిల్లా కోడూరు గ్రామంలో సుమారు 129 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేస్తోంది. తొలి దశలో 59 ఎకరాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ ఉన్నతాధికారులు తెలిపారు. సర్వే నెంబర్ 1(పీ), సర్వే నెంబర్ 21(పీ)లో కనీస మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ బిడ్లను ఆహ్వానించింది. సుమారు రూ.12.63 కోట్లతో రహదారులు, డ్రైనేజ్, వర్షపు నీటి కాలువలను అభివృద్ధి చేయనున్నారు. టెండర్లు దక్కించుకున్న సంస్థ 12 నెలల్లో పనులు పూర్తి చేయాలి. ఆసక్తి గల సంస్థలు జనవరి 17లోగా బిడ్లను సమర్పించాలి. ఆటోమొబైల్, కెమికల్ రంగాలకు చెందిన కంపెనీల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఎంఎస్-సీడీపీ ప్రోగ్రాం కింద పార్కును అభివృద్ధి చేసేలా ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వెల్లడించారు.

లక్ష్మీపార్వతికి మాతృవియోగం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి తల్లి దాసరి సామ్రాజ్యలక్ష్మి(85) మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం తెల్లవారుజామున మరణించారు. నెలరోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతిచెందారు. సాయంత్రం ఫిలింనగర్ మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు పూర్తిచేశారు. దాసరి సామ్రాజ్యలక్ష్మి, కృష్ణమూర్తి దంపతులకు లక్ష్మీపార్వతి ఏకైక సంతానం.

కాటేసిన 'కానుక'



మృతిచెందిన రమాదేవి, సయ్యద్ ఆసియా, ఎస్కే బీబీ

▶ మొదటి పేజీ తరువాయి

నలిగిపోతూ ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోతున్నా చంద్రబాబు తీరు మారడం లేదు. ఏమాత్రం పశ్చాత్తాపం కానరావడం లేదు.

మంచినీళ్లూ ఇవ్వలేదు..

సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన టీడీపీ నేతలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పేద మహిళలను వికాస్ కాలేజీ మైదానానికి తరలించారు. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగానికి చెందిన ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ ఉయ్యూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు వేదిక వద్దకు చేరుకుని స్వయంగా పేదలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచే పేదలను తరలించగా చంద్రబాబు సాయంత్రం 5.30 గంటలకు వేదిక వద్దకు రావడం గమనార్హం. అప్పటికే దాదాపు ఐదు గంటలకుపైగా నిరీక్షించాల్సి రావడం, కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేకపోవడంతో మహిళలు అల్లాడారు. సాయంత్రం 5.35 గంటలకు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించి 6.15 గంటలకు ముగించారు. కొంత మందికి మాత్రం చంద్రబాబు సంక్రాంతి కానుకలు అందచేయగా మిగతావారికి టీడీపీ నేతలు ఇస్తారంటూ వెళ్లిపోయారు.

ఐదు నిమిషాల్లోనే...

అప్పటివరకు కానుకల పంపిణీ గురించి గొప్పగా చెప్పిన నిర్వాహకులు చంద్రబాబు నిష్క్రమించగానే మాట మార్చారు. నామమాత్రంగా కొందరికి అందించి చేతులు దులిపేసుకోవాలని భావించారు. మిగిలిన వారందరికీ డివిజన్లలోకి వచ్చి పంపిణీ చేస్తామని చెప్పడంతో మహిళలు నిర్ఘాంతపోయారు. కానుకల కోసం తోసుకుంటూ తూతూమంత్రంగా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను నెట్టుకుంటూ ముందుకు కదిలారు. తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనలో గుంటూరు కన్నావారితోటకు చెందిన సయ్యద్ ఆసియా (35), ఏటీ అగ్రహారానికి చెందిన గోపిదేశి రమాదేవి (50), మారుతీనగర్ నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన షేక్ బీబీ (55) తొక్కిసలాటలో ఊపిరి ఆడక మృతి చెందారు. వీరిలో ఒక మహిళ అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 16 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

30 కౌంటర్లంటూ.. 12 లారీల్లో

చంద్రన్న సంక్రాంతి కానుకలను 30 కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని టీడీపీ నేతలు పోలీసులకు సమాచారమిచ్చారు. కానీ కేవలం 12 మాత్రమే ఏర్పాటు చేశారు. అది కూడా కానుకలతో కూడిన లారీలను నేరుగా మైదానంలోకి తరలించి వాటి నుంచే పంపిణీ చేశారు. వాహనాలను దూరంగా కాకుండా దగ్గరగా ఇరుకుగా నిలబెట్టారు. చంద్రబాబు వెళ్లిపోయిన 5 నిముషాల్లోనే కానుకల పంపిణీని నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో లారీలు కదలడానికి సిద్ధమవుతున్నాయని పసిగట్టిన పేదలు కానుకల కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. ఫలితంగా తొక్కిసలాటకు దారితీసి అమాయక మహిళలు మృత్యువాత పడ్డారు. కాగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు మంత్రి రజని ప్రకటించారు.

నేను వెళ్లిపోయాకే తొక్కిసలాట: చంద్రబాబు

సాక్షి, అమరావతి: గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ చేపట్టిన పేదలకు కానుకల పంపిణీ కార్యక్రమం నుంచి తాను వెళ్లిపోయాకే తొక్కిసలాట చోటుచేసుకుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలిపారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరపున రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారం అన్ని రకాల అనుమతులు తీసుకున్నాకే కానుకలు, వస్త్రాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఉయ్యూరు ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా టోకెన్లు జారీ చేసిన వారికంటే అదనంగా ప్రజానీకం ఒక్కసారిగా లోపలకు రావటంతో అపశ్రుతి చోటు చేసుకుందని పేర్కొంది. మరణించిన వారికి ఫౌండేషన్ తరపున ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించింది.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రూ.300 నాసిరకం కిట్లు

గుంటూరు రూరల్: చంద్రన్న కానుకలంటూ సభా ప్రాంగణం వద్ద పంపిణీ చేసిన కిట్‌లో అరకిలో కందిపప్పు, ప్యాకెట్ పామాయిల్, అరకిలో చింతపండు, అరకిలో గోధుమపిండి, కిలో ఉల్లిపాయలు, అరకిలో బెల్లం, చీర ఉన్నాయి. కిట్‌లో మొత్తం సరుకుల విలువ రూ.300కి మించి ఉండదని వాటిని తీసుకున్న మహిళలు చెబుతున్నారు. పది వేల మందికి మాత్రమే చీరలు కొనుగోలు చేసి గుంటూరులోని నగరం, పరిసర ప్రాంతాల్లో 30 వేల మందికి టోకెన్లు పంపిణీ చేశారు.

ఊరూ వాడా సంబరం

పెరిగిన పింఛన్ రూ.2,750 పంపిణీ చేసిన వలంటీర్లు



ఒంగోలులో రూ.2,750 పింఛన్ నగదు అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: అవ్వాతాతలు సహా సామాజిక పింఛన్ రూ.2,750కి పెంపుపై లబ్ధిదారులు ఆనంద భరితులయ్యారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే వారి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పెరిగిన పింఛన్‌పై వివిధ రూపాల్లో తమ సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలు చోట్ల వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తూ తమ దీవెనలను వ్యక్తపరిచారు. ఈ ప్రభుత్వం వచ్చాక చిన్న కష్టం కూడా తెలియకుండా, ప్రతి నెలా వలంటీర్లు తమ ఇంటి వద్దకే వచ్చి.. పింఛన్లు పంపిణీ చేస్తున్న తీరు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని లబ్ధిదారులు కొనియాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొత్త పింఛన్ మంజూరుకు పడే పాట్లు, ప్రతినెలా పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు, చాంతాడంత క్యూలో నిలుచోలేక పడిన ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. సీఎం జగన్ చెప్పిన మాటను చెప్పినట్లు ఆచరిస్తున్నారని కొనియాడారు. పింఛన్ పెంపును పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాసిన లేఖను లబ్ధిదారులకు పింఛన్ సొమ్ముతో పాటు అందజేశారు. కాగా, 1వ తేదీ (ఆదివారం) రాత్రి ఏడు గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 45,65,076 మందికి పెరిగిన పింఛను డబ్బుల పంపిణీ పూర్తయింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.1,257.25 కోట్లు అందజేశారు. తొలిరోజునే 71.26 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయినట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు. 1వ తేదీ సెలవు రోజు అయినప్పటికీ 13 జిల్లాల్లో 75 శాతానికి పైగా పంపిణీ పూర్తయిందని తెలిపారు.

పీవీ చలపతిరావు కన్నుమూత

- అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రెండుసార్లు ఎమ్మెల్సీగా, బీజేపీ ఉమ్మడి ఏపీ అధ్యక్షుడిగా సేవలు



సాక్షి, విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు (87) కన్నుమూశారు. విశాఖ నగరంలోని పిఠాపురం కాలనీలో ఉంటున్న ఆయన కొంతకాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురవడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు పి.వి.ఎన్.మాధవ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. 1935 జూన్ 26న జన్మించిన చలపతిరావు పదేళ్ల వయసులోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి చురుకైన పాత్ర పోషించారు. 1967 నుంచి విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. 1973లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించి పలుమార్లు అరెస్టయ్యారు. ఎమర్జెన్సీ కాలంలో లోక సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయన 19 నెలలు అజ్ఞాతంలో గడిపారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన ఉత్తర సర్కారు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 1974లోను, 1980లోను శాసనమండలికి ఎన్నికయ్యారు. చలపతిరావు పార్థివదేహాన్ని ప్రజలు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం విశాఖ పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పీవీ చలపతిరావు మృతిపట్ల హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు సంతాపం ప్రకటించారు.

హరిరామజోగయ్య ఆస్పత్రికి తరలింపు

- అంతకుముందు హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సంఘ నాయకుడు చేగొండి హరిరామ జోగయ్య కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆదివారం పోలీసులు జోగయ్యతో మాట్లాడుతూ.. వయస్సు రీత్యా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, దయచేసి తమ మాట వినాలని సుమారు రెండు గంటలకు పైగా జోగయ్యకు నచ్చజెప్పారు. అయినా ఆయన మాట వినకపోవడంతో పోలీసులు జోగయ్యను హౌస్ అరెస్టుచేశారు. దీక్ష ప్రారంభించకుండానే తనను హౌస్ అరెస్టు చేయడంతో జోగయ్య ఇప్పటి నుంచే దీక్షను ప్రారంభిస్తున్నానని ప్రకటించారు. దీంతో పోలీసులు వెంటనే ఆయన్ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ముందు పట్టణంలోని న్యూలైఫ్ ఆసుపత్రి అని చెప్పడంతో మీడియా ప్రతినిధులు అందరూ అటువైపు వెళ్లారు. ఈలోగా మార్టేరు రూటులో ఏలూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

పిల్లలొచ్చారు.. అమ్మానాన్న రాలేదు

- అమెరికాలో దుర్మరణం పాలైన తెలుగు దంపతులు
- కుమార్తెలిద్దరూ స్వగ్రామానికి చేరిక

ప్రత్తిపాడు (గుంటూరు): అమెరికాలోని న్యూజెర్సీలో తుపాను దృశ్యాలను ఫొటోలు తీసుకుంటున్న క్రమంలో భారీ ఐస్ గడ్డల నుంచి జారిపడి సరస్సులోకి జారి మృత్యువాత పడిన ముద్దన నారాయణ, హరిత దంపతుల మృతదేహాల రాక కోసం వారి కుటుంబీకులు కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తున్నారు. ఉద్యోగం రీత్యా అమెరికా వెళ్లి అరిజోనాలో నివాసం ఉంటున్న గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రుకు చెందిన నారాయణ, హరిత దంపతులు గత నెల 26వ తేదీన విహార యాత్రకు వెళ్లి సరస్సులో గల్లంతై మృత్యువాత పడిన విషయం విదితమే. కాగా, ప్రమాదం జరిగిన ప్రాంతానికి కొంత దూరంలో ఉండిపోయిన వారి ఇద్దరు కుమార్తెలు పూజిత, హర్షితలను టీసీఎస్ కంపెనీ సహకారంతో భారత్‌కు తీసుకువచ్చారు. శనివారం ఉదయం అమెరికాలోని డల్లాస్ నుంచి బయల్దేరిన ఆ పిల్లలు ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకోగా.. అక్కడి నుండి నేరుగా ప్రత్యేక వాహనంలో స్వగ్రామమైన పాలపర్రుకు తీసుకువచ్చి తాతయ్య సుబ్బారావు, నాయనమ్మ వెంకటరత్నంకు అప్పగించారు.

'అమ్మా నాన్నలేరీ!'

'నానమ్మా.. అమ్మా, నాన్నలు ఏరీ'అంటూ నారాయణ, హరిత దంపతుల చిన్నకుమార్తె హర్షిత అడుగుతున్న తీరు బంధువుల్ని, గ్రామస్తుల్ని కన్నీరు పెట్టిస్తోంది. అమ్మానాన్న మరణించారన్న విషయం తెలియని ఆ చిన్నారిని చూసి వారంతా చలించిపోతున్నారు. తల్లిదండ్రులు ఇక రారన్న చేదు నిజాన్ని ఎలా చెప్పాలో తెలియక తాతయ్యలు, నాయనమ్మ,అమ్మమ్మలు భోరున విలపిస్తున్నారు.

నగర వార్తలు

నడిరోడ్లపైనే కరెన్సీ మార్పిడి!

- విదేశీ కరెన్సీకి నిత్యావసరాల పేర్లు
- ఏజెంట్ల ద్వారా కరెన్సీ ఎక్స్ఛేంజ్
- హోం డెలివరీ సేవలు కూడా...
- పన్ను ఎగవేస్తున్నా పట్టని యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: అది పాతబస్తీ లోని షహెరాన్ ప్రాంతం. అక్కడ ఎవరిని పలకరించినా.. కదిలించినా ఒకటే మాట. మీకు ఏ దేశ కరెన్సీ కావాలి. రియాల్ కావాలా? పౌండ్ కావాలా? డాలర్ కావాలా? అనే ప్రశ్నలే వినవస్తాయి. నడి రోడ్డు మీద బహిరంగంగా బ్రోకర్లు కరెన్సీని మార్పిడి చేసేస్తున్నారు. ఇలా అక్రమంగా నోట్ల కట్టలు చేతులు మారుతున్నా పోలీసు, ఆదాయ పన్ను శాఖ పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విదేశాల నుంచి వస్తున్న వారు తమ వెంట తీసుకొస్తున్న కరెన్సీని విమానాశ్రయంలోనే మార్చుకోవాలి. బయటకు వచ్చిన తర్వాత విదేశాల నుంచి వచ్చిన వివరాలు చూపి బ్యాంకులు, కరెన్సీ మార్పిడి ఏజెంట్ల వద్ద మార్చుకోవచ్చు. అయితే ఆయా కరెన్సీకి లెక్క చూపడంతో పాటు ఎక్స్ఛేంజ్ రేటు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొంతమంది బ్రోకర్లు కరెన్సీ మార్పిడినే వ్యాపారంగా మలుచుకున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టేందుకు ఏజెంట్లు హవాలా రూపంలో అక్రమ దందాలను సాగిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారంతో వ్యాపారులు నల్లధనాన్ని వైట్‌గా మార్చుకుంటున్నారు.

ఒక్కో కరెన్సీకి పేర్లు...

బస్తీలు, హోటళ్లలో కరెన్సీ మార్పిడి జరుగుతుంది. ఒక్కో దేశ కరెన్సీకి ఒక్కో రకమైన పేర్లుంటాయి. ఆయా దేశ కరెన్సీ ముందు అక్షరంతో నిత్యావసర పేరు పెట్టి రహస్యంగా ఈ దందా సాగిస్తున్నారు. కొంత మంది మధ్యవర్తులు కరెన్సీ ఎక్స్ఛేంజ్ సేవలను హోమ్ డెలివరీ కూడా అందిస్తున్నట్లు సమాచారం. బ్యాంకు కన్నా 5 నుంచి 10 శాతం ఎక్కువ రేటుతో విదేశీ కరెన్సీని మార్పిడి చేస్తున్నారు. కరెన్సీ మార్పిడి పేరిట సాగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలు కళ్లముందే జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఇక్కడి నుంచి విదేశాలకూ...

విదేశీ కరెన్సీ ఉన్న వ్యక్తులు, వ్యాపారస్తులకు కమీషన్ చెల్లించి ఆయా నగదును ఏజెంట్లు సేకరిస్తున్నారు. ఈ కరెన్సీని తిరిగి అదే దేశానికి పంపించి అక్కడ సంపాదించిన డబ్బుగా చూపించి దేశంలో చెలామణి చేసున్నారు. దీంతో బ్యాంకులకు కమీషన్ రాకపోగా ప్రభుత్వానికి పన్ను రూపంలో లభించే ఆదాయానికీ గండిపడుతోంది.

తిరిగొస్తున్న 'గుండెబలం'...

- సత్ఫలితాలిస్తున్న కార్డియాక్ రిహాబ్ ప్రోగ్రామ్
- దేశంలోని తొలిసారిగా ఇఎస్ఐసిలో అందుబాటులోకి
- పరుగు పోటీలకూ సై అంటున్న హృద్రోగులు

'అతడ్ని ఎక్కువ ఇబ్బంది పెట్టకు తన గుండెకు స్టెంట్ వేశారు... ఎక్కువ మెట్లు ఎక్కొద్దు అసలే బైపాస్ చేయించుకున్నారు.'...ఒక్కసారి గుండెకు సమస్య వచ్చి చికిత్స పొందుతున్నా పొందినా చాలు... అక్కడ నుంచి సన్నిహితులు పేరుకు ముందు హార్ట్ పేషెంట్ ట్యాగ్ తగిలించి పనులభారాన్ని తగ్గించుకోఅంటారు. దూర, భార ప్రయాణాలకు దూరంగా ఉండమంటారు. ఆటలు, పాటలు సరేసరి. అలాంటి పరిస్థితుల్లో హృద్రోగులను ఏకంగా మారథాన్ రన్నర్స్‌గా మారుస్తోంది ఇఎస్ఐసి ఆసుపత్రి నిర్వహిస్తున్న దేశంలోనే తొలి కార్డియాక్ రిహాబ్ ప్రోగ్రామ్.

–సాక్షి, సిటీబ్యూరో

సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ అభివృద్ధి చేసిన ఈ కార్డియాక్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్ హృద్రోగులు వేగంగా కోలుకోవడానికి మాత్రమే కాదు.. రోగులు కాని వారికన్నా మిన్నగా శక్తి సామర్థ్యాలను సంతరించుకోవడానికి సైతం చేయూతనిస్తోంది.

రోగం.. పరుగో పరుగు...

ఈ కార్యక్రమం వల్ల హార్ట్ ఫెయిల్యూర్, డైలేటెడ్ కార్డియోమయోపతి, పల్మనరీ ఆర్టరీ హైపర్‌టెన్షన్ వంటి గుండె సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందిన, పొందుతున్న వారు కోలుకోవడమే కాకుండా ఎలాంటి ఒత్తిడి లేకుండా 10 నుంచి 15కి.మీ వరకు నడవగలుగుతున్నారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులలో మరెక్కడా అందుబాటులో లేని ఏకైక అధునాతన కార్డియాక్ రిహాబ్ సేవగా దీన్ని మెడికల్ కాలేజీ కన్సల్టెంట్ కార్డియాక్ రిహాబిలిటేషన్ స్పెషలిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీధర్ బాబీ పేర్కొన్నారు. గుండె జబ్బులకు యాంజియోప్లాస్టీ బైపాస్ సర్జరీ వంటి ప్రక్రియల తర్వాత దీనిని సిఫార్సు చేస్తారు. ఇఎస్ఐసి ఆసుపత్రిలో కార్డియాక్ రిహాబిలిటేషన్ ప్రోగ్రాంకు హాజరైన దాదాపు 40 మంది హృద్రోగులు ఇటీవల నగరంలో ఆదిత్య మెహతా ఫౌండేషన్ నిర్వహించిన 5 కిమీ, 10 కిమీ విభాగాల్లో ట్రయల్ రన్ మారథాన్‌లో పాల్గొన్నారు. ఈ రన్నర్స్‌లో యాంజియోప్లాస్టీ/ బైపాస్ సర్జరీ చేయించుకున్నవారూ ఉండడం విశేషం.



పంపింగ్..పెంపు...

గుండెకు రక్తం సరఫరా చేసే సామర్థ్య లెక్కింపు ప్రకారం... సాధారణంగా పంపింగ్ కెపాసిటీ 55 ఈఎఫ్ (ఇంజక్ ఫ్రాక్షన్) ఉంటుంది. అది 30 కంటే తక్కువకు పడిపోతే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. ఫలితంగా ఛాతిలో నొప్పి, బ్లాక్‌లు ఏర్పడడం వగైరా సమస్యలు వస్తాయి. వీటికి చికిత్సలో భాగంగా స్టెంట్ , బైపాస్ సర్జరీలు చేస్తారు.



అయితే ఇదే హృద్రోగులకు మరోసారి స్టెంట్ వేయాల్సి రావడం, మరోసారి శస్త్ర చికిత్సల అవసరం పడడం కూడా జరుగుతుంటుంది. దీనికి కారణం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి సరైన మందులు లేకపోవడం. ఈ నేపథ్యంలోనే పంపింగ్ సామర్థ్యం పెంచేందుకు గాను డిజైన్ చేసిన వినూత్న ప్రోగ్రామ్ ఇది. అలాగే బ్లాక్స్ ఏర్పడినప్పుడు స్టెంట్ వేయని మైనర్ బ్లాక్స్ మళ్లీ మేజర్ బ్లాక్స్‌గా మారే ప్రమాదాన్ని ఈ ప్రోగ్రామ్ నివారిస్తుంది

రిహాబ్ ఇలా...

గుండెపోటు నుంచి బయటపడినవారు వైద్యుని పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి హాజరుకావచ్చు వ్యక్తి గుండె సామర్థ్యానికి జరిగిన నష్టంపై ఆధారపడి ప్రోగ్రామ్ వ్యవధిని 3 నుంచి 6 నెలల వరకు నిర్ణయిస్తారు. ట్రెడ్‌మిల్‌పై నడకతో మొదలుపెట్టి జాగింగ్, రన్నింగ్, స్టెప్ ఏరోబిక్స్ సైకిల్ ఎర్గోమీటర్ ఆన్ ఎర్గోమీటర్ ల మీద వ్యాయామాలు ఉంటాయి. వ్యాయామం చేస్తున్నప్పుడు పలు పరికరాల ద్వారా హార్ట్‌రేట్‌ను అనుక్షణం మానిటర్ చేస్తుంటారు. ఒక్కో సెషన్ రోజుకు గంట నుంచీ గంటన్నర చొప్పున సాగుతుంది. ప్రోగ్రామ్ పూర్తిగా వ్యక్తిగత పర్యవేక్షణలో జరుగుతుంది. సెషన్ల ముగింపు వేళకు పంపింగ్ సామర్థ్యం కూడా అనూహ్యంగా మెరుగుపడుతుందని ఇక్కడి ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

దేశంలోనే తొలి ప్రోగ్రామ్...



సాధారణ నడకతో గుండె కోల్పోయిన బలం తిరిగి సంతరించుకోదు. అయితే గుండె దశలవారీగా సంపూర్ణ సామర్థ్యాన్ని సంతరించుకోవడానికి ప్రత్యేకంగా కొన్ని కార్డియో వాస్క్యులర్ వ్యాయామాలతో ఈ రిహాబ్ ప్రోగ్రామ్ డిజైన్ చేశాం. ఇది గుండె పంపింగ్ సామర్థ్యాన్ని శారీరక ధృఢత్వాన్ని మెరుగుపరచడమే కాకుండా ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని, మందుల వాడకాన్ని తగ్గిస్తుంది. దూమపానం, మద్యపానం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి ప్రమాద కారకాల వినియోగం తగ్గిస్తుంది. ఇప్పటికే ఎంతో మంది తమ గుండెబలాన్ని తిరిగి పొందారు. పరుగు పోటీల్లో సైతం పాల్గొంటున్నారు.

– డాక్టర్ మురళీధర్, ఇఎస్ఐసి ఆసుపత్రి

హార్ట్ పేషెంట్ అనే విషయం మర్చిపోయాను...

గత జులై 5న ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో నాకు గుండెకు స్టెంట్ వేశారు.. తర్వాత 3 వారాల్లోనే ఈ ప్రోగ్రామ్ స్టార్ట్ చేసి పూర్తి చేశాను. నిమిషం నడకతో నా శిక్షణ మొదలైంది. ఇప్పుడు ప్రతీ వారం ఒక్కడినే 5 నుంచి 10కి.మీ పరిగెడతాను. పదుల సంఖ్యలో పరుగు పోటీల్లో పాల్గొన్నను. త్వరలోనే హాఫ్ మారథాన్ రన్ (21కి.మీ) పాల్గొననున్నాను. గతంతో అయినా కాస్త శరీరం బరువుగా ఉండేది. ఇప్పుడు చాలా తేలికగా ఉంది. బి.పి, షుగర్ మందులు సహా రోజుకు 12 మందులు వాడేవాడిని. ఇప్పుడు ఒక్కటే వాడుతున్నాను.

– ఆనందరావు, జూబ్లీహిల్స్

సినీగేయ రచయిత చంద్రబోస్‌కు సత్కారం



చంద్రబోస్‌ను సత్కరిస్తున్న అతిథులు

పంజగుట్ట: గేయ రచయిత చంద్రబోస్‌ను సత్కరిస్తున్నామంటే సాక్షాత్తూ సరస్వతీ పుత్రుడిని సత్కరిస్తున్నట్లే అని పలువురు కవులు,రచయితలు అన్నారు. మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చంద్రబోస్‌ను 'సినీ గేయ కౌముది' బిరుదుతో సత్కరించారు. ఇంకా సినీ గేయ రచయిత డాక్టర్ సాదనాల వేంకటస్వామి నాయుడుకు సత్కారం, డాక్టర్ వి.డి. రాజగోపాల్ రచించిన కవితాలహరి పుస్తకావిష్కరణ, కొప్పుల ప్రసాద్ రచించిన చిరుగాలి పలకరిస్తే పుస్తకావిష్కరణ, శ్రీ షిర్డీసాయి సేవాట్రస్టు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. మహర్షి వాల్మీకి సాంసస్కృతిక సేవా సంస్థ గౌరవాధ్యక్షులు వి.డి.రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ కొలకలూరి ఇనాక్, శతచిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సుప్రసిద్ధ కవి, విమర్శకులు బిక్కి కృష్ణ, నూకల సూర్యానారాయణ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి



ఎల్‌బీనగర్‌లో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్

రాచకొండ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్

నాగోలు: రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని రాచకొండ పోలీస్ కమీషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. శనివారం రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా ఎల్‌బీనగర్‌లో నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. అనంతరం కానిస్టేబుల్‌కు, పోలీస్ సిబ్బంది నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు భరోసా ఇస్తూ భద్రత కలిస్తామన్నారు. పోలీస్ పనితీరులో మార్పులు తీసుకువచ్చే అందకు కృషి చేస్తానని తెలిపారు. పోలీసులందరూ నిబద్ధతో పనిచేసినప్పడే నేరాలను నియంత్రించి శాంతి భద్రతలను పూర్తి స్థాయిలో పరిరక్షివచ్చని తెలిపారు. రాచకొండ జాయింట్ సీపీ సుధీర్ బాబు, డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, శ్రీనివాస్, సలీమా, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ

కాచిగూడ: ఐ ఫోకస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్‌ను ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండిసంజయ్ ఆవిష్కరించారు. బీజేపీ ఓబీసీ మోర్చాహైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.



గోల్కొండ కిట..కిట..

గోల్కొండ: పర్యాటకులతో గోల్కొండ కోట జన సంద్రమైంది. నూతన సంవత్సరం రోజు కావడంతో కోటకు వేలాదిగా పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం 7 గంటల నుంచే కోట కు దారితీసే రోడ్లు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. టికెట్ కౌంటర్ ముందు వేల సంఖ్యలో గుమికూడారు. గత సంవత్సర కాలంలో ఇంత భారీ సంఖ్యలో పర్యాటకులు రావడం ఇదే తొలి సారని గోల్కొండ కోట హిస్టరీ గైడ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మహ్మద్ అర్షద్ అన్నారు. ఇదిలా ఉండగా కోట వద్ద టికెట్ తీసుకోవడానికే గంటకు పైనే సమయం పట్టింది.



మంచి మాట

మెలకువలోనే మేలిమి



మనిషి మెలకువలో ఉండాలి; మనిషి మేలుకుని మసలాలి. మెలకువలో ఉండేందుకు, మేలుకుని మసలేందుకు మనిషి బతకాలి; మనిషి మేలుగా బతకాలి. నిద్రపోకూడదనీ, నిద్రవద్దనీ కాదు నిద్రపోతున్నప్పుడు మాత్రమే మనిషికి నిద్ర ఉండాలి. నిద్ర అనేది మనిషికి కొంచెంసేపు వేసుకునే వస్త్రంగా మాత్రమే ఉండాలి. నిద్ర మనిషి పూర్తిగా కప్పుకునే దుప్పటి కాకూడదు; మనిషి తనను తాను నిద్రతో కప్పేసుకోకూడదు. మెలకువతో, మెలకువలో మనిషి తనను తాను చాటుకుంటూ ఉండాలి.

'మెలకువలో కల నిజం కాదు; కలలో మెలకువ లేదు' అని ఆదిశంకరాచార్య చెప్పారు. ఈ మాటల్ని మనసులోకీ, మెదడులోకీ ఎక్కించుకోవాలి. కలలు కనడానికి నిద్రపోతూ ఉండడంలోనూ, నిద్రలో కలలు కంటూ ఉండడంలోనూ కాలాన్ని వ్యర్థం చేసుకోకూడదు. కలలోనూ, నిద్రలోనూ మెలకువ ఉండదు. మనకు మెలకువ కావాలి ఎందుకంటే మెలకువలో కల నిజం కాదు. మనిషి కల కాకూడదు; మనిషి నిజం కావాలి.

భద్రంగా ఉండాలని మనం నిద్రలోనే ఉండిపోకూడదు. నిద్రలో అటూ, ఇటూ పొర్లుతూ ఉండడం జీవితవిధానం కాదు, ఎప్పటికీ కాకూడదు. నిద్రలో కలవరిస్తూ ఉండడంలోనూ, ఆ కలవరింతల్లో జరిగిపోయిన వాటిని వర్ణించుకుంటూ ఉండడంలోనూ మునిగిపోయిన మనిషి బతుకును పాడు చేసుకోవడం అనే నేరం చేస్తున్న నేరస్థుడు. ఎన్నో కలలు వస్తూ ఉంటాయి నిద్రలో. ఆ కలలు అన్నిటిలోనూ కల్లల్ని చూసుకుంటూ ఉండిపోవడం వయసును చిదుముకోవడమే అవుతుంది. కొందరు నిద్రపోతున్నప్పుడు మాత్రమే కాదు మేలుకుని ఉన్నప్పుడు కూడా కలలకంటూ ఉంటారు; కొందరు మెలకువను కూడా కలల్లో గడిపేస్తూ ఉంటారు, కలల్లో కలిపేస్తూ ఉంటారు. ఇది అవాంఛనీయమైన స్థితి; ఇది బాధాకరమైన స్థితి. మెలకువను కూడా కలల్లో గడిపేస్తూ, కలిపేస్తూ ఉండే వాళ్ల కల్లలు అయిపోతారు. మనిషి కల్ల అయిపోకూడదు.

అందుకే మనిషి వీలైనంత మెలకువలో ఉండాలి; అందుకే మనిషి వీలైనంత మేలుకుని ఉండాలి.

పుట్టిన వ్యక్తికి తప్పకుండా మరణం ఉంటుంది. పుట్టుక, మరణం మధ్యలో ఉండే నిడివి జీవితం అవుతుంది. జీవితంలో మెలకువతో ఉండడమే జీవనం అవుతుంది. జీవి జీవితానికి మెలకువ జవ. ఆ జవ ఉన్న జీవనంలోనే చవి ఉంటుంది. జవ, చవి లేని మనిషి జీవితం చెక్కకో, చెత్తకో సమానం అవడం కాదు చెక్కకన్నా, చెత్తకన్నా హీనం ఆపై హేయం అవుతుంది. మనిషి చెక్కో, చెత్తో అవడం దుస్థితి, దుర్గతి. 'యా మతిస్సా గతిర్భవేత్' అని అష్టావక్రగీతలో చెప్పడం జరిగింది. అంటే మతి ఎటువంటిదో గతి అటువంటిది అని అర్థం. మనిషి మతికి మెలకువ ఉంటే గతికి మెలకువ ఉంటుంది. మతికి, గతికి మెలకువ ఉంటే మనిషి చెక్కో, చెత్తో అయిపోయే దుస్థితి ఉండదు, రాదు.

ప్రకృతి మెలకువలోనే ఉంటుంది. ప్రకృతి నిద్రపోతే ఏం అవుతుందో మనం ఒకసారి ఆలోచిద్దాం. ప్రకృతి నిద్రపోతే మన ఆలోచనలకు కూడా అందని పరిణామాలు సంభవిస్తాయి. గాలి మెలకువలో ఉండడం వల్లే మనం ఊపిరి పీల్చుకుంటూ ఉన్నాం. రాత్రుల్లో మొక్కలు మెలకువతో ఉండబట్టే పువ్వులు పూస్తూ ఉన్నాయి. నదులు మెలకువతో పోతూ ఉన్నాయి కాబట్టే మన అవసరాలు తీరుతూ ఉన్నాయి. 'గచ్ఛ తీతి జగత్' అంటారు; పోతూనే ఉంది కాబట్టే జగత్ అయింది అని దానికి అర్థం. జగత్తు మొత్తం మెలకువతో ఉంది; మేలుకుని ఉంది. భూమి మెలకువతో ఉంది కాబట్టే సూర్యోదయం జరుగుతోంది; మనిషి మెలకువ తో ఉంటేనే జీవనోదయం జరుగుతుంది. 'కంపనాత్' అని అంటూ 'కదలడంవల్ల అది బ్రహ్మం' అని ఒక బ్రహ్మసూత్రం మనకు ఎరుకను ఇస్తోంది. ప్రకతి మాత్రమే కాదు బ్రహ్మం కూడా కదలిక ఉన్నదే. ప్రకృతి, బ్రహ్మం రెండూ మెలకువలో ఉండేవే; మేలుకుని ఉండేవే.

ఎంత మెలకువ ఉంటే అంత మేలును పొందుతాం. ఎంత మేలుకుని ఉంటే అంత మేలిమిని పొందుతాం. మెలకువలో బతుకుతూ మనం మేలును పొందుతూ ఉందాం; మేలుకుని బతుకుతూ మనం మేలిమికి మాలిమి అవుదాం.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

యువత భగవద్గీత సారాన్ని తెలుసుకోవాలి



మైసూరు దత్తపీఠాధిపతి
శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ



మహాభారతం పంచమవేదంగా చెప్పబడుతోంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన భగవద్గీతలోని సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ముఖ్యంగా యువత భగవద్గీత చదివి సారాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుడు చెప్పినట్లు ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించుకుంటూ ముందుకెళ్లాలి. గీతాసారాన్ని తెలుసుకుంటే మాట్లాడే ప్రతి మాట, ప్రతి అడుగు తిరుగులేని కచ్చితత్వంతో ఉంటాయి. అన్ని సమస్యలకు పరిష్కారం చూపించే సారం గీతలో ఉంది. దత్తాత్రేయుడిగా గురువు అవతారమెత్తిన మహావిష్ణువు కృతయుగంలో శ్రీరాముడిగా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా అవతరించి మానవాళికి మార్గదర్శకులయ్యారు. వీరి అవతారాలకు భారతదేశం వేదిక కావడం అదృష్టం. దీంతో ప్రపంచ దేశాలకు భారతదేశం ఎనలేని విజ్ఞానాన్ని అందించినట్లైంది. భారతదేశం ఎప్పుడూ ప్రపంచం లోని అన్ని దేశాలు బాగుండాలని కోరుకుంటూ వస్తోంది. ఇతర దేశాలతో ప్రేమపూర్వకంగా ఉంటూ వస్తున్న భారతదేశ విధానాన్నే స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలి. దీంతో యువతలో సానుకూల దృక్పథం కలుగుతుంది. అనేక దేశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారత యువత అక్కడ భారత సంస్కృతి, సాంప్రదాయాల గురించి గర్వంగా చెప్పుకోవాలి. అదేవిధంగా ప్రకృతి, పంచభూతాలను ఎవరు నడిపిస్తున్నారనే విషయాలను తెలుసుకోవాలి. దీంతో అందరికీ సద్బుద్ధి కలుగుతుంది. పరమాత్మను పరిపూర్ణంగా శరణు వేడడమే అన్నింటికీ పరిష్కార మార్గం. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత మానవాళికి దిశానిర్దేశం చేస్తోంది. భాగవతంలో శ్రీకృష్ణుడి అవతారం ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉంటుంది. త్రేతాయుగంలో శ్రీరాముడిగా కష్టాలు అనుభవిస్తూ ధర్మమార్గంలో ఎలా నడవాలో చూపించిన పరమాత్మ, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా ఎన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడో భాగవతం చదివితే తెలుస్తుంది. చిన్నతనం నుంచే భగవద్గీత, రామాయణం, మహాభారతం, భాగవతం గురించి తెలుసుకుంటే యువత తిరుగులేని సానుకూల దృక్పథాన్ని సాధిస్తుంది.

– తూమాటి భద్రారెడ్డి
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఇస్లాం వెలుగు

కాలంతో పోటీ పడదాం..!



మానవ జీవితం చాలా అమూల్యమైనది. అలాంటి జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం పైనే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో మనం ఏదైనా సాధించవచ్చు.. ఛేదించవచ్చు. డబ్బు.., గౌరవం.., ఉద్యోగం.., అధికారం.., హోదా.. ఏదైనా కావచ్చు, అదిసాధ్యమే.. కాని కాలాన్ని మాత్రం ఎంత ధనం ధారపోసినా, ఎంత పలుకుబడి ఉపయోగించినా సాధించలేము. ఇది కాలం చెప్పే సత్యం. మనం దాని విలువను గుర్తించకపోతే అది మనకోసం ఆగదు. అందుకని మనం ఏ విషయంలో అయినా సకాలంలో స్పందించ గలగాలి. సమయం మించి పోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మనకోసం నిరీక్షిస్తూ ఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మనవద్దకు రావాలని ఆశించడం సరికాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని దరి చేరనీయకూడదు. ఎందుకంటే, ఈరోజు చేయవలసిన కార్యాన్ని రేపటికి వాయిదా వేశామంటే కాలానికి మనం విలువ ఇవ్వనట్లే లెక్క. ఈనాటి కొద్దిపాటి అలక్ష్యం రేపటి బాధ్యతను రెట్టింపుచేస్తుంది. ఒకటికి రెండు తోడై, బాధ్యతలు పేరుకు పోతాయి. ఇక ఆ తరువాత బాధ్యతల నిర్వహణ తలకు మించిన భారంగా మారి, పలాయన వాదాన్ని ఆశ్రయించే దుస్థితి వస్తుంది. అద్భుతమైన విజయాలను సాధించినవారి జీవితాలను పరిశీలిస్తే, వారు కాలాన్ని (సమయాన్ని) ఎలా తమకు అనుకూలంగా మలచుకొని, సద్వినియోగం చేసుకొని, కొత్త అవకాశాలను సృష్టించుకున్నారో, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ఎలా నాంది పలికారో మనకు అర్థమవుతుంది. అందుకని కాలం విలువను గుర్తించాలి. దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకొని విజయ తీరాలకు చేరినవారి గాథల్ని అధ్యయనం చెయ్యాలి. స్ఫూర్తిపొందాలి. అపజయాలు మూటగట్టుకొని కాలగతిలో కలిసిపోయిన వారి గాథల్ని గుణపాఠాలుగా తీసుకోవాలి. కాలం / సమయం మనకు అనేక నిజాలు చెబుతోంది. బుద్ధిజీవి అయిన మానవుడు వాటిని అవలోకన చేసుకుంటూ, నీతిగా, నిజాయితీగా, విలువలతో కూడిన జీవితం గడుపుతూ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు. గమ్యాన్ని ముద్దాడవచ్చు. దేవుడు మనందరికీ ఈ కొత్త సంవత్సరంలో సకల శుభాలూ, సంతోషాలు కలుగ జేయాలని, గతం నుండి గుణ పాఠాలు నేర్చుకుంటూ వెలుగులవైపు నడిపించాలని కోరుకుందాం.!

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ముగ్గు ముచ్చట



ఎల్.రమాదేవి
వైరా. ఖమ్మం జిల్లా



21 చుక్కలు
11 వరకు
మధ్య చుక్కలు



బడబాగ్ని సురేఖ
ప్రొద్దుటూరు



16 చుక్కలు
2 వచ్చేవరకు

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
★ అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సినిమా

కొత్త పోస్టర్

నూతన సంవత్సరం (2023) వచ్చింది.
కొత్త పోస్టర్లను తెచ్చింది..
సినీ లవర్స్‌కి ఆనందాన్ని ఇచ్చింది...
ఇక ఆ కొత్త అప్‌డేట్స్‌పై ఓ లుక్కేద్దాం....




• చిరంజీవి

చిరంజీవి హీరోగా బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో హీరో రవితేజ కీలక పాత్ర చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 13న విడుదలకానుంది. న్యూ ఇయర్ సందర్భంగా ఈ చిత్రం నుంచి చిరంజీవి కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. అదేవిధంగా బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వై.రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ మూవీ నుంచి బాలకృష్ణ, శ్రుతీహాసన్ లేటెస్ట్ పోస్టర్‌ని యూనిట్ రిలీజ్ చేసింది. ఈ మూవీలోని 'మాస్ మొగుడు..' అంటూ సాగే పాటని ఈ నెల 3న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.




• బాలకృష్ణ, శ్రుతీహాసన్



• నాగచైతన్య



• అఖిల్



• కల్యాణ్‌రామ్



• రణ్‌బీర్ కపూర్

కాగా నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కస్టడీ'. కృతీశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఒక స్పెషల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. మే 12న ఈ సినిమా విడుదలకానుంది. అలాగే హీరో అఖిల్ నటించిన మూవీ 'ఏజెంట్'. డైరెక్టర్ సురేందర్ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రంలో సాక్షీ వైద్య హీరోయిన్. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 బ్యానర్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సి ఉంది.. అయితే వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. అదేవిధంగా 'బింబిసార' వంటి హిట్ చిత్రం తర్వాత కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఫిబ్రవరి 10న రిలీజ్ చేయనున్నట్లు పేర్కొంటూ కల్యాణ్ రామ్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. కాగా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న హిందీ చిత్రం 'యానిమల్'. రణ్‌బీర్ కపూర్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్నారు. టీ సిరీస్, భద్రకాళీ పిక్చర్స్‌పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం.

వీటితో పాటు మరికొన్ని సినిమాల కొత్త పోస్టర్స్, కొత్త అప్‌డేట్స్‌ని ఇచ్చాయి చిత్రవర్గాలు.

బిజీ ఘోస్ట్



• శివరాజ్‌కుమార్

ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఘోస్ట్'. శ్రీని దర్శకత్వం వహిస్తున్నారు. సందేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై సందేశ్ నాగరాజ్ నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఘోస్ట్' సెకండ్ షెడ్యూల్ ఇటీవల మైసూర్‌లో ముగిసింది. ఈ షెడ్యూల్‌లో శివరాజ్‌కుమార్, జయరాం, ప్రశాంత్ నారాయణన్‌వంటి ప్రధాన తారాగణంపై భారీ జైలు సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. బెంగళూరులో వేసిన మరో భారీ సెట్‌లో ఈ సినిమా మూడో షెడ్యూల్ ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభిస్తాం. ఈ షెడ్యూల్‌లో ఇంట్రవెల్, క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. అచ్యుత్ కుమార్, దత్తన్న, అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: అర్జున్ జన్య, కెమెరా: మహేంద్ర సింహా.

తండ్రీకూతుళ్ల అనుబంధం



• నాని

హీరో నాని కొత్త సంవత్సరం కొత్త సినిమా కబురు చెప్పారు. నాని హీరోగా శౌర్యువ్‌ను దర్శకునిగా పరిచయం చేస్తూ, వైర ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చెరుకూరి వెంకట మోహన్, డా.విజయేందర్‌రెడ్డి, మూర్తి కలగర ఓ సినిమా నిర్మించనున్నారు. ఈ చిత్రంలో 'సీతారామం' ఫేమ్ మృణాళ్ ఠాకూర్ హీరోయిన్. న్యూ ఇయర్ సందర్భంగా ఆదివారం ఈ సినిమా ప్రకటించి, నాని వాయిస్ ఓవర్‌తో ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సినిమా తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని గ్లింప్స్‌ను బట్టి తెలుస్తోంది. నాని కెరీర్‌లో 30వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీకి మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరకర్త. ఈ సినిమాకు కెమెరా: సాను జాన్ వర్గీస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఈవీవీ సతీష్.

2024 వేసవిలో...



• ఎన్టీఆర్

ఎన్టీఆర్ కొత్త సినిమా లేటెస్ట్ అప్‌డేట్ న్యూఇయర్ సందర్భంగా ఆదివారం వెల్లడైంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ ఈ మూవీ నిర్మిస్తున్నారు. కాగా న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఫిబ్రవరిలో స్టార్ట్ చేయనున్నట్లు వెల్లడించారు మేకర్స్. అలాగే 2024 వేసవిలో ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఎన్టీఆర్ కెరీర్‌లో 30వ సినిమాగా రూపుదిద్దుకుంటున్న ఈ మూవీకి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

అందరికీ నచ్చితేనే సమస్య!

ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్

"కొట్లాట అంటేనే కొందరు బోరింగ్‌గా ఫీలవుతారు. కానీ ఫైట్‌ను కూడా ఆడియన్స్ ఎంజాయ్ చేసేలా మేం కంపోజ్ చేయాలి. అందుకే ప్రతి ఫైట్‌కు ఓ కాన్సెప్ట్ ఉండేలా చూసుకుంటుంటాం'' అన్నారు ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్. చిరంజీవి హీరోగా కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన 'వీరసింహారెడ్డి' చిత్రాలు ఈ సంక్రాంతి సందర్భంగా జనవరి 13, జనవరి 12న రిలీజ్ కానున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ రెండు చిత్రాలకు ఫైట్స్ కంపోజ్ చేశారు రామ్-లక్ష్మణ్. హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రామ్-లక్ష్మణ్ చెప్పిన విశేషాలు.

• 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' సినిమాల్లోని హీరోల క్యారెక్టరైజేషన్స్, బాడీ లాంగ్వేజ్, కథ బ్యాక్‌డ్రాప్ పూర్తిగా విభిన్నం. అందువల్ల ఫైట్స్ కంపోజింగ్ విషయంలో మాకు పెద్దగా ఇబ్బందులు కలగలేదు.

• 'వాల్తేరు వీరయ్య'లో లుంగీ కట్టుకుని శ్రీకాకుళం యాస మాట్లాడుతూ అందరితో కలిసి పోయి ఉండే ఓ సాధారణ వ్యక్తి వీరయ్య ఇంట్రవెల్ సమయానికి రెండు గన్స్ తీసుకుని వస్తాడు.. ఇది బాగుంటుంది. ఇటు 'వీరసింహారెడ్డి'లో బాలకృష్ణగారు చైర్‌లో కూర్చొని చేసే ఓ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుంది.

• యాక్షన్‌తో మిళితమై ఉన్న సాంగ్స్ కొన్ని వస్తున్నాయి. ఈ ట్రెండ్ మాకు ఉపయోగమే అనుకుంటున్నాం. రొటీన్ ఫైట్స్ కాకుండా ఇలా చేస్తున్నప్పుడు మాకు కొత్తగా ఉంటుంది. డిఫరెంట్‌గా చేయగలిగాం. 'వాల్తేరు వీరయ్య'లోని ఇంట్రవెల్ సీన్ ఫైట్‌ను దాదాపు 15 రోజులు చిత్రీకరించాం. చిరంజీవి, రవితేజగార్ల మధ్య ఉండే ఓ ఎమోషనల్ డ్రామా కంటతడి పెట్టిస్తుంది. అలాగే 'వీరసింహారెడ్డి' ఇంట్రవెల్ యాక్షన్ సీన్‌ను టర్కీలో షూట్ చేశాం. ఇక్కడ ఉండే ఓ ఎమోషనల్ సీన్ చూసి మాకు కన్నీళ్లు వచ్చాయి. ఆడియన్స్ కూడా ఇదే ఫీలవుతారని నమ్ముతున్నాం.



మేం కంపోజ్ చేసిన ఫైట్స్ నచ్చలేదని మమ్మల్ని తీసేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఏ భగవంతుడూ అందరికీ నచ్చడం లేదు. కొందరు రాముడిని ఆరాధిస్తే, మరికొందరు కృష్ణుణ్ణి ఆరాధిస్తుంటారు. ఇలా విభిన్న రకాల మనస్తత్వాలు ఉంటాయి. మనం మనుషులం. సో.. మనం అందరికీ నచ్చాలని ఏం లేదు. చెప్పాలంటే అందరికీ నచ్చితేనే సమస్య. నచ్చితే ఎక్కువ ఎమోషన్‌ను ఫీల్ అవ్వాల్సి ఉంటుంది. అప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు. మీకు మీరు నచ్చాలి. నాకు నేను నచ్చాలి. అదే అందరికీ సేఫ్. మనం మనకు నచ్చడం ముఖ్యం.

అల్లు అర్జున్ 'అల.. వైకుంఠపురములో..' సినిమా క్లైమాక్స్‌లో ఇలాంటి పాటే ఉంటుంది.

• ఫైట్ కంపోజింగ్ విషయంలో కొన్నిసార్లు డైరెక్టర్, ప్రొడ్యూసర్స్, హీరో సలహాలు తీసుకోవాల్సి వస్తుంది. కథలో ఫైట్‌కు ముందు ఉన్న లీడ్ సీన్స్ కూడా తెలుసుకోవాలి. 'భరత్ అనే నేను' లో మహేశ్‌బాబుగారు యువ ముఖ్యమంత్రిగా చేశారు. యంగ్ సీఎం అంటే జగన్ మోహన్‌రెడ్డిగారిని ఊహించుకుని స్టైలిష్‌గా ఓ ఫైట్‌ను కంపోజ్ చేశాం. కథ, హీరో క్యారెక్టరైజేషన్, బాడీ లాంగ్వేజ్‌ని దృష్టిలో పెట్టుకుని కూడా ఫైట్ కంపోజ్ చేస్తాం.



ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ శుభారంభం చేశాడు. హిసార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన 57 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో హుసాముద్దీన్ 5–0తో బులెన్ బురాగోహైన్ (అస్సాం)పై గెలుపొందాడు. మంగళవారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో లాలామావ్మా (మిజోరం)తో హుసాముద్దీన్ తలపడతాడు. ఈ టోర్నీలో 13 వెయిట్ కేటగిరీలలో కలిపి మొత్తం 386 మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.

సంయుక్తంగా అగ్రస్థానంలో కార్తీక్

జాతీయ సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ 11వ రౌండ్ తర్వాత 8.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో 11వ రౌండ్ గేమ్‌లో కార్తీక్ 41 ఎత్తుల్లో అభిజిత్ గుప్తా (పీఎస్‌పీబీ)పై నెగ్గాడు. ఈ టోర్నీలో మరో రెండు రౌండ్‌లు మిగిలి ఉన్నాయి. అరోణ్యక్ ఘోష్ (రైల్వేస్), కౌస్తవ్ చటర్జీ (బెంగాల్) కూడా 8.5 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నారు.



సర్వ సన్నద్ధం కోసం...

- మళ్లీ యో–యో టెస్టు
- ఆటగాళ్ల ఫిట్‌నెస్‌కు అమిత ప్రాధాన్యం
- బీసీసీఐ ఉన్నతస్థాయి సమావేశం

ముంబై: ఈ ఏడాది స్వదేశంలో జరగనున్న వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా క్రికెటర్ల ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమివ్వాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. ఆదివారం బోర్డు ఉన్నతస్థాయి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆటగాళ్లకు కఠిన పరీక్ష పెట్టే యో–యో ఫిట్‌నెస్ టెస్టును తిరిగి ప్రవేశ పెట్టనున్నారు. ప్రత్యేకించి ఈ ఏడాది వరల్డ్‌కప్‌తో పాటు, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కూడా ఉండటంతో భారత ప్రపంచకప్ సైన్యంపై అదనపు ఒత్తిడి, క్రికెట్ భారం లేకుండా పక్కా ప్రణాళికతో సిరీస్‌లకు ఎంపిక చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు.

● బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో బోర్డు కార్యదర్శి జై షా, భారత కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలక్టర్ చేతన్ శర్మ పాల్గొన్నారు. బిన్నీ మాత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు.

● కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, శిఖర్ ధావన్ ఇలా గత కొంతకాలంగా భారత కెప్టెన్లను మార్చినప్పటికీ పూర్తిస్థాయి సారథిగా రోహిత్ శర్మనే కొనసాగించాలని తీర్మానించారు. తద్వారా సారథ్య మార్పు ఉండదని స్పష్టం చేశారు.

● మెగా టోర్నీ, మేటి జట్లతో సిరీస్‌ల నేపథ్యంలో జట్టు సెలక్షన్ కోసం యో–యో టెస్టు, డెక్సా (ఎముకల పరిపుష్టి పరీక్ష) టెస్టుల్ని నిర్వహిస్తారు. ఎంపికవ్వాలంటే ఈ టెస్టులు పాసవ్వాలి.

● ఎమర్జింగ్ ప్లేయర్లు ఐపీఎల్‌తో పాటు ప్రాధాన్యత గల దేశవాళీ టోర్నీల్లో ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకున్న వారిని జాతీయ జట్టుకు ఎంపిక చేస్తారు.

● ప్రపంచకప్‌కు ఎంపికయ్యే క్రికెటర్లంతా పూర్తి ఫిట్‌నెస్‌తో మెగా ఈవెంట్‌కు అందుబాటులో ఉండేలా చూడటమే ప్రాధాన్య అంశంగా భేటీ జరిగింది. ఆటగాళ్లపై బిజీ షెడ్యూల్ భారం, ఒత్తిడి, మెంటల్ కండిషనింగ్, ఫిట్‌నెస్ అంశాల్ని ఇందులో చర్చించారు.

● మంచి ఆల్‌రౌండర్ అవుతాడనుకున్న దీపక్ చహర్, భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తరచూ గాయాల పాలవడంపై చర్చించిన మీదట ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించారు.

● అవసరమైతే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీలతో కూడా బోర్డు పెద్దలు మాట్లాడతారు. ఈ ఏడాది భారత క్రికెట్‌కు అత్యంత కీలకం కాబట్టి ఆయా ఫ్రాంచైజీలు ఐపీఎల్ టోర్నీ సమయంలో తమ స్టార్ ఆటగాళ్లపై పెనుభారం మోపకుండా చూస్తారు.

● గతంలో కోహ్లి కెప్టెన్సీ హయాంలో యో–యో టెస్టు వార్తల్లో నిలిచింది. అయితే ఇది స్టార్, ఎలైట్ ఆటగాళ్లను కష్టపెట్టడంతో తాత్కాలికంగా యో–యో టెస్టును పక్కన పెట్టారు.

● ఆస్ట్రేలియాలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీఫైనల్ వైఫల్యం దరిమిలా తొలగించిన సెలక్షన్ కమిటీ చైర్మన్ చేతన్ శర్మ ఈ కీలక మీటింగ్‌లో పాల్గొనడం గమనార్హం.

20 మందితో ప్రపంచకప్ సైన్యం...

సొంతగడ్డపై ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లలో జరిగే ప్రపంచకప్ కోసం 20 మందితో కూడిన జాబితాను సిద్ధం చేశారు. మెగా టోర్నీ జరిగేదాకా వీరందరూ కూడా ఒకే టోర్నీలో బరిలోకి దిగరు. రొటేషన్ పద్ధతిలో ఆడతారు. కొందరికి విశ్రాంతి... ఇంకొందరు బరిలోకి అన్నట్లుగా ఈ పద్ధతి సాగుతుంది. గాయాల పాలవకుండా, మితిమీరిన క్రికెట్ భారం పడకుండా ఉండేందుకు బోర్డు ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.



ఏమిటీ 'యో–యో'

రెండు కోన్‌ల (ప్లాస్టిక్ స్తంభాలు) మధ్య బీప్ సౌండ్‌తో పరిగెత్తించే పరీక్షే యో–యో టెస్టు. రెండు కోన్‌ల మధ్య 20 మీటర్ల దూరం ఉంటుంది. మూడు బీప్ సౌండ్‌లు మోగేలోపు ఈ దూరాన్ని పూర్తి చేయాలి. అంటే మొదటి బీప్‌నకు ఇక్కడి కోన్ నుంచి పరుగు ప్రారంభించి... రెండో బీప్ సౌండ్‌లోపు అవతలి కోన్‌కు చేరాలి. మూడో బీప్ మోగే సరికి ఇవతలి కోన్ చేరాలి. దీనికి స్కోరు ఉంటుంది. అంటే నిర్ణీత సమయంలోపు పూర్తి చేస్తే మెరుగైన స్కోరు, ఆ తర్వాత సగటు స్కోరు ఇస్తారు. అసాధారణ ఫిట్‌నెస్‌తో ఉండే కోహ్లి యో–యో టెస్టు పాసైనప్పటికీ టాప్–5 స్కోరర్స్‌లో లేడు. అతను 19 స్కోరు చేసి 8వ స్థానంలో ఉన్నాడు. గతంలో షమీ, సంజూ సామ్సన్, రాయుడు, రైనా, పృథ్వీ షా, వాషింగ్టన్ సుందర్ యో–యో టెస్టులో ఫెయిలయ్యారు.

టాప్–5 యో–యో స్కోర్లు

1. షాన్ మసూద్ (పాక్) 22.1
2. బెయిర్‌స్టో (ఇంగ్లండ్) 21.8
3. మయాంక్ డాగర్ (భారత్) 19.3
4. బెత్ లాంగస్టన్ (ఇంగ్లండ్) 19.2
5. రిజ్వాన్ (పాక్) 19.2

పంత్‌ను పరామర్శించిన ఉత్తరాఖండ్ సీఎం

డెహ్రాడూన్: కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భారత క్రికెటర్ రిషభ్ పంత్‌ను ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదివారం పరామర్శించారు. ప్రస్తుతం పంత్ డెహ్రాడూన్‌లోని మాక్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆసుపత్రిలో పంత్ వెంట తల్లి సరోజ్, సోదరి సాక్షి ఉన్నారు. ఈ సందర్భంగా పంత్‌కు లభిస్తున్న చికిత్స గురించి సీఎం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పంత్‌కు అత్యున్నత వైద్య చికిత్స అందిస్తామని, అతని చికిత్సకయ్యే ఖర్చులన్నీ తమ ప్రభుత్వం భరిస్తుందని ఈ సందర్భంగా పుష్కర్ సింగ్ తెలిపారు.



రిషభ్ పంత్ తల్లి సరోజ్, సోదరి సాక్షిలతో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి

ఆ ఇద్దరికి సత్కారం...

శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ఉత్తరాఖండ్‌లోని తన స్వస్థలం రూర్కీకి వెళుతుండగా పంత్ కారు ప్రమాదానికి గురైంది. రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే యత్నంలో పంత్ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. క్షణాల్లో అతని కారులో మంటలు చెలరేగాయి. అదే దారిలో వెళుతున్న హరియాణా రోడ్‌వేస్‌కు చెందిన బస్సు డ్రైవర్ సుశీల్ కుమార్, కండక్టర్ పరమ్‌జీత్ వెంటనే అటువైపు వెళ్లి కారులో చిక్కుకున్న పంత్‌ను బయటకు తీసుకొచ్చారు. ఇప్పటికే హరియాణా ప్రభుత్వం సుశీల్, పరమ్‌జీత్‌లను సన్మానించగా... ఈనెల 26న గణతంత్ర దినోత్సవం రోజున తమ ప్రభుత్వం కూడా సుశీల్, పరమ్‌జీత్‌లను సత్కరిస్తుందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ప్రకటించారు. గుంతను తప్పించబోయి ప్రమాదానికి గురైనట్లు పంత్ తమతో చెప్పాడని ఢిల్లీ క్రికెట్ సంఘం అధికారులు వివరించడంతో ఢిల్లీ–డెహ్రాడూన్ హైవే రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

మెయిన్ 'డ్రా'కు రామ్‌కుమార్

నేటి నుంచి టాటా ఓపెన్ ఏటీపీ టోర్నీ

పుణే: భారత్‌లో జరిగే ఏకైక అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)–250 టోర్నీ టాటా ఓపెన్‌లో భారత మూడో ర్యాంకర్ రామ్‌కుమార్ రామనాథన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 432వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6–3, 7–5తో ప్రపంచ 153వ ర్యాంకర్ మతియా బెలూచి (ఇటలీ)పై సంచలన విజయం సాధించాడు. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏకంగా 14 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను ఏడుసార్లు కాపాడుకున్న రామ్‌కుమార్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 62వ ర్యాంకర్ పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)తో రామ్‌కుమార్ తలపడతాడు. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ మాత్రం మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో యూకీ 1–6, 4–6తో ఇలియాస్ ఈమర్ (స్వీడన్) చేతిలో ఓడిపోయాడు. నేటి నుంచి మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు మొదలవుతాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 'వైల్డ్ కార్డు' పొందిన భారత టీనేజర్, 15 ఏళ్ల మానస్‌తో మైకేల్ మో (అమెరికా); సుమిత్ నగాల్ (భారత్)తో క్రయినోవిచ్ (సెర్బియా) తలపడతారు. 6,42,735 డాలర్ల (రూ. 53 కోట్లు) ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో సింగిల్స్ విజేతకు 97,760 డాలర్లు (రూ. 80 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.



సెలెక్షన్ ట్రయల్స్‌కు సైనా దూరం

నేడు ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ కోసం భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ఎంపిక చేసేందుకు ఈరోజు సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ర్యాంకింగ్ ఆధారంగా మహిళల సింగిల్స్‌లో పీవీ సింధును నేరుగా జట్టులో ఎంపిక చేయగా... రెండో బెర్త్ కోసం సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోద్‌లను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) సెలెక్షన్ ట్రయల్స్‌కు ఆహ్వానించింది. అయితే తాము సెలెక్షన్ ట్రయల్స్‌కు హాజరు కాలేమని సైనా, మాళవిక 'బాయ్'కు సమాచారం ఇచ్చారు. సైనా, మాళవిక వైదొలిగిన నేపథ్యంలో ఈ ట్రయల్స్‌కు అష్మిత చాలియాను 'బాయ్' ఎంపిక చేసింది. అష్మిత, ఆకర్షి మధ్య జరిగే ట్రయల్స్ మ్యాచ్‌లో గెలిచిన వారికి జట్టులో రెండో సింగిల్స్ ప్లేయర్‌గా స్థానం లభిస్తుంది. 32 ఏళ్ల సైనా గత ఏడాది 14 అంతర్జాతీయ టోర్నీలలో పాల్గొని ఒక్క దాంట్లోనూ క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయింది. ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి 14 మంది బరిలోకి దిగనున్నారు. ర్యాంకింగ్ ఆధారంగా పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టిలను నేరుగా జట్టులోకి ఎంపిక చేశారు. మిగతా బెర్త్‌ల కోసం నేడు ట్రయల్స్‌ను ఏర్పాటు చేశారు.



విద్య, ఉద్యోగ సమాచారం

సీఆర్‌పీఎఫ్‌లో 1458 ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్), హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్).. పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1458
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(స్టెనోగ్రాఫర్)–143, హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్)–1315.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/విశ్వవిద్యాలయం నుంచి ఇంటర్మీడియట్(10+2) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. పురుషులు 165సెం.మీ., మహిళలు 155 సెం.మీ. ఎత్తు కలిగి ఉండాలి.
» **వయసు:** 25.01.2023 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఏఎస్సై పోస్టులకు రూ.29,200 నుంచి రూ.92,300, హెచ్‌సీ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, డిటైల్డ్ మెడికల్ టెస్ట్, రివ్యూ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. హిందీ/ఇంగ్లిష్ భాష,జనరల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. 90 నిమిషాల వ్యవధి ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.01.2023
» **సీబీటీ అడ్మిట్ కార్డ్ విడుదల:** 15.02.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు:** 22.02.2023 నుంచి 28.02.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.crpf.gov.in

టీఎస్‌పీఎస్సీలో 148 వ్యవసాయ అధికారి పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖలో వ్యవసాయ అధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 148(మల్టీ జోన్1–100, మల్టీ జోన్2–48).
» **అర్హత:** బీఎస్సీ అగ్రికల్చర్/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.51,320 నుంచి రూ.1,27,310 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023
» **పరీక్ష తేది:** ఏప్రిల్–2023.
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

టీఎస్‌పీఎస్సీలో 128 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. తెలంగాణ రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనరేట్ల పరిధిలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 128

పోస్టుల వివరాలు

» సాంకేతిక విద్యలో ఫిజికల్ డైరెక్టర్–37(మల్టీ జోన్1–18, మల్టీ జోన్2–19)
» ఇంటర్మీడియట్ విద్యలో ఫిజికల్ డైరెక్టర్–91(మల్టీ జోన్1–55, మల్టీ జోన్2–36).
» **అర్హత:** పోస్టును అనుసరించి మంచి అకడమిక్ రికార్డుతో ఎంపీఈడీ(ఫిజికల్ ఎడ్యుకేషన్/ఫిజికల్ ఎడ్యుకేషన్ సైన్స్), నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు పీడీ(టెక్నికల్ ఎడ్యుకేషన్)–లెవల్ 9ఎ–రూ.56,100, లెవల్ 10–రూ.57,700, పీడీ(ఇంటర్మీడియట్ విద్య) –రూ.54,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 06.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 27.01.2023
» **పరీక్ష తేది:** ఏప్రిల్–2023
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో పీడియాట్రీషియన్ పోస్టులు

నెల్లూరు జిల్లా డీఎంహెచ్‌వో ఆత్మకూరులోని మెడిసిన్ హబ్, డీఈఐసీలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** పీడియాట్రీషియన్–02, జనరల్ ఫిజిషియన్–01.
» **అర్హత:** ఎంబీబీఎస్, ఎండీ(పీడియాట్రిక్స్/జనరల్ మెడిసిన్), డిప్లొమా(చైల్డ్ హెల్త్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నెల్లూరు జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.01.2023.
» **వెబ్‌సైట్:** spsnellore.ap.gov.in

ఇంటర్‌తోనే.. డిగ్రీ+కొలువు

» నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ(1)–2023
» 395 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» ఎంపికైతే త్రివిధ దళాల్లో కొలువుతోపాటు డిగ్రీ ఖాయం
» శిక్షణ సమయంలోనే నెలకు రూ.56వేల స్టయిఫండ్

ఉద్యోగంతోపాటు బీఏ, బీటెక్ డిగ్రీ పట్టా కూడా అందుకునేందుకు మార్గం.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించే.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్!! ఇంటర్మీడియెట్ అర్హతతో ఈ పరీక్షలో విజయం సాధించి.. త్రివిధ దళాల్లో శిక్షణకు ఎంపికైతే..నెలకు రూ.56వేల స్టయిఫండ్ అందుకోవచ్చు. శిక్షణ పూర్తయ్యాక పర్మనెంట్ కమిషన్ ర్యాంకు హోదాతో కొలువుతోపాటు బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్ కూడా సొంతమవుతుంది. తాజాగా ఎన్‌డీఏ, ఎన్ఏ(1)-2023కి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ, ఎన్ఏ(1)-2023 వివరాలు, భర్తీ చేసే పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలతో సమగ్ర కథనం...

ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షలో విజయం సాధించి.. ఆ తర్వాత మిలిటరీ అకాడమీ, నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు వేర్వేరుగా నిర్వహించే ఎస్ఎస్‌బీ ప్రక్రియలోనూ నెగ్గి తుది విజేతలుగా నిలిస్తే.. అభ్యర్థులు ఎంచుకున్న విభాగంలో పర్మనెంట్ కమిషన్ హోదాతో కొలువు ఖాయమైనట్లే! యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షను నిర్వహిస్తుంది.

మొత్తం పోస్టుల సంఖ్య 395

- ఎన్‌డీఏ,ఎన్ఏ(1)–2023 ఎంపిక ప్రక్రియ ద్వారా.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో మొత్తం 395 ఖాళీలను భర్తీ చేయనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో భాగంగానే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు వేర్వేరుగా ఖాళీలను ప్రకటించారు. ఆర్మీ విభాగం–208 ఖాళీలు, నేవీ–42, ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ విభాగం–92, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్) –18, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)లో–10 ఖాళీలు ఉన్నాయి.
- నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)లో–25(పురుష అభ్యర్థులకు మాత్రమే) ఖాళీలు ప్రకటించారు.

వేతనం

- శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ లభిస్తుంది. శిక్షణ పూర్తి చేసుకొని సర్వీసులో చేరిన వారికి పే లెవల్ 10తో రూ.56,100 –1,77,500 వేతన శ్రేణి అందుతుంది.

అర్హతలు

- **ఆర్మీ వింగ్:** ఏ గ్రూప్‌లోనైనా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 24 డిసెంబర్ 2023 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.



ఎన్‌డీఏ,ఎన్ఏ(1)-2023

- **వయసు:** జూలై 2, 2004–జూలై 1, 2007 మధ్య జన్మించి ఉండాలి.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

ఎన్‌డీఏ, ఎన్ఏకు రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అవి..రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలి దశలో యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు దక్కిన వారికి తదుపరి దశలో సదరు విభాగాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎస్ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి. వీటిలోనూ ఉత్తీర్ణత సాధిస్తే త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో శిక్షణ ఖరారవుతుంది.

శిక్షణ, డిగ్రీ సర్టిఫికెట్

- ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణ ఉంటుంది.
- ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ పుణెలో, నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణనిస్తారు.
- అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న విభాగాలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది.
- శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు కూడా అందజేస్తారు. అంటే.. ఒకే సమయంలో కొలువు, ఉన్నత విద్య రెండింటినీ సొంతం చేసుకునే అవకాశం ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష ద్వారా లభిస్తుంది.

మూడేళ్ల శిక్షణ

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ–పుణెలో మూడేళ్లపాటు శిక్షణ ఉంటుంది. మొదటి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు కామన్‌గా శిక్షణ ఇస్తారు. చివరి ఆరు నెలలు మాత్రం అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రైనింగ్ ఉంటుంది. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న కోర్సు ఆధారంగా జేఎన్‌యూ–ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు.
- ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలను ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు అవకాశం ఉంటుంది. వీరు ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాలి.

నేవల్ అకాడమీ.. ప్రత్యేక శిక్షణ

ఎన్ఏ, 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ(ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

తొలి దశ.. రాత పరీక్ష

- ఎన్‌డీఏ,ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో మొత్తం 900 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్ 1 మ్యాథమెటిక్స్ 300 మార్కులకు,పేపర్ 2 జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటాయి. ప్రతి పేపర్ పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది.
- పేపర్–2గా నిర్వహించే జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో.. పార్ట్–ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగం పేరుతో పార్ట్–బిని నిర్వహిస్తారు. పార్ట్–బికి 400 మార్కులుంటాయి.

పార్ట్-బి.. ఆరు విభాగాలు

- పేపర్–2 పార్ట్ బీని 400 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో మొత్తం ఆరు విభాగాలు(ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ ఈవెంట్స్) నుంచి ప్రశ్నలడుగుతారు. ప్రతి విభాగానికి సంబంధించి నిర్దిష్టంగా వెయిటేజీని పేర్కొన్నారు. ఫిజిక్స్‌కు 25 శాతం, కెమిస్ట్రీకి 15 శాతం, జనరల్ సైన్స్‌కు 10 శాతం, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమానికి 20 శాతం, జాగ్రఫీకి 20 శాతం, కరెంట్ ఈవెంట్స్‌కు పది శాతం వెయిటేజీ కల్పించారు. ఈ వెయిటేజీ ప్రకారమే ఆయా విభాగాల్లో ప్రశ్నల సంఖ్య, మార్కులు ఉంటాయి.
- పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే పేపర్–1, పేపర్–2లలో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ఇలా

- ఎన్‌డీఏ, ఎన్ఏ రాత పరీక్షలో విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు మలి దశలో మరో 900 మార్కులకు ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న సమయంలో పేర్కొన్న ప్రాథామ్యతలు, రాత పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా.. నిర్దేశిత విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీ (సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్) నిర్వహించే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌లోనూ నెగ్గాల్సి ఉంటుంది.
- ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు.. ఎస్ఎస్‌బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లో కూడా విజయం సాధించాల్సి ఉంటుంది.
- ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల మానసిక, శారీరక దృఢత్వాన్ని పరిశీలిస్తారు. ఇంటెలిజెన్స్ టెస్ట్, వెర్బల్ టెస్ట్, నాన్ వెర్బల్ టెస్ట్, సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, తార్కిక విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షిస్తారు. అదే విధంగా పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇలా మొత్తం అయిదు రోజులపాటు ఈ ప్రక్రియ సాగుతుంది. ఇందులోనూ తుది జాబితాలో నిలిచిన వారికి ప్రాథమికంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ–పుణె, నేవల్ అకాడమీ(ఎజిమల)లో శిక్షణ ఉంటుంది.

విజయం సాధించాలంటే

- పేపర్–1లో మంచి మార్కులు సాధించేందుకు అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా మేలు చేస్తుంది. బేసిక్ ప్రిన్సిపుల్స్, వివిధ సిద్ధాంతాలు, సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- పేపర్–2లో బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి..ఫిజిక్స్,కెమిస్ట్రీ, జనరల్ సైన్స్,చరిత్ర–భారత స్వాతంత్ర్యోద్యమం,జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌లను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 10, 2023
- **ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 16, 2023
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
293	86
60,841	18,105

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	10,466	▽	12
డోజోన్స్	33,147	▽	74
ఎఫ్‌టీఎస్ఈ 100	7,452	▽	61
డాక్స్	13,924	▽	148
షాంఘై	3,089	△	16
నికాయ్	26,094	△	1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.01	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.80	89.89
€	యూరో	ఒకటి	98.24	101.53
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.47	63.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.02	57.42
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.65	62.60
SAR	సౌదీ రియాల్	కాయనకుక	20.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	కాయనకుక	21.62	23.42
¥	చైనా యువాన్	కాయనకుక	10.86	12.86

ఉన్నట్టుండి ఉద్యోగం పోతే..?



- ముందుగానే సన్నద్ధమై ఉండాలి
- ఆరు నెలలు, ఏడాది అవసరాలకు సరిపడా నిధి
- పొదుపు లేకుంటే తాత్కాలికంగా రుణ మార్గం
- జాబ్ లాస్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు
- సొంతంగా హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉండాలి
- ఈఎంఐలు, బీమా ప్రీమియం చెల్లింపులు ఆగకూడదు

ఆర్థిక మాంద్యం భయాలు మరో విడత కంపెనీలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రపంచంలోనే దిగ్గజ సంస్థలుగా పిలుచుకునే గూగుల్, ఫేస్ బుక్, అమెజాన్ అనే కాదు.. చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు ఐటీ, ఇతర రంగాల్లోని కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. భారత్‌లో అమెజాన్, ట్విట్టర్ ఇప్పటికే కొంత మంది ఉద్యోగులను ఇంటికి పంపించేశాయి. ప్రైవేటు రంగంలో ఉద్యోగానికి భద్రత తక్కువే. పని చేయించుకునే సంస్థలు, ప్రతికూల పరిస్థితుల్లో నిర్దాక్షిణ్యంగా సాగనంపుతాయి. కనుక ఎవరికి వారు తమవంతుగా భద్రత కల్పించుకోవాల్సిందే. ఉద్యోగం కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురైతే ఎలా నెగ్గుకురావాలో ప్రణాళిక ఉండాలి. అందుకు ముందు నుంచే సన్నద్ధమై, దానికంటూ ఓ బడ్జెట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నిశ్చింతగా ఉండగలరు. ఉపాధి కోల్పోయినప్పుడు మన ముందున్న మార్గాలేంటి? ముందస్తు సన్నాహాలేంటన్నది తెలియజేసే కథనమే ఇది.

వ్యయాలపై నియంత్రణ

కనీసం మీ వద్ద 3-4 నెలల అవసరాలు, రుణ ఈఎంఐల చెల్లింపులకు సరిపడా ఉంటే ఏమాత్రం ఆందోళన అక్కర్లేదు. అప్పుడు ఉన్న వనరులను జాగ్రత్తగా వినియోగించుకునే ప్రణాళిక ఉంటే సరిపోతుంది. అంత మేర లేకపోతే అప్పుడు ప్రత్యామ్నాయాలను చూడాలి. మన ఆర్జన ఆగినా, రుణానికి చెల్లింపులు చేస్తూనే ఉండాలి. నెలవారీ ఇంటి అద్దె, మొబైల్, డిష్ బిల్లుల విషయంలో రాజీపడలేరు. కనుక ఇతర వ్యయాలపై నియంత్రణ ఒక్కటే మార్గం. అందుబాటులో ఉన్న వనరులు ఎన్ని, దాంతో ఎన్ని నెలలు నెట్టుకురావచ్చన్న అంచనాకు రావాలి. బయట రెస్టారెంట్లలో తినడాలు, పర్యటనలు, సెలవుల్లో ఊర్లకు వెళ్లడాన్ని వాయిదా వేసుకోవాలి. వ్యక్తిగత వాహనాన్ని ఇంట్లోనే పెట్టేసి ప్రజా రవాణాను వినియోగించుకోవచ్చు. వారాంతపు పార్టీలకు విరామం పలకాలి. సినిమాల కోసం థియేటర్లకు వెళ్లడం మానేయాలి. మరీ కష్టంగా ఉంటే పెట్టుబడులను సైతం నిలిపివేసుకోక తప్పదు.

వీటిని మిస్ కాకూడదు

కష్టకాలంలో రుణ ఈఎంఐలను చెల్లించకపోతే, అది వ్యక్తిగత రుణ చరిత్రలో పెద్ద మచ్చగా మిగిలిపోతుంది. భవిష్యత్తులో రుణం లభించడం కష్టంగా మారుతుంది. ఒకవేళ వచ్చినా, అధిక రుణ రేటును చెల్లించాల్సి రావచ్చు. అందుకుని ఈఎంఐ చెల్లింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపివేయకూడదు. అలాగే, బీమా పాలసీల ప్రీమియం చెల్లింపుల్లోనూ విఫలం కావద్దు. ఒకవేళ పెట్టుబడులకు సంబంధించి ఆటోడెబిట్ ఇన్‌స్ట్రక్షన్ ఇచ్చి ఉంటే వాటిని వెంటనే నిలిపివేయడం సరైనది.

ఇదీ ఒక అవకాశమే

ఉపాధి లేనప్పుడు చేతిలో బోలెడంత సమయం ఉంటుంది. దీన్ని ఒక అవకాశంగా తీసుకుని, తమ నైపుణ్యాలను మరింత పెంచుకునే మార్గాలను చూడొచ్చు. దీనివల్ల భవిష్యత్తులో మరింత వేతనంతో కూడిన అవకాశాలను సొంతం చేసుకోవడమే కాకుండా, ఇతరులతో పోలిస్తే మెరుగైన వృద్ధిని చూడగలరు. ఆర్జన ఆగిందని చెప్పి, ఆందోళనతో ఉండిపోకూడదు. అవకాశాలను వెతుక్కోవాలి. అప్పటి వరకు తాము పనిచేస్తున్న రంగంలోని పని పరిస్థితులు నచ్చని వారికి.. ఉద్యోగం కోల్పోయినప్పుడు ఇతర నైపుణ్యాలతో వేరే రంగంలోని ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవచ్చు.

పెట్టుబడుల ఉపసంహరణ - రుణ మార్గం

ఉద్యోగం పోయిందని చెప్పి కంగారుగా పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసుకోవద్దు. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు ముందుగా రెండు నెలల అవసరాలకు సరిపడా వెనక్కి తీసుకోవాలి. బ్యాంకులో ఎఫ్‌డీ ఉంటే దాన్ని రద్దు చేసుకోవడం తప్పేమీ కాదు. ఆర్జన ఉండి, నెలవారీ చెల్లింపులు చేయగలిగినప్పుడే రుణాలు తీసుకోవడం సరైనది అవుతుంది. ఆర్జన నిలిచిపోయిన సమయాల్లో కొత్తగా రుణం తీసుకోకుండా ఉండడమే మెరుగైన మార్గం అవుతుంది. కానీ, పొదుపు లేనప్పుడు, మరో మార్గం లేకపోతే చివరిగా రుణాన్ని తీసుకోవడాన్ని పరిశీలించొచ్చు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో బంగారంపై తక్కువ వడ్డీకే రుణం లభిస్తుంది. దీనిపై నెలవారీగా వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. వీటి గడువు ఏడాది, రెండేళ్లు ఉంటుంది. గడువు ముగిసిన రోజున అసలు చెల్లించడం లేదంటే తిరిగి అంతే కాలానికి రెన్యువల్ చేసుకోవచ్చు. జీవిత బీమా పాలసీపైనా రుణ సదుపాయం పొందొచ్చు. దీనిపైనా వడ్డీ రేటు తక్కువే. ఒక నెలపాటు ఉపాధి లేని వారు ఈపీఎఫ్ నిధి నుంచి 75 శాతాన్ని ఉపసంహరించుకోవచ్చు. తిరిగి ఉద్యోగం లభించిన తర్వాత పాత ఖాతాను కొత్త సంస్థకు బదిలీ చేసుకోవాల్సి ఉంటుంది. పాత నిబంధనల ప్రకారం అయితే రెండు నెలల పాటు ఉపాధి లేకుండా ఉంటే ఈపీఎఫ్ నిధి నుంచి మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పించే వారు. అందుబాటులోని మార్గాల్లో తమకు ఏది అనుకూలమైనదో నిర్ణయించుకుని ముందుకు వెళ్లాలి.

అత్యవసర నిధి

ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత ఉండదు. ఊహించని విధంగా ఎప్పుడైనా ఉద్యోగం కోల్పోయినా.. లేదా నచ్చక మానేసినా అత్యవసర నిధి ఆదుకుంటుంది. కనీసం ఆరు నెలల నుంచి ఏడాది అవసరాలకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలని ఆర్థిక సలహాదారులు తరచూ సూచించేది ముందు చూపుతోనే. దీన్ని ఆచరణలో పెట్టిన వారు నిశ్చింతగా ఉండొచ్చు. ప్రతికూల పరిస్థితులను సులభంగా అధిగమించొచ్చు. అత్యవసర నిధిని లిక్విడ్ ఫండ్స్ లేదంటే బ్యాంకు ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అత్యవసర నిధి ఆరు నెలలు లేదా ఏడాది అవసరాలకు సరిపడా ఉండాలన్నది కేవలం ఒక సాధారణ సూత్రమే. ఆర్థిక బాధ్యతలు అందరికీ ఒకే విధంగా ఉండవు. ఎంత కాలం అవసరాలకు సరిపడా సమకూర్చుకోవాలన్నది వ్యక్తిగత ఆర్థిక పరిస్థితులను బట్టే ఆధారపడి ఉంటుంది. ఉద్యోగం కోల్పోయిన సమయంలో అత్యవసర నిధిని వివేకంగా ఖర్చు చేయడం కూడా అవసరం. ఎందుకంటే తిరిగి మళ్లీ ఉద్యోగం సంపాదించి, కుదురుకోవడానికి ఎంత కాలం పడుతుందో చెప్పలేం. ఇలా ఖర్చు చేసిన మేర, తిరిగి ఉద్యోగం పొందిన తర్వాత సమకూర్చుకోవడం అంతే ముఖ్యం.

బీమా రక్షణ అవసరం

జాబ్ లాస్ ఇన్సూరెన్స్ అంటూ ఒకటి ఉందని మెజారిటీ ఉద్యోగులకు తెలియని విషయం. కేవలం కొన్ని కంపెనీలే వీటిని ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో చాలా పరిమితులు ఉంటాయి. రుణ చెల్లింపుల బాధ్యతలు ఎక్కువగా ఉన్న వారికి ఇవి అనుకూలం. ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన సందర్భాల్లో మూడు నెలల ఈఎంఐలకు సరిపడా చెల్లింపులు చేస్తాయి. ఇలా చెల్లించే మొత్తం అప్పటి వరకు పొందిన నెలవారీ వేతనంలో 50 శాతం మించకుండా ఉంటుంది. ఈ పాలసీ వార్షిక ప్రీమియం తాము పొందే వేతనంలో 5 శాతంలోపు ఉంటేనే తీసుకోవాలి. అంతకు మించి ప్రీమియం ఉంటే అది లాభదాయకం కాదు. ఇతర పాలసీలకు అనుబంధంగాం వీటిని బీమా కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. ప్రమాదం కారణంగా శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి గురై ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిన సందర్భాల్లోనూ ఇవి చెల్లింపులు చేస్తాయి.

ఈ విషయంలో జాగ్రత్త

జాబ్ లాస్ ఇన్సూరెన్స్‌లో ఉన్న ప్రధాన ప్రతిబంధకం.. కంపెనీ తొలగించిన సందర్భాల్లోనే వీటి కింద పరిహారం లభిస్తుంది. ఈ ప్లాన్లు ఆదరణకు నోచుకోకపోవడానికి ఇదే ముఖ్య కారణమని చెప్పుకోవాలి. కానీ, స్వచ్ఛందంగా ఉద్యోగం మానేసే వారు ముందుగానే సన్నద్ధమై ఆ పనిచేయవచ్చు. ఉన్నట్టుండి కంపెనీ తొలగించినప్పుడే కదా బీమా అవసరం ఏర్పడేది. మురో ముఖ్యమైన అంశం.. పనితీరు బాగాలేదని చెప్పి తొలగించినట్టయితే పరిహారానికి అర్హత లభించదు. కంపెనీల మధ్య విలీనం, కొనుగోలు కారణంగా తప్పించినప్పుడు కూడా బీమా కంపెనీలు పరిహారాన్ని తిరస్కరిస్తున్నాయి. పాలసీ తీసుకునే ముందు షరతులు, నియమ, నిబంధనలు, మినహాయింపులు అన్నీ చదివి తెలుసుకోవాలి. కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించిందనే దానికి ఆధారంగా ఎలాంటి డాక్యుమెంట్ లేకపోయినా,



పరిహారం లభిస్తుందా? అన్నది కనుక్కోవాలి. కాంట్రాక్టు ఉద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వారికి ఈ పాలసీలు ఇవ్వరు. ఆయా అంశాల్లో నిపుణుల సూచనలు అవసరం.

ఈఎస్ఐసీ బీమా..

సంఘటిత రంగంలో పనిచేస్తూ, ఈఎస్ఐసీ కిందకు వచ్చే వారికి రాజీవ్ గాంధీ శ్రామిక్ కల్యాణ్ యోజన (ఆర్‌జీఎస్‌కేవై) పథకం ఒకటి ఉంది. దీని కింద ఉపాధిని కోల్పోయిన వారికి రెండేళ్ల పాటు పరిహారం లభిస్తుంది. అప్పటి వరకు పొందిన వేతనంలో 50 శాతం ఏడాది పాటు, 13వ నెల నుంచి 24వ నెల వరకు 25 శాతం చొప్పున చెల్లిస్తారు. అదే కాలంలో ఈఎస్ఐ హాస్పిటల్స్, డిస్పెన్సరీల్లో ఉచిత వైద్య సదుపాయాలు కూడా లభిస్తాయి. తన తప్పిదం లేకుండా ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన వారు 30 రోజుల్లోపు దీనికి దరఖాస్తు చేసుకోవాలి. రూ.21వేల వేతనంలోపు వారికే ఈఎస్ఐ సదుపాయం పరిమితం. ఇంతకుమించి వేతనం ఉన్న వారు ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిందే.

ఆదాయ మార్గాలు

ఉద్యోగం కోల్పోయినప్పుడు సహజంగా తిరిగి ఉపాధి కోసం అన్వేషణ మొదల పెడుతుంటారు. మరో ఉపాధి లభించేంత వరకు రోజులు వృథా కాకుండా, తాత్కాలిక పనిలో అయినా కుదరడం మంచి నిర్ణయం అవుతుంది. దీనివల్ల కుటుంబ వ్యయాలకు ఎంతో కొంత సమకూర్చుకోవచ్చు. ఈ కామర్స్, రిటైల్ రంగంలో తాత్కాలిక ఉపాధి అవకాశాలను పొందొచ్చు. నైపుణ్యాలు ఉండి, తక్కువ వేతనానికి పనిచేస్తానంటే ఆర్థిక సంక్షోభ సమయాల్లో కొన్ని కంపెనీలు ఉపాధి కల్పిస్తుంటాయి. అలాంటివి మార్గాలను అన్వేషించొచ్చు. తక్కువ వేతనానికి ఎందుకు చేరాలి? మంచి ఉద్యోగమే చూసుకుందాం! అని కాకుండా, మంచి ఉద్యోగ ఆఫర్‌ను గుర్తించేంత వరకు ఇలాంటి సంస్థల్లో చేరిపోవచ్చు. తమ నైపుణ్యాలకు అనుగుణంగా ఏదో ఒక తాత్కాలిక ఉపాధి పొందడం నేడు అంత కష్టమైన పనికాదు.

హెల్త్ ఇన్సూరెన్స్

ముందే అనుకున్నట్టు ప్రైవేటు రంగంలో ఎప్పుడైనా ఉద్యోగం పోవచ్చు. మెరుగైన వేతనం, పని పరిస్థితుల కోసం సంస్థను మార్చొచ్చు. ఇలా తరచూ కంపెనీలను మార్చే వారికి ఆయా సంస్థలు అందించే గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌పైనే ఆధారపడడం అంత సురక్షితం అనిపించుకోదు. సంస్థను బట్టి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలు, కవరేజీ భిన్నంగా ఉంటాయి. కొన్ని సంస్థలు అసలు హెల్త్ ఇన్సూరెన్స్‌నే ఆఫర్ చేయడం లేదు. ఒక ఉద్యోగి వ్యక్తిగత ఆరోగ్య అవసరాల గురించి కంపెనీలకు అవగాహన ఉండదు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా దీర్ఘకాల వ్యాధులు, జీవనశైలి వ్యాధులు ఉండొచ్చు. లేదంటే తమ కుటుంబంలో ఈ విధమైన వ్యాధుల చరిత్ర ఉండొచ్చు. అలాంటి వారి హెల్త్ ఇన్సూరెన్స్ అవసరాలు ఇతరులతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. కనుక కంపెనీలు అందించే గ్రూప్ హెల్త్ ప్లాన్‌తో సంబంధం లేకుండా.. ప్రతి ఉద్యోగి అవివాహితులు అయితే ఇండివిడ్యువల్, పెళ్లయిన వారు ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకోవాలి. ఇలా తీసుకునే ప్లాన్ తమ అవసరాలు అన్నింటినీ తీర్చే విధంగా జాగ్రత్తపడాలి.

ఫీనిక్స్ మిల్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,412 టార్గెట్: రూ. 1,638

ఎందుకంటే: 2022 నవంబర్‌లో మాల్స్ లైక్ టు లైక్(ఎల్‌టీఎల్) వినియోగం రూ. 630 కోట్లుగా నమోదైంది. 2019 నవంబర్‌తో పోల్చి చూస్తే ఇది 119 శాతం అధికం. అయితే 2022 అక్టోబర్‌లో నమోదైన 18 శాతం ఎల్‌టీఎల్ వృద్ధితో పోలిస్తే తక్కువే. ఇక 2022-23లో ఇప్పటివరకూ అంటే ఏప్రిల్ నుంచి నవంబర్‌వరకూ ఎల్‌టీఎల్ వినియోగం 115 శాతం ఎగసింది. 2019 ఏడాది తొలి 8 నెలల్లో పోలిస్తే ఇంత వృద్ధి నమోదైంది. ఈ ఏడాది తొలి 8 నెలల్లో అద్దె ఆదాయం రూ. 1,370 కోట్లను తాకింది. కాగా.. ఇండోర్(మధ్యప్రదేశ్)లోని ఫీనిక్స్ సిటాడెల్ మాల్ డిసెంబర్ 1న ప్రారంభమైంది. ఈ మాల్‌లో 88 శాతాన్ని లీజుకిచ్చింది. 2023 జనవరిలో ప్రారంభంకానున్న అహ్మదాబాద్ మాల్ అయితే దాదాపు పూర్తిస్థాయిలో లీజు బుక్ అయ్యింది. ఈ బాటలో 2024కల్లా పుణే(వాకడ్), బెంగళూరు(హెబ్బల్) మాల్స్ వినియోగంలోకి రానున్నాయి. వెరసి 2020-25 మధ్య కాలంలో అద్దె ఆదాయం వార్షిక ప్రాతిపదికన 17 శాతం పురోగమించనున్నట్లు అంచనా. ఈ ఆర్థిక సంవత్సరం (2022-23) తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్-సెప్టెంబర్) అన్ని విభాగాల వినియోగం ఊపందుకోవడంతో సీఏఎం మినహా రిటైల్ అద్దె ఆదాయం రూ. 640 కోట్లకు చేరింది. 2025-26కల్లా ఫీనిక్స్ మిల్స్ 13 మిలియన్ చదరపు అడుగుల మాల్ స్పేస్‌ను అందుకోనుంది. ప్రస్తుతం ఇది 6.9 ఎంఎస్ఎఫ్‌టీని కలిగి ఉంది. 2024-25కల్లా రూ. 2,240 కోట్ల అద్దె ఆదాయం సాధించే వీలుంది.

మాస్టెక్ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,718 టార్గెట్: రూ. 2,280

ఎందుకంటే: ఐటీ కంపెనీ మాస్టెక్.. యూకే హెల్త్‌కేర్, యూఎస్ రిటైల్, తయారీ, టెక్నాలజీ విభాగాలలో ఎదురైన సవాళ్లతో ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో బలహీన పనితీరు ప్రదర్శించింది. వీటికి క్రాస్‌కరెన్సీ సమస్యలు జత కలిశాయి. అయితే ప్రస్తుతం కంపెనీ కార్యకలాపాలు నిలకడను సాధిస్తున్నాయి. హెల్త్‌కేర్ సవాళ్లను అధిగమిస్తోంది. మూడో త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్) నుంచి కంపెనీతో మెటాసాఫ్టెక్ కార్యకలాపాలు జత కలవనున్నాయి. తద్వారా ఆదాయంలో యూఎస్ వాటా 27 శాతానికి చేరే అవకాశముంది. ఇందుకు మారిన క్రాస్‌కరెన్సీ పరిస్థితులు మద్దతివ్వనున్నాయి. క్యూ3లో సాధించిన నిలకడతో ఈ ఏడాది(2022-23) నాలుగో త్రైమాసికం(జనవరి-మార్చి) నుంచి వృద్ధి బాట పట్టవచ్చని అంచనా. వార్షిక వేతన పెంపు, ఉద్యోగ వలస తదుపరి ఇకపై నిర్వహణ మార్జిన్లు క్రమంగా మెరుగుపడనున్నాయి. క్యూ2లో మార్జిన్లు 1.34% నీరసించి 17.8 శాతానికి పరిమితమయ్యాయి. వార్షికంగా ఇవి ఫారెక్స్ నష్టాల సర్దుబాటుతో 3.34% క్షీణించగా.. వేతన పెంపు, సిబ్బంది వినియోగం 67.8 శాతానికి తగ్గడం ప్రభావం చూపాయి. త్రైమాసికవారీగా 0.9 శాతం, వార్షికంగా 5.1 శాతం వెనకడుగు వేశాయి. ఇక ఆఫ్‌షోరింగ్ యుటిలైజేషన్ 2.1% (వార్షికంగా 1.9 శాతం) తక్కువగా 73.7 శాతానికి చేరింది. సిబ్బంది నియామకాలు తగ్గడం, యుటిలైజేషన్ మెరుగుపడటం కారణంగా పటిష్ట పనితీరు చూపనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జీఎస్‌టీ వసూళ్లు @ రూ.1.50 లక్షల కోట్లు

డిసెంబర్‌లో 15 శాతం అప్



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు డిసెంబర్‌లో 15% పెరుగుదలతో రూ.1,49,507 కోట్లకు చేరాయి. 2021 ఇదే నెలతో (రూ.1.30 లక్షల కోట్లు) పోల్చితే ఈ పెరుగుదల 15 శాతంగా నమోదయ్యింది. తయారీ, వినియోగ రంగాల నుంచి డిమాండ్ పటిష్టంగా ఉందని గణాంకాలు వెల్లడించాయి. వస్తు సేవల పన్ను వసూళ్లు రూ.1.4 లక్షల కోట్లను అధిగమించడం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇది వరుసగా 9వ నెల.

ప్యాసింజర్ వాహన విక్రయాల్లో 23% వృద్ధి

2022లో 37.93 లక్షల యూనిట్ల అమ్మకాలు

ముంబై: దేశీయంగా 2022లో మొత్తం 37.93 లక్షల ప్యాసింజర్ వాహన విక్రయాలు జరిగాయి. 2021తో పోల్చితే 23% వృద్ధి నమోదైంది. మారుతి సుజుకి, హ్యుందాయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్, స్కోడా ఇండియా కార్లు రికార్డు సేల్స్ నమోదు చేసుకున్నాయి. కరోనా ప్రేరేపిత సవాళ్లు, సెమీ కండక్టర్ల కొరత తగ్గడంతో కార్లకు, ముఖ్యంగా స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)లకు గిరాకీ పెరిగింది.



కంపెనీ	డిసెంబర్ 2022	డిసెంబర్ 2021	క్షీణత/వృద్ధి(%)
మారుతీ సుజుకీ	1,39,347	1,53,149	(-)9
హ్యుందాయ్	57,852	48,933	(+)18
టాటా మోటార్స్	72,997	66,307	(+)21
హోండా కార్స్	95,022	89,152	(+)7
ద్విచక్ర వాహనాలు			
రాయల్ ఎన్‌ఫీల్డ్	68,400	73,739	(-)7
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,671	5,192	(+)28

ఐఓబీ ఎండీ, సీఈఓగా అజయ్ కుమార్ శ్రీవాస్తవ



చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ఎండీ, సీఈఓ) అజయ్ కుమార్ శ్రీవాస్తవను కేంద్రం నియమించింది. 2023 జనవరి 1వ తేదీ నుంచి ఈ నియామకం అమల్లోకి వచ్చింది. చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ఐఓబీ చీఫ్ డైరెక్టర్‌గా శ్రీవాస్తవ ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆయనకు దాదాపు 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది.

రిస్క్‌లేని రాబడులకు మార్గం

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



మనీ మార్కెట్ ఫండ్ అంటే ఏమిటి? ఎవరు ఈ ఫండ్‌లో ఎప్పుడు ఇన్వెస్ట్ చేయవచ్చు?

– నాగరాజన్ రామనాథన్

మనీ మార్కెట్ ఫండ్ అన్నది డెట్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఏడాది కాలంలో గడువు ముగిసే స్వల్పకాల డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇవి రిస్క్‌లేని ఊహించతగిన రాబడులను ఇవ్వగలవు. ఎందుకంటే అధిక నాణ్యత కలిగిన సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. అందుకే మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్ పథకాలు దాదాపు రిస్క్‌లేని, ఎంతో రక్షణతో కూడినవి. స్వల్పకాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. ఎందుకంటే అవి వైవిధ్యమైన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఏడాది కాలానికి ఇన్వెస్ట్ చేసుకునే వారు వీటిని పరిశీలించొచ్చు. బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్లపై రాబడి కంటే అధిక రాబడిని ఇవ్వగలవు. కనుక బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ బ్యాలన్స్ ఉంచుకునే వారు కూడా ఆ నిధిని ఈ సాధనాల్లోకి మళ్లించుకోవచ్చు. మొత్తం 16 రకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉండగా, లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి రిటైల్ ఇన్వెస్టర్లకు అనుకూలంగా ఉంటాయి. మీ పెట్టుబడుల కాల వ్యవధి ఏడాది అయితే లిక్విడ్ ఫండ్స్ మంచివి. ఇవి తక్కువ రిస్క్ పథకాలు. అత్యవసర నిధికి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఉపసంహరణలపై చాలా స్వల్ప చార్జీలను విధిస్తుంటాయి. ఏడాదికి మించిన దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోండి. ఏడాది నుంచి మూడేళ్ల కాల సాధనాల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడంలో ఉన్న ప్రాథమిక లక్ష్యం పెట్టుబడి పరిరక్షణతోపాటు, కొంత రాబడి కోరుకోవడం. ఈ దృష్ట్యా లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ సరిపోతాయి.

ఎవరైనా ఒక మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకోసం ఫ్లెక్సీక్యాప్ లేదా మిడ్‌క్యాప్ లేదా స్మాల్‌క్యాప్‌లో దేనిని ఎంపిక చేసుకోవాలి?

– జితేంద్ర

మీరు వీటిల్లో ఒకే పథకంలో ఇన్వెస్ట్ చేయాలనుకునేట్టు అయితే అందుకు ఫ్లెక్సీక్యాఫ్ ఫండ్ అనుకూలం. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాలతో పోలిస్తే ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. లార్జ్, మిడ్ అండ్ స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మేనేజర్‌కు ఉంటుంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్ మేనేజర్ల మాదిరిగా కాకుండా.. ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మేనేజర్ లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ లో ఎక్కడైనా, ఎంత మేర అయినా పెట్టుబడులు పెట్టుకోవచ్చు. అవకాశాలకు అనుగుణంగా ఈ పెట్టుబడులను వివిధ మార్కెట్ విభాగాల మధ్య మార్పులు చేసుకోవచ్చు. పెట్టుబడులకు పరిమితులు ఉండవు. పైగా వీటిల్లో రిస్క్ తక్కువ. ఎందుకంటే పెట్టుబడులు వివిధ మార్కెట్ విలువల మధ్య విభజించి ఉంటాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులనేవి ఒకే మార్కెట్ క్యాప్ పరిధిలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటాయి. ఇది చాలా రిస్క్. ఫ్లెక్సీక్యాప్ పథకాలు కేవలం వివిధ మార్కెట్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడమే కాకుండా, వివిధ రంగాల నుంచి ఆయా కంపెనీలను ఎంపిక చేసుకుంటుంటాయి. దీంతో అధిక రాబడులకు అవకాశం ఉంటుంది. సాధారణంగా చూస్తే ఫ్లెక్సీక్యాప్ పథకాలు 70 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, 19-20 శాతం మేర మిడ్‌క్యాప్ కంపెనీల్లో, మిగిలిన 10 శాతాన్ని స్మాల్‌క్యాప్ కంపెనీల్లో పెడుతుంటాయి. ఈ ఒక్క పథకంతో అన్ని విభాగాల్లోనూ ఎక్స్‌పోజర్ తీసుకునే అవకాశం ఉన్నందున ఇది ఆల్ ఇన్ వన్ పథకం అవుతుంది.

6 రోజులు..
రూ.1,111 కోట్లు

- ఏడాది చివర్లో భారీగా మద్యం అమ్మకాలు.. డిసెంబర్ 30న రూ.250 కోట్లపైమాటే..
- గత ఏడాదితో పోలిస్తే చివరి నాలుగు రోజుల్లో రూ.174 కోట్లు ఎక్కువ
- డిసెంబర్‌లో రూ.3,376 కోట్ల మద్యం అమ్మకాల రికార్డు
- గత ఏడాది మొత్తంతో పోలిస్తే దాదాపు రూ.500 కోట్లు ఎక్కువ

సాక్షి, హైదరాబాద్: మద్యం అమ్మకాలు 'కొత్త'పుంతలు తొక్కాయి. లిక్కర్ షాప్‌లకు కొత్త జోష్ వచ్చింది. లెక్కకు మించిన కిక్కు వచ్చింది. చలి తీవ్రతతోపాటు కొత్త సంవత్సరం వస్తోందన్న ఉత్సాహంతో మందుబాబులు తెగ తాగేశారు. సంవత్సరం చివర్లో మద్యం అమ్మకాలు రికార్డు సృష్టించాయి. 2022 డిసెంబర్ చివరివారం రూ.1,111.29 కోట్ల విలువైన మద్యం అమ్ముడు పోవడం గమనార్హం. చివరి ఆరురోజుల మద్యం అమ్మకాలు వెయ్యి కోట్ల మార్కును దాటాయి. ఒక్క డిసెంబర్ 30న రాష్ట్రంలోని మద్యం డిపోల నుంచి రూ.250 కోట్లకుపైగా విలువైన మందు వైన్‌షాపులకు తరలివెళ్లిందంటే కొత్త ఏడాది ఆరంభాన్ని మందుబాబులు ఎలా పండుగ చేసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. చివరి నాలుగు రోజుల అమ్మకాల విషయానికి వస్తే 2021 డిసెంబర్‌లో చివరి నాలుగు రోజుల్లో రూ.600 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా, ఈసారి అది రూ.775 కోట్లు దాటింది. డిసెంబర్‌ను పరిగణనలోకి తీసుకుంటే 2021లో రూ.2,901 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోగా, 2022 డిసెంబర్‌లో ఆ విలువ రూ.3,376 కోట్లు దాటింది. అంటే గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.500 కోట్లు పెరిగిందన్నమాట. 2021 సంవత్సరం మొత్తం మీద 2.73 కోట్ల లిక్కర్ కేసులు, 2.45 కోట్ల బీర్ కేసులు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.18,868 కోట్లపైచిలుకు కాగా, 2022లో జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు రూ.34,352.75 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో 3.5 కోట్ల లిక్కర్, 4.5 కోట్ల కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. 2020తో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా ఎక్కువ కావడం గమనార్హం. 2020లో రూ.16,254 కోట్లు అమ్ముడుపోయింది.

డిసెంబర్ నెల చివరి ఆరు రోజుల్లో లిక్కర్ అమ్మకాల వివరాలు రోజువారీగా..

తేదీ	లిక్కర్	బీర్	విలువ
డిసెంబర్ 26	1,66,301	2,70,129	182.28
డిసెంబర్ 27	133472	250608	155.29
డిసెంబర్ 28	1,29,457	1,70,240	144.79
డిసెంబర్ 29	1,53,002	1,12,066	159.14
డిసెంబర్ 30	2,71,062	60,972	254.05
డిసెంబర్ 31	2,17,399	1,28,446	215.74

హోం మంత్రి అలీతో డీజీపీ అంజనీకుమార్ భేటీ



సాక్షి, హైదరాబాద్: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కొత్త డీజీపీ అంజనీకుమార్ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీని ఆయన అధికార నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సైతం హోం మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న జితేందర్, ఏసీబీ నూతన డీజీపీ రవిగుప్తా సైతం మహమూద్‌అలీని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సైబర్ నేరాలపై దృష్టి పెట్టాలి

పోలీస్ ఉన్నతాధికారులకు డీజీపీ సూచన

సాక్షి, హైదరాబాద్: సమాజానికి సవాలుగా మారుతున్న సైబర్ నేరాల కట్టడిపై 2023 ఏడాదిలో మరింతదృష్టి పెట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు డీజీపీ అంజనీకుమార్ సూచించారు. ఈ మేరకు ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్స్ మెస్‌లో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు డీజీపీ అంజనీకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యూ ఇయర్ కేక్ కట్ చేసిన అనంతరం పోలీస్ ఉన్నతాధికారులనుద్దేశించి డీజీపీ అంజనీకుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసీబీ డీజీపీ రవిగుప్తా, హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్‌జైన్, టీఎస్ఎస్పీ అదనపు డీజీ అభిలాషబిస్త్, ఏసీబీ డైరెక్టర్ శిఖా గోయెల్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



గ'ఘన'యానం!

మళ్లీ విమానయానానికి ప్రయాణికుల మొగ్గు

- కోవిడ్ ముందు నాటి పరిస్థితులు కనిపిస్తున్న తీరు
- గతేడాదితో పోలిస్తే 70 శాతంపైగా పెరిగిన దేశీయ ప్రయాణం
- కలిసి వస్తున్న పర్యాటకం, వాణిజ్య అవసరాలు
- కొత్త నగరాలకు కూడా విమానాల జోరు

కోవిడ్‌కు ముందు, తర్వాత విమాన ప్రయాణికుల సంఖ్య ఇదీ..

నగరం	2019లో	2021లో	2022లో
తెలుగు రాష్ట్రాల నుంచి..			
హైదరాబాద్	1,20,27,096	63,46,119	1,12,17,337
విశాఖపట్నం	17,13,317	9,51,263	14,84,743
విజయవాడ	7,92,581	3,40,637	6,11,492
తిరుపతి	5,72,581	3,37,611	5,96,160
రాజమండ్రి	2,63,844	1,79,822	2,82,925
జాతీయ స్థాయిలో..			
ఢిల్లీ	3,33,70,600	1,91,64,276	3,17,25,247
ముంబై	2,27,22,740	1,02,50,332	2,02,41,843
బెంగళూరు	1,88,58,025	87,55,900	1,72,19,584
చెన్నై	1,11,42,250	44,42,830	86,82,378

(ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య గణాంకాలు)

సాక్షి, హైదరాబాద్: గాలి మోటారు ప్రయాణం మళ్లీ గాడిలో పడింది. పనిమీదైనా, పర్యాటకానికైనా విమాన యానమే ఉత్తమమనే భావన ఏర్పడింది. కరోనా విశ్వరూపంతో కుదేలైన విమానరంగం పూర్వ వైభవం దిశగా టేకాఫ్ తీసుకుంది. దేశీయ ప్రయాణం మునుపటి వృద్ధి సాధించగా.. అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. అత్యుత్తమ సేవలతో దూసుకెళ్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల సంఖ్యలో దేశంలో ఐదోస్థానానికి చేరింది. తాజాగా సమయ పాలనకుగాను స్కైట్రాక్స్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. అయితే విమానయాన రంగానికి మరోసారి కోవిడ్ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా.. కొత్త వేరియంట్లతో మనకొచ్చే ముప్పులేదంటున్న వైద్యనిపుణుల భరోసా భయాన్ని దూరం చేస్తోంది.

సమయం.. సానుకూలం..

విమానయానంలో ప్రధానమైనది తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకోగలగడం. దీనితో ప్రయాణికులు మునుపెన్నడు లేనివిధంగా మెట్రో నగరాలతోపాటు చిన్న నగరాలకు కూడా విమాన ప్రయాణమే మంచి మార్గంగా పరిగణిస్తున్నారు. గత నెలరోజులుగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రధాన నగరాల నుంచి కేరళ వెళ్లేందుకు అయ్యప్ప భక్తులు వేల సంఖ్యలో ఫ్లైట్ ప్రయాణానికే మొగ్గుచూపుతున్నారు. దీంతో కొచిన్, త్రివేండ్రం వెళ్లే విమానాలు అయ్యప్పభక్తుల రద్దీతో కనిపిస్తున్నాయి. ఇక తిరుపతి, షిర్డీ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారు విమానాలను ఆశ్రయిస్తున్నారు. దీనితో గతేడాదితో పోలిస్తే సదరు విమానాశ్రయాలకు ప్రయాణికుల సంఖ్యలో 70 శాతానికిపైగా వృద్ధి నమోదైంది.

కొత్త నగరాలకూ రాకపోకలు..

ఏపీలో కొత్తగా ప్రారంభమైన కడప, కర్నూలు విమానాశ్రయాల నుంచి ప్రయాణికుల రాకపోకల సంఖ్య పెరుగుతోంది. నిరుటితో పోలిస్తే యాభైశాతానికి పైగా ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు భారత విమానయాన ప్రాధికార సంస్థ(ఏఏఐ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎయిర్‌పోర్టులకు సమీపంలోని జిల్లాల ప్రజలు గతంలో హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాలను ఆశ్రయించేవారు. ఇప్పుడు కడప, కర్నూలు విమానాశ్రయాలు అందుబాటులోకి రావడంతో ఇక్కడి వారికి దేశీయ ప్రయాణం చేరువైంది.

పరిశ్రమలు.. పర్యాటకంతోనూ..

పరిశ్రమల వృద్ధితో పాటు పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో దేశీయ ప్రయాణికుల రాకపోకలు గతేడాదితో పోలిస్తే 76.8 శాతం అత్యధికంగా నమోదయ్యాయి. దక్షిణ భారతదేశంలో ముఖ్య నగరంగా ఉన్న హైదరాబాద్‌కు అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. నవంబరు నెలలో 2,90,611 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

గోవాకు మరో రెండు విమానాలు

కోవిడ్‌కు ముందు హైదరాబాద్ నుంచి దేశీయంగా మొత్తం యాభై గమ్యస్థానాలకు మాత్రమే విమానాలు రాకపోకలు సాగించేవి. ఏడాదిన్నరగా దేశీయ గమ్యస్థానాల సంఖ్య 70 చేరింది. ఆయా రాష్ట్రాల్లోని చిన్న నగరాలకు కూడా భాగ్యనగరం నుంచి రాకపోకలు సాగుతున్నాయి. త్వరలో గోవాలోని మోపా విమానాశ్రయానికి హైదరాబాద్ నుంచి ఇండిగో, గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు రెండు కొత్త విమాన సర్వీసులను ప్రారంభించనున్నాయి.

అంతర్జాతీయ ప్రయాణాలు పెరిగాయి

దేశీయ ప్రయాణికులే కాకుండా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు కూడా గణనీయంగా పెరిగాయి. దుబాయ్, మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్, యూరోప్ దేశాలకు ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. రోజూ 8వేల మందికిపైగా అంతర్జాతీయ ప్రయాణికులు ఉంటున్నారు. కొత్తగా బాగ్దాద్, ఢాకా నగరాలకు సైతం విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. వైద్యసేవల కోసం నగరానికి వచ్చే మెడికల్ టూరిస్టుల సంఖ్య క్రమంగా మెరుగుపడుతోంది.

సౌకర్యవంతంగా ఉంటుందని..



మేం 9 మంది అయ్యప్ప భక్తులం. నలభై ఐదు రోజులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకుని కొచిన్ వెళ్లి అక్కడి నుంచి శబరిమలకు చేరుకున్నాం. దర్శనం పూర్తి చేసుకుని త్వరగా గమ్యస్థానాలకు చేరుకున్నాం. సమయం, సౌకర్యవంతం రెండూ ఉన్నాయి. ఇప్పుడు అయ్యప్ప భక్తులు వేల సంఖ్యలో విమానాల్లోనే శబరిమలకు వెళ్లి వస్తున్నారు.

– డాక్టర్ శంకర్‌కుమార్, ప్రభుత్వ సిటీ కళాశాల అధ్యాపకుడు

డిమాండ్ బాగా పెరిగింది



కొద్దినెలలుగా విమానాలకు డిమాండ్ బాగా పెరిగింది. అంతర్జాతీయ ప్రయాణాలు కూడా ఊపందుకున్నాయి. ముఖ్యంగా కోవిడ్ కాలంలో రెండేళ్ల పాటు ఎక్కడికీ వెళ్లకుండా నగరానికే పరిమితమైనవారు గత ఏడాది కాలంగా ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో యూరోప్, ఆసియా దేశాలకు సకాలంలో వీసాలు కూడా లభించడం లేదు. అమెరికా ఇటీవలి వరకు పర్యాటక వీసాలపై నిషేధం విధించింది. ఇటీవలే తిరిగి స్లాట్లు ఓపెన్ చేశారు. అవీ కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలోనే అయిపోవడం విశేషం. స్లాట్ల సంఖ్య పెంచితే యూఎస్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతుందని చెప్పేందుకు ఇది నిదర్శనం.

– హతను హల్దార్, బుకింగ్ మేనేజర్, గోగాగా హాలీడేస్ ప్రైవేట్ లిమిటెడ్

మియాపూర్ టు సంగారెడ్డి
ట్రాఫిక్ రద్దీకి చెక్

ఆరు వరుసలుగా రోడ్డు.. రూ.1,400 కోట్లతో విస్తరణ

- డీపీఆర్ పూర్తి.. త్వరలో కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి
- ఏప్రిల్ నాటికి టెండర్లు.. రెండేళ్లలో పనులు పూర్తి



సాక్షి, హైదరాబాద్: మియాపూర్–సంగారెడ్డి మార్గంలో నిత్యం నరకప్రాయంగా ఉన్న ట్రాఫిక్ రద్దీకి తెరపడనుంది. ట్రాఫిక్ చిక్కులు తొలగిపోనున్నాయి. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మియాపూర్ నుంచి సంగారెడ్డి కూడలి (పోతిరెడ్డిపల్లి చౌరస్తా) వరకు ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రోడ్డును ఆరు వరుసలుగా 60 మీటర్లకు విస్తరించనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి డీపీఆర్ సిద్ధమైంది. వారం రోజుల్లో ఇది కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రిత్వ కార్యాలయ అనుమతి కోసం ఢిల్లీ చేరనుంది. అక్కడి నుంచి అనుమతులు రాగానే టెండర్లు పిలిచేందుకు జాతీయ రహదారుల విభాగం ఏర్పాట్లు చేస్తోంది. 31 కి.మీ. నిడివి ఉన్న ఈ రోడ్డు విస్తరణకు రూ.1,400 కోట్ల వ్యయం కానుంది. ఇందులో రోడ్డునిర్మాణ పనులకు రూ.వేయి కోట్లు, భూసేకరణ పరిహారానికి రూ.400 కోట్లు ఖర్చు కానుంది.

నగరంలోనే పెద్ద రోడ్డుగా..

ఈ మార్గంలోనే ఉన్న కూకట్‌పల్లి వద్ద అత్యంత రద్దీ ట్రాఫిక్ వాహనదారులను బెంబేలెత్తిస్తోంది. మెట్రోరైలు ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ ఇప్పటికే మియాపూర్ వరకు రోడ్డును విస్తరించింది. అక్కడి నుంచి రోడ్డు విస్తరణ బాధ్యతను జాతీయ రహదారుల విభాగం తీసుకుంది. ఈ రోడ్డు 60 మీటర్లకు వెడల్పు కానుంది. ప్రధాన క్యారేజ్ వే, దాని పక్కన సర్వీస్ రోడ్లు కలిపి 200 అడుగుల విశాలంతో రోడ్డు ఏర్పడుతుంది. నగరంలో విశాలంగా ఉన్న ప్రధాన రోడ్డు ఇదే కానుంది. ప్రస్తుతం రోడ్డు నాలుగు వరుసలుగా ఉన్నా.. 60 మీటర్ల స్థలం మాత్రం అందుబాటులో ఉంది. ఇప్పుడు ఆ మొత్తం రోడ్డుగా మారబోతోంది.

అవసరమైన చోట్ల ఫ్లైఓవర్లు

ఈ రోడ్డులో వాహనాలకు క్రాసింగ్ రోడ్లతో ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్లను నిర్మిస్తారు. ఇందులో బీహెచ్ఈఎల్ వద్ద ఫ్లైఓవర్ రానుంది. దీనిని ఈ రోడ్డులో భాగంగానే నిర్మించాల్సి ఉంది. అక్కడ ట్రాఫిక్ చిక్కుల దృష్ట్యా ఆ పనులను విడదీశారు. త్వరలో అక్కడ నిర్మాణ పనులు జరగబోతున్నాయి. ఇక పటాన్‌చెరు, ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారం,కంది ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు.

నగరంలో ప్రస్తుతం రోడ్డు విస్తరణకు వీలుగా 60 మీటర్ల స్థలం అందుబాటులో ఉంది. కొన్ని ప్రాంతాల్లో తప్ప పెద్దగా నిర్మాణాలు అడ్డుగా లేవు. బీహెచ్ఈఎల్ దాటిన తర్వాత చాలా ప్రాంతాల్లో నిర్మాణాలను తొలగించాల్సి ఉంది. ఏప్రిల్ నాటికి టెండర్లు పూర్తి చేసి జూలై నాటికి పనులు ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు ప్రారంభమైన రెండేళ్లలో పూర్తి చేయాలన్నది లక్ష్యం. కానీ, రెండున్నరేళ్లలో పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.

విజిట్ వీసాల పొడిగింపునకు
యూఏఈ నో!

గడువు ముగిస్తే స్వదేశాలకు వెళ్లాల్సిందే..

మోర్తాడ్(బాల్కొండ): విజిట్ వీసాలపై వచ్చే వారికి గతంలో ఇచ్చిన సడలింపులను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ప్రభుత్వం ఎత్తివేసింది. యూఏఈకి విజిట్ వీసాలపై వచ్చినవారు వీసా గడువు పొడిగించుకోవడానికి అక్కడి ప్రభుత్వం గతంలో అనుమతిచ్చేది. కరోనా పరిస్థితుల దృష్ట్యా విజిట్ వీసాలపై వచ్చినవారికి 3 నుంచి 6 నెలల వరకు వీసా గడువు పెంచింది.సాధారణ పరిస్థితులు నెలకొనడంతో నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. గతంలో ఎవరైనా విజిట్ వీసాలపై యూఏఈకి వెళ్లిన తర్వాత అక్కడి కంపెనీల్లో పని వెతుక్కుని వర్క్ వీసా పొందేవారు. వర్క్ వీసా లభించేవరకు విజిట్ వీసాల గడువును పొడిగించుకునే అవకాశం ఉండేది. కానీ, ప్రస్తుతం కంపెనీలు సకాలంలో వర్క్ వీసాలు జారీ చేయకపోతే విజిట్ వీసాలపై వచ్చినవారు ఇతర గల్ఫ్ దేశాలకు వెళ్లి మళ్లీ వీసాను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. ఈ అవకాశం ఒక్కసారి మాత్రమే కల్పించడంతోపాటు భారతీయులకే వర్తింపజేయడం విశేషం. ఇతర దేశాలవారు తమ సొంత దేశానికి వెళ్లి కొత్త వీసాపై యూఏఈ రావాల్సిందే. విజిట్ వీసాలపై యూఏఈ వెళ్లిన భారతీయులకు మాత్రం ఏదైనా కంపెనీ వీసా గడువు ముగిసేలోగా వర్క్ పర్మిట్‌ను జారీ చేస్తే యూఏఈలో ఉండిపోవడానికి అవకాశం ఉంది. వీసాల నిబంధనల్లో మార్పులు తీసుకువచ్చిన యూఏఈ ప్రభుత్వం భారతీయుల విషయంలో సానుకూలంగా ఉండటం మంచి పరిణామమేనని గల్ఫ్ వలస కార్మికుల సంఘాలు పేర్కొంటున్నాయి.

జీఎం ఆవాలు.. జనానికి సవాలు

- జనం మేలుకోకపోతే.. ఇక జన్యుమార్పిడి పంటల వెల్లువే!
- 'జీఎం' ఆవాల కన్నా ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలున్నాయి
- 'సాక్షి'తో ముఖాముఖిలో భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ కన్వీనర్ జాకబ్



మనదేశంలో ఇప్పటివరకు ప్రభుత్వ అనుమతి ఉన్న ఏకైక జన్యుమార్పిడి పంట బీటీ పత్తి. ఇప్పుడు ఆహార పంటల్లోకీ జన్యుమార్పిడి సాంకేతికత విస్తరిస్తోంది. జన్యుమార్పిడి ఆవాల సాగుకు కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన జెనిటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ (జేఈఏసీ) ఇటీవల అనుమతులు ఇవ్వటంతో చాలా ఏళ్ల తర్వాత జీఎం టెక్నాలజీ మళ్లీ చర్చనీయాంశమైంది. చీడపీడలను తట్టుకునే బీటీ జన్యువుతోపాటు కలుపుమందును తట్టుకునేలా కూడా జన్యుమార్పిడి చేసిన (హెచ్‌టీబీటీ) హైబ్రిడ్ ఆవాల రకం డీఎంహెచ్–11కు జేఈఏసీ పచ్చజెండా ఊపింది. ప్రకృతి/ సేంద్రియ వ్యవసాయ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వమే.. రసాయన కలుపు మందులను తట్టుకునే జన్యుమార్పిడి ఆహార పంటలకు గేట్లు తెరవటం విమర్శలకు తావిస్తోంది. సేంద్రియ సాగులో రసాయనాలతోపాటు జన్యుమార్పిడి పంటలూ నిషిద్ధమే. దేశవాళీ విత్తన పరిరక్షణ కృషిలో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థ 'భారత్ బీజ్ స్వరాజ్ మంచ్' హెచ్‌టీబీటీ ఆవ పంటపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో 'మంచ్' కన్వీనర్ జాకబ్ నెల్లితానంతో 'సాక్షి'తో చెప్పిన ముఖ్యాంశాలు..

- కేంద్రం చెబుతున్నట్లు దేశంలో ఆవాల దిగుబడి పెంచటం కోసమే అయితే కలుపుమందును తట్టుకునే హైబ్రిడ్ బీటీ ఆవ వంగడానికి అనుమతి ఇవ్వాల్సిన అవసరం లేదు. అధిక దిగుబడినిచ్చే వంగడాలు మన దగ్గర ఇప్పటికే ఉన్నాయి. జన్యుమార్పిడి ఆవ రకం హెక్టారుకు 30–32 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే, అంతకన్నా ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలు మన రైతుల దగ్గర ఉన్నాయి. ఉదాహరణకు.. 'గోబి సార్సన్ మస్టర్డ్' రకం. ఇది సేంద్రియ సేద్యంలో హెక్టారుకు 40 క్వింటాళ్ల దిగుబడి నిస్తుంది. ప్రభుత్వం దిగుబడులు పెంచాలనుకుంటే ఇటువంటి వంగడాలను పోత్సహించుకోవచ్చు కదా?
- ఆహార పంటల్లో కూడా జన్యుమార్పిడి సాంకేతికతను ప్రవేశపెట్టడమే ప్రభుత్వ ఉద్దేశం. జన్యుమార్పిడి ఆవ పంట కావాలని రైతులు అడగలేదు. ప్రజలు స్పందించి ఉద్యమించి అడ్డుకోకపోతే మరిన్ని ఆహార పంటలకు సంబంధించి జన్యుమార్పిడి విత్తనాలకు అనుమతులిచ్చే ముప్పు పొంచి ఉంది.
- రైతులకు ఉండే సంప్రదాయ విత్తనాల హక్కులను జన్యుమార్పిడి విత్తనాలు ధ్వంసం చేస్తాయి. వీటిని కార్పొరేట్ కంపెనీల లాభాపేక్ష కోసమే జన్యుమార్పిడి చేసి, విత్తనాలను కంపెనీల ఆస్తిగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం పూనుకుంటోంది. అదీగాక జన్యుమార్పిడి విత్తనాల వల్ల సంప్రదాయ పంటల స్వచ్ఛత దెబ్బతింటుంది. జన్యుకాలుష్యం జరిగితే తర్వాత మళ్లీ పాత స్థితికి తేవటం సాధ్యం కాదు. అందుకే జన్యుమార్పిడి పంటలను మేం వ్యతిరేకిస్తున్నాం.

–సాక్షి, సాగుబడి

బీఎస్సీ హెల్త్ సైన్సెస్ ఫీజు రూ.15వేలు!

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రతిపాదనలు

- మెరిట్ ఆధారంగా హెల్త్ సైన్సెస్ సీట్ల భర్తీ
- ఈ ఏడాది గాంధీ సహా 9 ప్రభుత్వ వైద్య కాలేజీల్లో సీట్లు
- వచ్చే సంవత్సరం ప్రైవేట్ కాలేజీలకూ అనుమతి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కొత్తగా ప్రవేశపెట్టబోయే బీఎస్సీ హెల్త్ సైన్సెస్ కోర్సులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. అందుకు సంబంధించి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేసింది. నాలుగేళ్ల ఈ హెల్త్‌సైన్సెస్ కోర్సులను గాంధీ, ఉస్మానియా సహా 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఈ ఏడాది ప్రవేశపెడుతున్నారు. కొత్త కోర్సులు కావడంతో వీటికి మరింత డిమాండ్ ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఈ కాలేజీలు యూనివర్సిటీకి చెల్లించాల్సిన ఫీజు రూ. 6వేలు కాగా, విద్యార్థుల నుంచి ఏడాదికి రూ.15 వేల వరకు ఫీజు వసూలు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. అంటే మూడేళ్లకు రూ.45 వేల ఫీజు ఉండొచ్చు. మరో ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. చివరి ఏడాదిలో విద్యార్థులకే స్కాలర్‌షిప్ ఇస్తారు. ఫీజు వివరాలను త్వరలో వెల్లడిస్తామని వర్సిటీ ప్రకటించింది. ఈనెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం పదో తరగతి ఆధారంగా పారామెడికల్ కోర్సులు ఉండగా, బీఎస్సీ డిగ్రీతో మొదటిసారిగా వీటిని ప్రవేశపెడుతున్నారు. దీనివల్ల మరింత నైపుణ్యం కలిగిన ఆరోగ్య సాంకేతిక నిపుణులు తయారుకానున్నారు. దీనివల్ల వైద్య సేవలు మరింత పటిష్టం కానున్నాయి. వీటిల్లో చేరే విద్యార్థులకు ప్రైవేట్ రంగంలోనూ మంచి ఆఫర్లు ఉంటాయి. అలాగే విదేశాల్లోనూ డిమాండ్ ఉంటుందని కాళోజీ వర్గాలు చెప్పాయి. ఈ నేపథ్యంలో ముమ్ముందు ఇతర ప్రభుత్వ మెడికల్ కాలేజీలు సహా ప్రైవేట్ కాలేజీల్లోనూ ఈ కోర్సులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.

కోటా అభ్యర్థులు లేకుంటే ఓపెన్‌లోకి..

- మొత్తం సీట్లలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వు చేశారు. ఈ కేటగిరీ అభ్యర్థులు లేకుంటే రిజర్వ్‌డ్ సీట్లు ఓపెన్ కేటగిరీకి వెళ్తాయి. వాటిని మెరిట్ ఆధారంగా కేటాయిస్తారు.
- 29 శాతం సీట్లు బీసీలకు కేటాయిస్తారు. అర్హత గల అభ్యర్థులు లేకుంటే, మిగిలిన సీట్లను తదుపరి సబ్–గ్రూప్ అభ్యర్థులకు కేటాయించవచ్చు. వారు కూడా అందుబాటులో లేకుంటే, ఓపెన్ కేటగిరీకి మారుస్తారు.
- ఈడబ్ల్యూఎస్ కోటాలో 10% సీట్లు ఉన్నాయి.
- ప్రతి కేటగిరీలో మహిళా అభ్యర్థులకు 33.3 శాతం కేటాయిస్తారు. 5 శాతం దివ్యాంగులకు కేటాయిస్తారు.
- స్థానిక రిజర్వేషన్ 85 శాతం ఉంటుంది.
- మెరిట్ జాబితాను బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో పొందిన మార్కుల ఆధారంగా తయారుచేస్తారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఒకే ప్రయత్నంలో ఉత్తీర్ణులైనవారా కాదా అనేది కూడా చూస్తారు. పాత అభ్యర్థులకు అధిక మెరిట్ ఉంటుంది.
- కోర్సు వ్యవధిలో ఒక కళాశాల నుంచి మరొక కళాశాలకు విద్యార్థుల బదిలీలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- ఈ సంవత్సరం 860 సీట్లను భర్తీ చేస్తారు. ప్రస్తుతం నేరుగా దరఖాస్తు చేయొచ్చు. ఇంటర్మీడియెట్ మెరిట్ ఆధారంగా సీటు కేటాయిస్తారు. రాబోయే రోజుల్లో ఎంసెట్‌కుగానీ లేదా ఇతరత్రా ఏదైనా ప్రవేశ పరీక్షకు అనుసంధానిస్తారు.

బీఎస్సీ హెల్త్‌సైన్సెస్ కోర్సులివీ..

- అనెస్థీషియా టెక్నాలజీ
- ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ
- కార్డియాక్ కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ
- రెనాల్ డయాలసిస్ టెక్నాలజీ
- ఆప్టోమెట్రీ, రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ
- న్యూరో సైన్స్ టెక్నాలజీ
- క్రిటికల్ కేర్ టెక్నాలజీ
- రేడియాలజీ ఇమేజింగ్ టెక్నాలజీ
- ఆడియోలజీ స్పీచ్ థెరపీ టెక్నాలజీ
- మెడికల్ రికార్డ్స్ సైన్సెస్
- న్యూక్లియర్ మెడిసిన్
- రేడియో థెరపీ టెక్నాలజీ

'జల్లికట్టు' జోష్

అసలే కోడెగిత్తలు. సై అంటే సైసై అంటూ రంకెలేస్తాయి. అటువంటి కోడె గిత్తలను అందంగా ముస్తాబు చేసి పరుష పందేలు(జల్లికట్టు) బరిలో ఆదివారం దించారు తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని కొత్తశానంబట్ల గ్రామస్తులు. పోటెత్తిన జనసందోహం మధ్య దూసుకొస్తున్న కోడె గిత్తలను నిలువరించేందుకు యువకులు జోష్‌తో పోటీ పడ్డారు. కోడె గిత్తల విన్యాసాలు చూసి మురిసిపోయారు. కొత్త సంవత్సరం మొదటి రోజు పరుష పందేలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. – చంద్రగిరి



రంకెలేస్తూ పరుగులెడుతున్న కోడెగిత్తలు

కొత్తగా 7 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆదివారం 2,748 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఏడుగురు వైరస్ బారినపడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒకరోజులో 9 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్న వారి సంఖ్య 8.37 లక్షలకు చేరినట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.